RNI Reg-No. 69176/96

# నేటి మనదేశమ్

తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Medchal Malkajgiri

CIRCULATED THROUGHOUT TELANGANA STATE

సంపుటి :31 సంచిక : 219 హైదరాబాద్ సంపాదకులు: కె.ఎస్.రంగశాయి: శుక్రవారం 13-03-2026 పేజీలు : 12 వెల: 1-00


## కవిత ఇంటికి సీబీఐ అధికారులు



**హైదరాబాద్, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఇంటికి సీబీఐ అధికారులు వచ్చారు. ఢిల్లీ మద్యం కేసులో సీబీఐ అభియోగాలు నిరాధారంగా ఉన్నాయని ఇటీవల రౌజ్ అవెన్యూ కోర్టు తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ తీర్పుపై దర్యాప్తు సంస్థ సీబీఐ హైకోర్టులో అప్పీల్ చేసింది. ఈ నేపథ్యంలో సమన్లు ఇచ్చేందుకు అధికారులు కవిత ఇంటికి చేరుకున్నారు. సీబీఐ నోటీసులపై కవిత స్పందించారు. ఈ నెల 16న విచారణకు హాజరు కావాలని సీబీఐ అధికారులు తెలిపారన్నారు. నోటీసులపై తన లీగల్ టీమ్‌తో చర్చిస్తున్నట్లు పేర్కొన్నారు. కేసు విచారణలో అధికారులకు సంపూర్ణంగా సహకరిస్తానని చెప్పారు.

# తెలంగాణలో కమర్షియల్ సిలిండర్ల కొరత

### నేడు చమురు కంపెనీలతో ప్రభుత్వం చర్చలు: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలంగాణలో కమర్షియల్ సిలిండర్ల కొరత వాస్తవమేనని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిత్యం సరఫరా అవుతున్న వంట గ్యాస్ సిలిండర్లలో దాదాపు 86 శాతం డొమెస్టిక్ కనెక్షన్లేనని ఆయన స్పష్టం చేశారు. అలాగే మిగిలిన 14 శాతం మాత్రమే కమర్షియల్ అని వివరించారు. ప్రస్తుతానికి డొమెస్టిక్ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి కొరత లేదని తమ శాఖ అధికారులు వెల్లడించారని చెప్పారు. కానీ కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో మాత్రం కొన్ని ఇబ్బందులు ఉన్నాయన్నది వాస్తవమని తెలిపారు. రాష్ట్రంలో వంట గ్యాస్ తాజా పరిస్థితిపై చర్చించేందుకే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు, చమురు కంపెనీల ప్రతినిధులతో శుక్రవారం సమీక్షిస్తామని మంత్రి ఉత్తమ్ వివరించారు. రాష్ట్రంలో రోజూ ఎన్ని కమర్షియల్ సిలిండర్లు అవసరం, సరఫరా ఏ మేరకు ఉంది, గ్యాస్ కొరతకు గల కారణాలు, అందుకు మిగతా 2లో..




# హైదరాబాద్‌లో నెట్‌ఫ్లిక్స్ స్టూడియో

### ❍ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి ❍ఫ్యూచర్‌సిటీలో ఏర్పాటుకు భూమి కేటాయిస్తామని ప్రకటన

**హైదరాబాద్, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నెట్‌ఫ్లిక్స్‌ను హైదరాబాద్‌కు ఆహ్వానిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ అన్ని అవకాశాలను కల్పిస్తుందని, తమ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని చెప్పారు. హైటెక్‌సిటీలోని నెట్‌ఫ్లిక్స్‌కు చెందిన ఐలైన్ స్టూడియోస్ కార్యాలయాన్ని మిగతా 2లో..

## కాశ్మీర్ మాజీ సిఎం ఫరూక్ అబ్దుల్లాపై హత్యాయత్నం

### తృటిలో తప్పించుకున్న మాజీ ముఖ్యమంత్రి
### తనది 20 ఏళ్ల పగ అన్న దుండగుడు



**జమ్ము, మార్చి 12 (ఆర్ఎన్ఎ):** జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లాపై హత్యాయత్నం జరిగింది. ఓ వివాహ వేడుకలో నిందితుడు ఆయనపై కాల్పులకు పాల్పడేందుకు ప్రయత్నించాడు. వెంటనే భద్రతా సిబ్బంది అప్రమత్తమవడంతో.. ఫరూక్ సురక్షితంగా బయటపడ్డారు. 20 ఏళ్లుగా తాను ఫరూక్‌ను చంపాలనుకుంటున్నానని నిందితుడు పోలీసులతో పేర్కొన్నాడు. బుధవారం జమ్మూ శివార్లలోని హోటల్‌లో మిగతా 2లో..

## పొన్నంతో కోదండరామ్ భేటీ

### తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలపై చర్చ



**హైదరాబాద్, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మంత్రి పొన్నం ప్రభాకర్‌తో ఆయన నివాసంలో తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్, కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించారు. ఎన్నికల సమయంలో తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలుకు.. కమిటీ ఏర్పాటుపై ప్రాథమికంగా సమావేశమయ్యారు. కమిటీలో మహిళలకు అవకాశం ఇవ్వడంతో పాటు.. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని చర్చించారు. తెలంగాణ ఉద్యమకారుల హామీల అమలు విధి విధానాలు, అర్హుల ఎంపిక తదితర అంశాలపై మంత్రితో చర్చించారు. జిల్లాల వారీగా అర్హులను గుర్తించి ఉద్యమకారుల డిమాండ్లపై అధ్యయనం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్ద ఉద్యమకారుల కమిటీ సమావేశం ఏర్పాటు చేసేలా చర్చించారు. వారంలో మరోసారి సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు.

# బిఆర్ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు క్లోజ్

### స్పీకర్ నిర్ణయంతో ఏకీభవించిన సుప్రీం.... తదుపరి విచారణ అవసరం లేదని వ్యాఖ్య




**న్యూఢిల్లీ, మార్చి 12 (ఆర్ఎన్ఎ):** తెలంగాణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసు విచారణ ఎట్టకేలకు ముగిసింది. రాష్ట్ర రాజకీయాల్లో కొన్నిరోజులుగా తీవ్ర కలకలం రేపిన ఈ కేసు విచారణను గురువారం నాడు సుప్రీంకోర్టు ముగించింది. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణీత గడువులోగా నిర్ణయం తీసుకోవాలని చెప్పినా.. స్పీకర్ నిర్ణయం తీసుకోలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేటీఆర్, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ గురువారం విచారణకు రాగా విచారణ కొనసాగించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్లపై సుదీర్ఘ విచారణ అనంతరం ఉన్నత న్యాయస్థానం తుది తీర్పు వెలువరించింది . ఈ కేసును జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించగా.. స్పీకర్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై తెలంగాణ స్పీకర్ ఇప్పటికే విచారణ జరిపి, తగిన నిర్ణయం తీసుకున్నారని ఆయన కోర్టుకు వివరించారు. దీంతో ఈ సమస్య సభాపతి కార్యాలయంలోనే ముగిసిందన్నారు. సింఘ్వీ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం.. ఈ వ్యవహారంపై స్పీకర్ ఇప్పటికే తుది నిర్ణయం తీసుకున్నందున విచారణ కొనసాగించాల్సిన అవసరం లేదని భావించింది. దీంతో కోర్టు విచారణ ముగిసినట్లేనని వెల్లడించింది. స్పీకర్ ఆదేశాలను రెండు రోజుల్లో అధికారికంగా ప్రచురించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఆ తరువాత పిటిషనర్లకు కావాల్సిన డాక్యుమెంట్లను కూడా నాలుగు రోజుల్లో అందజేయాలని సూచించింది. దీంతో 10 మంది ఎమ్మెల్యేలకు సభాపతి క్లీన్ చిట్ ఇచ్చినట్లైంది. ఈ వ్యవహారంలో పదిమంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఊరట దక్కింది. అయితే పోరాడిన బిఆర్ఎస్‌కు మాత్రం న్యాయం దక్కలేదని ఆ పార్టీ నేతలు వ్యాఖ్యానించారు. స్పీకర్ తీర్పుపై ఇప్పటికే బిఆర్ఎస్ తన నిరసన తెలియచేసింది. స్పీకర్ తీర్పును సవాల్ చేస్తామన్న బిజెపికి కూడా ఈ తీర్పుతో ఇక అవకాశం లేనట్లుగానే భావించాలి.

## యాదాద్రీశుడిని దర్శించుకున్న గవర్నర్

■గవర్నర్ శుక్లా దంపతులకు ఘన స్వాగతం

■దర్శనం చేయించి, వేదాశీర్వచనం ఇచ్చిన పండితులు



**యాదాద్రి, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** యాదగిరిగుట్టలో కొలువైన శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని తెలంగాణ నూతన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా దర్శించుకున్నారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దర్శనం కోసం గురువారం ఉదయం యాదగిరిగుట్టకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతోపాటు ఆయన కుటుంబ సభ్యులు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వామి అమ్మవార్లకు గవర్నర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతోపాటు ఆయన కుటుంబ సభ్యులకు ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆ తర్వాత వారికి ఆలయ ఈవో భవానీ శంకర్ స్వామివారి జ్ఞాపికతోపాటు ప్రసాదాన్ని అందజేశారు. గవర్నర్ రాక సందర్భంగా యాదగిరిగుట్ట పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. తెలంగాణ నూతన గవర్నర్‌గా శివ ప్రతాప్ శుక్లా బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. హైదరాబాద్ లోక్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్‌గా ప్రతాప్ శుక్లా చేత తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రమాణ స్వీకారం చేయించిన సంగతి తెలిసిందే. సీఎం రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులతోపాటు ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గ్యాస్ కొరతపై విపక్షాల ఆందోళన

### పార్లమెంటు నుంచి బయటకు చేరిన నిరసనలు... మకరద్వారం ముందు విపక్ష ఎంపిల నిరసన ప్రదర్శన



**న్యూఢిల్లీ, మార్చి 12 (ఆర్ఎన్ఎ):** 'మోడీజి -ఎల్‌పిజి' అంటూ ప్రతిపక్షాలు గురువారం పార్లమెంటు ఎదుట ఆందోళన చేపట్టారు. కమరిషయల్ ఎల్‌పిజి సిలిండర్ల కొరతపై మోడీ ప్రభుత్వం సమాధానమివ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, డిఎంకె, టిఎంసి, ఎసి సహా పలువురు ఎంపిలు మకరద్వారం ఎదుట ఆందోళన చేపట్టారు. 'నామ్ నరేందర్, కామ్ సరెండర్', 'మోడీజి, ఎల్‌పిజి' అంటూ నినాదాలు చేశారు. ప్రియాంక వాద్రా గాంధీ సహా పలువురు మహిళా ఎంపిలు ఇటుకల పొయ్యిలను ప్రదర్శించారు. ప్రధాని మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు. పశ్చిమాసియా పరిస్థితులు, భారత్‌పై దాని ప్రభావంపై పూర్తి స్థాయిలో చర్చ జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ సందర్భంగా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ప్రధాని మోడీపై విరుచుకుపడ్డారు. ఎల్‌పిజి కొరతపై ప్రజలు ఆందోళన చెందవద్దని ప్రధాని పేర్కొన్నారని, కానీ 'పూర్తి భిన్నమైన కారణాల'తో ఆయన తీవ్ర ఆందోళన చెందుతున్నారని ఎద్దేవా చేశారు. ఎస్టీపిన్ ్గ÷ల్స్, అదానీ కేసులపై ప్రధాని ఆందోళనకు గురవుతున్నారని అన్నారు.

పార్లమెంటుకు వచ్చేందుకు కూడా మోడీ భయపడుతున్నారని, బుధవారం పార్లమెంటులో ఆయన కుర్చీ ఖాళీగా ఉండటం అందరం చూశామని అన్నారు. ప్రజలకు ఆందోళన చెందవద్దని చెబుతున్నారని, కానీ ఆయన ఆందోళనకు గురవుతన్నారన్నది స్పష్టమౌతోందని అన్నారు. గ్యాస్‌పై అబద్దాలాడుతున్న మోదీ సర్కారుగ్యాస్ కొరత విషయంలో కేంద్రం తీరుపై కాంగ్రెస్ మండిపడింది. వాస్తవాన్ని ప్రజలకు చెప్పకుండా మోదీ సర్కారు అబద్ధమాడుతోందని కాంగ్రెస్ నాయకులు దుయ్యబట్టారు. ఎల్‌పీజీ కొరతపై సభలో చర్చకు డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ సభ్యులు పార్లమెంటు ముందు ప్రదర్శన నిర్వహించారు.

## 14నుంచి పదోతరగతి పరీక్షలు

●అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

●సకాలంలో సెంటర్లకు చేరుకోవాలని సూచన

●ఐదు నిముషాల ఆలస్యానికి అనుమతి



**హైదరాబాద్, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పదో తరగతి వార్షిక పరీక్షలు ఈ నెల 14 నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు అధికారులు సకల ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షలు శనివారం ప్రారంభమై.. ఏప్రిల్ 16వ తేదీ వరకు జరుగుతాయి. ఉదయం 9.30 గంటలకు పరీక్షలు ప్రారంభం మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయిలు

# తెలంగాణలో కమర్షియల్ సిలిండర్ల కొరత

అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలతోపాటు ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టేందుకున్న మార్గాలన్నింటిపై చర్చించనున్నట్లు మంత్రి ఉత్తమ్ వివరించారు. అలాగే పూర్తి వివరాలతో రావాలని ఆయిల్ కంపెనీల ప్రతినిధులతోపాటు అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. పరిస్థితి చేయి దాటి పోకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ వెల్లడించారు.రో వైపు.. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య భీకర పోరు కొనసాగుతోంది. దీని ప్రభావంతో దేశవ్యాప్తంగా గ్యాస్, చమురుకు తీవ్ర కొరత ఏర్పడింది. గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని కేంద్రం చెబుతున్నప్పటికీ.. వాస్తవ పరిస్థితి మాత్రం పూర్తి భిన్నంగా ఉంది. తెలంగాణలో వంట గ్యాస్ సిలిండర్ల సరఫరాకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. దాంతో హోటళ్లు, హాస్టల్స్, మెస్‌లకు అవసరమైన మేర కమర్షియల్ సిలిండర్ల సరఫరా లేకపోవడంతో నగరంలో చాలా ప్రాంతాల్లో అవి మూతపడ్డాయి. ఈ నేపథ్యంలో గ్యాస్ సిలిండర్ల కొరత నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అందుకోసం శుక్రవారం వివిధ శాఖల ఉన్నతాధికారులతో పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించనున్నారు.

# కాశ్మీర్ మాజీ సీఎం ఫరూక్ అబ్దుల్లాపై హత్యాయత్నం

జరిగిన ఓ వివాహ వేడుకకు ఫరూక్ అబ్దుల్లా హాజరయ్యారు. ఆయనతో పాటు జమ్మూకశ్మీర్ డిప్యూటీ సీఎం సురీందర్ చౌదరీ కూడా ఉన్నారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి వెనక నుంచి ఫరూక్‌పై పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో తుపాకీతో కాల్చేందుకు ప్రయత్నించాడు. అక్కడ ఉన్నవారు వెంటనే అతడిని పట్టుకొని చితకబాదారు. దీనికి సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు కూడా తాజాగా వెలుగులోకి వచ్చాయి. నిందితుడు జమ్మూకి చెందిన 63 ఏళ్ల కమల్‌సింగ్ జమ్వాల్‌గా పోలీసులు గుర్తించారు. జమ్మూలో దుకాణాలు నడుపుతోన్న కమల్ విచారణ సమయంలో కీలక విషయాలు వెల్లడించాడు. గత 20 ఏళ్లుగా తాను ఫరూక్ అబ్దుల్లాను చంపాలనుకుంటున్నానని పేర్కొన్నాడు. ఇది తన వ్యక్తిగత అజెండాగా వెల్లడించాడు. కాల్పులకు ఉపయోగించిన తుపాకీకి లైసెన్స్ ఉన్నట్లు తెలిపాడు. ఘటన సమయంలో నిందితుడు మద్యం మత్తులో ఉన్నాడని పోలీసులు పేర్కొన్నారు. తుపాకీని స్వాధీనం చేసుకున్నామని, ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. తన తండ్రిపై జరిగిన హత్యాయత్నంపై జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా స్పందించారు. లోడ్ చేసిన తుపాకీతో తన తండ్రిని ఓ వ్యక్తి కాల్చేందుకు ప్రయత్నించాడని పేర్కొన్నారు. అయితే, భద్రతా సిబ్బంది అప్రమత్తతతో అది విఫలమైందన్నారు. ఫరూక్‌కు జెడ్ ప్లస్ భద్రత ఉన్న విషయాన్ని ఒమర్ ప్రస్తావించారు. ఇంత భద్రత ఉన్నా.. నిందితుడు అంత దగ్గరగా ఎలా రాగలిగాడని ప్రశ్నించారు. ఇక, భద్రతా వైఫల్యం కారణంగానే ఈ ఘటన చోటుచేసుకుందని ఉప ముఖ్యమంత్రి చౌదరి పేర్కొన్నారు.

# 14నుంచి పదోతరగతి పరీక్షలు

అవుతాయి. సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. అయితే పరీక్షలకు ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చే విద్యార్థులను అనుమతిస్తారు. ఆ తర్వాత వచ్చే వారిని అస్సలు అనుమతించబోరు. అంటే ఉదయం 9:35 గంటల తర్వాత వచ్చే విద్యార్థులను పరీక్షకు అనుమతించబోరు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,676 సెంటర్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ బడుల్లో 1,582 సెంటర్లు, ప్రైవేట్ బడుల్లో 1,094 సెంటర్లు ఏర్పాటు చేశారు. ఈ సారి 5,17,727 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. పరీక్షల సందర్భంగా సెల్‌ఫోన్ల వినియోగంపై అధికారులు కఠిన ఆంక్షలు విధించారు. పరీక్ష కేంద్రాలను 'నో సెల్‌ఫోన్' జోన్లుగా ప్రకటించారు. పరీక్ష సిబ్బంది, స్క్వాడ్ సహా ఇతర అధికారులందరికీ ఈ నిబంధనలు వర్తిస్తాయి. తనిఖీలకు వచ్చే అధికారులు సైతం సెల్‌ఫోన్లు తీసుకెళ్లరాదు. వీరు తమ సెల్‌ఫోన్లను గది బయటే పెట్టాల్సి ఉంటుంది. ఎవరొచ్చినా తనిఖీలు చేసిన తర్వాతే లోపలికి అనుమతిస్తారు. ఒకవేళ ఎవరైనా ఈ నిబంధనలు ఉల్లంఘించి సెల్‌ఫోన్లతో విధులకు హాజరైతే వారిని సస్పెండ్‌చేస్తారు. పేపర్ లీకేజీలకు పాల్పడితే ఉద్యోగం నుంచి తొలగిస్తారు. పరీక్షలు జరుగుతుండగానే మూల్యాంకనం కూడా ప్రారంభం అవుతంది. ఈ నెల 14 నుంచి పదో తరగతి పరీక్షలు జరుగనుండగా, ఏప్రిల్ 1 నుంచి జవాబపత్రాల మూల్యాంకనం జరుగనున్నది.

# పెరుగుతున్న ఎండల తీవ్రత

### జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

**హైదరాబాద్, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మరింత వేడెక్కిస్తున్నాయి. ఉదయం 8 గంటలకే సూరీడు సుర్రుమంటున్నాడు. రాయలసీమ, గోదావరి జిల్లాల్లో ఎండలు తీవ్రం అవుతున్నాయి. తెలంగాణతో పాటు హైదరాబాద్ నగరంలో కూడా ఎండలు దంచికొడుతున్నాయి. భానుడి భగభగలతో నగర ప్రజలు విలవిల్లాడుతున్నారు. ప్రస్తుతం 40-42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వేసవి ప్రారంభంలోనే ఇలా ఉంటే.. ముందు ముందు పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో చిన్నపిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, బయటికి రాకుండా చూసుకోవాలి. రోజుకు తప్పని సరిగా నాలుగు లీటర్ల నీరు తాగితే డీహైడ్రేషన్ నుంచి బయట పడవచ్చు. పిల్లలపై ఎండ ప్రభావం పడకుండా పలుచని నూలు వస్త్రాలు ధరింపజేయాలి.ఉదయం 9 గంటలకే ఎండ వేడిమి అధికం కావడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. అతి ముఖ్యమైన పని ఉంటేనే బయటకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం సమయంలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. ఎండల నుంచి రక్షణ పొందేందుకు కొన్ని జాగ్రత్తలు పాటించాలి వైద్యులు సూచిస్తున్నారు. ఈ ఎండాకాలంలో మనుషులతో పాటు, పశవులకు కూడా ఆరోగ్య చర్యలు అవసరమని సూచిస్తున్నారు. ఎండను తాళలేక కొందరు ఎక్కువ సార్లు స్నానం చేయడం మంచిది కాదు. శరీరం బలహీనపడుతుంది. ఒక్కోసారి శరీరం ఉష్ణోగ్రతలు ఉండాల్సిన దానికంటే దిగువకు పడిపోతాయి. దీంతో స్పృహకోల్పోవడం, ఒక్కోసారి ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది.

# హైదరాబాద్‌లో నెట్‌ఫ్లిక్స్ స్టూడియో

(మొదటి పేజీ తరువాయి)

సీఎం రేవంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్యం నుంచే తనకు సినిమాలు అంటే ఇష్టం ఇష్టమన్నారు. నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్‌కు వచ్చిందంటే హాలీవుడ్ నగరానికి వచ్చినట్లే అని సీఎం వ్యాఖ్యానించారు. నెట్‌ఫ్లిక్స్‌తో తన కల నిజం కాబోతోందని వ్యాఖ్యానించారు. నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ విస్తరణకు తమ ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. ఫోర్త్‌సిటీని నిర్మిస్తున్నామని.. నెట్‌ఫ్లిక్స్ విస్తరణకు కావాల్సిన భూమిని ఫ్యూచర్ సిటీలో ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. నెట్‌ఫ్లిక్స్ కార్పొరేట్ ఆఫీస్‌ను ఫ్యూచర్ సిటీకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమానికి పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి డి. శ్రీధర్‌బాబు, సినీనటుడు రానా దగ్గుబాటి, నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ సీఈఓ జెఫ్ షాపిరో, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. తనకు సినిమాలపైన ఆసక్తి ఉందని.. తన బాల్యం నుంచి ఇప్పటి వరకు




చిత్రరంగంలో అనేక మార్పులు వచ్చాయని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. బాహుబలి, కల్కి, ఆర్‌ఆర్‌ఆర్, అరుంధతి వంటి అత్యున్నత సాంకేతికతతో కూడిన సినిమాలు వచ్చాయని చెప్పుకొచ్చారు. చెన్నైలో ఉన్న తెలుగు సినిమా రంగాన్ని నందమూరి తారక రామారావు , అక్కినేని నాగేశ్వరరావు హైదరాబాద్‌కు తీసుకువచ్చారని గుర్తుచేశారు.

నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్ వచ్చిందంటే హాలీవుడ్ వచ్చినట్లేనని పేర్కొన్నారు. తమ దృష్టి హాలీవుడ్‌పైనేనని తాను గతంలోనే చెప్పానని ప్రస్తావించారు. ప్రపంచంలోని 500 పెద్ద కంపెనీలను తెలంగాణకు తీసుకురావడానికి తాము ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. తెలంగాణలో మీ పెట్టుబడికి పూర్తి రక్షణ ఉంటుందని.. తమ రాష్ట్రం అంటేనే వ్యాపారమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలంగాణకు ఐకాన్

### 1000 కోట్లతో అభివృద్ధికీ రూట్ మ్యాప్... నిధులు మంజూరు చేయడం అభినందనీయం
### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి ఉత్తమ్ ప్రత్యేక ధన్యవాదాలు



**హైదరాబాద్, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలంగాణా రాష్ట్రానికి ప్రత్యేక ఐకాన్ గా నిలిచిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. అటువంటి విశ్వవిద్యాలయం మన రాష్ట్రంలో ఉండడం మనకెంతో గర్వకారణమని ఆయన చెప్పారు. ఇంతటి పేరెన్నికగన్న ఉస్మానియా విశ్వవిద్యాలయం అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని తాను కాంక్షిస్తున్నానని ఆయన చెప్పారు. గురువారం ఉదయం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ విభాగంలో ఆయన నిర్మాణ్-26 సాంకేతిక సదస్సును ప్రారంభించారు. సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 1917 లో స్థాపించిన ఈ విశ్వవిద్యాలయం తెలంగాణా రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిందన్నారు.అందుకు కొనసాగింపుగా 1929 లో విశ్వవిద్యాలయం సౌజన్యంతో ప్రారంభం అయిన ఇంజినీరింగ్ కళాశాల యావత్ భారతదేశంలోనే అత్యంత ప్రాశస్త్యమైన కళాశాలలలో ఆరవ స్థానంలో నిలిచిందని ఆయన చెప్పారు. అంతటి ప్రఖ్యాతి గాంచిన విశ్వవిద్యాలయం అభివృద్ధికీ ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందించడమే కాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏకంగా 1,000 కోట్లు నిధులు మంజూరు చేయడం అభినందనీయమని ఆయన ప్రశంసించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం చరిత్రలోనే ఇంత పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడం చారిత్రాత్మక ఘట్టంగా ఆయన అభివర్ణించారు.అంతర్జాతీయ స్థాయిలో ఈ విశ్వవిద్యాలయాన్ని తీర్చిదిద్దాలి అన్నదే ప్రభుత్వ సంకల్పం అని అందుకనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించినట్లు ఆయన వెల్లడించారు. విశ్వవిద్యాలయంలో అవసరమైన అధ్యాపకుల భర్తీ విషయాన్ని ఆయన ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డితో చర్చించి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఇక్కడి నుండి ఎంతో మేధో సంపద ఉత్పత్తి అయిందని ఆ మేధస్సు ప్రపంచ స్థాయిలో అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. సిలికాన్ వ్యాలీలో పనిచేస్తున్న మెజారిటీ ఇంజినీర్లు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండే ఎదిగిన వారు అని,అంతే గాకుండా గల్లీ నుండి డిల్లో స్థాయికి ఎదిగిన నేతలు,క్రీడాకారులు,ఉన్నత పదవులు చేపట్టిన వారి అడుగులు ఇక్కడి నుండే మొదలు అయ్యాయని ఆయన చెప్పారు. అటువంటి విశ్వవిద్యాలయం తెలంగాణా రాష్ట్ర ఉద్యమంలో అగ్రభాగాన నిలుచోవడమే కాకుండా విద్యార్థులు చేసిన త్యాగాలు ఇక్కడ ప్రస్తావనర్హమే అని భావిస్తున్నానని ఆయన చెప్పారు. ఇక్కడ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు,సాంస్కృతిక కార్యక్రమాలలో కుడా భాగస్వామ్యం కావాలని ఆయన ఉద్బోధించారు. ఇంజినీరింగ్ విభాగం గురుంచి ఆయన ప్రస్తావిస్తూ తెలంగాణా రాష్ట్ర అభివృద్ధిలో ఇంజినీరింగ్ విభాగం ముఖ్య భూమిక పోషిస్తుందని ఆయన చెప్పారు. నిజాంసాగర్, నాగార్జునసాగర్, శ్రీశైలం వంటి భారీ ప్రాజెక్టులతో పాటు ఎస్.ఎల్.బి.సి, దేవాదుల వంటి ఆధునిక ప్రాజెక్టులు ఇంజినీరింగ్ ప్రతిభకు అద్దం పడుతున్నాయన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగము విద్యార్థులకు ప్రాక్టికల్స్ పాఠాలుగా ఉపయోగ పడుతాయని ఆయన చెప్పారు. భవిష్యత్లో స్థిరమైన అభివృద్ధి,ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, జలవనరుల సమగ్ర నిర్వహణ తో పాటు చెక్ డ్యామ్ ల పునరుద్ధరణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇంజినీర్లు ప్రాజెక్టుల నిర్మాణాలకు మాత్రమే పరిమితం కాకుండా వాటి భద్రత,నిర్వహణ బాద్యతలు కుడా ఇంజినీర్లకు ఉంటాయన్నారు. నిర్మాణ్-26 వంటి సాంకేతిక సదస్సులు విద్యార్థులకు పరిశోధన,సృజనాత్మక తాను పెంపొందించే వేదికలని ఆయన చెప్పారు. మన నిర్మాణాలు కేవలము కట్టడాలకే పరిమితము కాకుండా ప్రజల జీవితాలలో వెలుగులు నింపేందుకు దోహద పడాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉద్బోధించారు.

# త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధనలో పోలీస్ శాఖ పాత్ర కీలకం

### పోలీస్ శాఖలో దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగం... రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కి రూరల్ అగ్రి రీజియన్ పై దృష్టి
### ప్రీ బడ్జెట్ సమావేశాల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** 2047 నాటికి త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధించడమే లక్ష్యంగా రాష్ట్రం ముందుకు పోతున్న క్రమంలో ఈ లక్ష్యసాధనలో పోలీస్ శాఖ పాత్ర కీలకమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గురువారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో మొదట హోంశాఖ తదుపరి మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబుతో కలిసి పరిశ్రమలు, ఐటీ శాఖల ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పెద్ద సంఖ్యలో పెట్టుబడిదారులు వస్తున్న నేపథ్యంలో శాంతిభద్రతలు



కీలకం అన్నారు. ఈ అంశంలో ఏ చిన్న పొరపాటుకు హోంశాఖ అధికారులు, సిబ్బంది అవకాశం ఇవ్వరాదని, ప్రతి కదలిక మీ కనుసన్నల్లో ఉండాలని సూచించారు. విధుల నిర్వహణ క్రమంలో హోంశాఖకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. హైదరాబాద్ నగరం ప్రపంచంలో మేటి నగరంగా ఎదుగుతున్న క్రమంలో వేగంగా పలు సంస్కరణలు చేపడుతున్నామని ఇందులో భాగంగా పోలీస్ శాఖలో దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచాలని సూచించారు. అదేవిధంగా నేర నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర గణనీయంగా ఉంటుంది ఈ నేపథ్యంలో రాష్ట్రంలో సీసీ కెమెరాల వినియోగాన్ని పెద్ద సంఖ్యలో చేపట్టాలని, అవసరమైన చోట మరమ్మతులు చేపట్టాలని చిన్న కదలికను సైతం వేను వెంటనే గుర్తించి నిఘాను పటిష్టం చేసేందుకు సీసీ కెమెరాల వినియోగాన్ని పెంచాలని అందుకు అవసరమైన సహకారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. 2047 త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీగా లక్ష సాధనలో పబ్లిక్, ప్రైవేట్ మోడల్ అనివార్యమని ఆ విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు వెళ్లాలని పరిశ్రమల శాఖ అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి రూరల్ అగ్రి రీజియన్ ఎకానమీ సమ ప్రాధాన్యత ఇవ్వాలని డిప్యూటీ సీఎం సూచించారు. ఈ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు, పరిశ్రమలు వచ్చే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. మైక్రో, స్మాల్, మీడియం ఇండస్ట్రీస్ లను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలనేది ప్రజా ప్రభుత్వం ఆలోచన అని తెలిపారు. రాష్ట్ర నలుమూలలోని యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధి తో పాటు పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉన్న రంగం అని తెలిపారు. జీసీసీలతో రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని, ఇదే వేగాన్ని కొనసాగించేందుకు ప్రభుత్వ నుంచి ప్రోత్సాహం కల్పిస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు అన్నారు. డాటా సెంటర్లలో ఎఐ వినియోగాన్నిపెద్ద ఎత్తున చేపట్టాలని మంత్రి శ్రీధర్ బాబుకు సూచించారు. సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సివి ఆనంద్, శశాంక డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# చిరంజీవిని కలిసిన దిల్‌రాజు, ప్రియాంక

### గద్దర్ అవార్డుల ఫంక్షన్‌కు ఆహ్వానం



**హైదరాబాద్, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ వేడుకల్లో పాల్గొనాల్సిందిగా మెగాస్టార్ చిరంజీవిని తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ దిల్ రాజు, మేనేజింగ్ డైరెక్టర్ ప్రియాంక కోరారు. అలాగే గద్దర్ అవార్డును స్వీకరించాల్సిందిగా అభ్యర్థించారు. గురువారం మెగాస్టార్ చిరంజీవి వీరు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ప్రతిష్టాత్మక 'ఎన్టీఆర్ నేషనల్ ఫిలిం అవార్డు' ను స్వీకరించాల్సిందిగా వారు చిరంజీవిని సాదరంగా ఆహ్వానించారు. మార్చి 19, హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా జరగనున్న అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి విచ్చేసి, ఈ గౌరవాన్ని అందుకోవాలని వారు కోరారు.

# అంబర్‌పేటలో కల్తీ పెరుగు స్వాధీనం

**హైదరాబాద్, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కల్తీ జాబితాలో పెరుగు కూడా చేరింది. నగరంలోని అంబర్‌పేటలో 2,500 కిలోల కల్తీ పెరుగును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పాలలో కాస్టిక్ సోడా వినియోగించి పెరుగు తయారు చేస్తున్నట్లు తనిఖీల్లో గుర్తించారు. అంబర్‌పేట పోలీసులు, ఖైరతాబాద్ టాస్క్‌ఫోర్స్, జీహెచ్‌ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు కలిసి ఈ తనిఖీలు చేపట్టారు. పెరుగు శాంపిళ్లను ల్యాబ్‌కు పంపారు.పెరుగు తయారీదారులపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

# 16నుంచి ఒంటిపూట బడులు

### ఉత్తర్వులు జారీచేసిన విద్యాశాఖ

**హైదరాబాద్, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్రంలో ఎండల తీవ్రత దృష్ట్యా పాఠశాల విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు మార్చి 16 నుంచి ఏప్రిల్ 23 వరకు ఒంటిపూట బడులు నిర్వహించనున్నట్లు అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతిరోజూ ఉదయం 8:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు తరగతులు జరుగుతాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం 12:30 గంటలకు భోజనం వడ్డించిన తర్వాత విద్యార్థులను ఇంటికి పంపిస్తారు. టెన్త్ ఎగ్జామ్స్ జరిగే స్కూళ్లలో షెడ్యూల్ మారుతుంది. అక్కడ మధ్యాహ్నం 1:00 గంట నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు ఒంటిపూట బడులు నిర్వహిస్తారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్షల దృష్ట్యా యథావిధిగా ప్రత్యేక తరగతులు కొనసాగుతాయి. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం.. ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు విద్యార్థులకు వేసవి సెలవులు ఉండనున్నాయి. తిరిగి 2026-27 విద్యా సంవత్సరం జూన్ 12 నుంచి ప్రారంభం కానుంది. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ ఈ నిర్ణయం తీసుకుంది.

# ఉద్యోగం వచ్చేవరకు భార్యకు చేదోడువాదోడు

### ఎక్సైజ్ సిఐగా ఎన్నికయ్యాక భర్తకు వేధింపులు
### భార్య వేధింపులు తట్టుకోలేక వ్యక్తి ఆత్మహత్య
### నేరెడ్ మెట్ పరిధిలో ఘటన..పోలీసులు దర్యాప్తు

**హైదరాబాద్, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** భార్య వేధింపులు తాళలేక భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం సృష్టించింది. నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీనగర్‌కు చెందిన నగెల్లి శ్రీనివాస్(41) ఓ ప్రైవేట్ ఉద్యోగి. అతని స్వగ్రామం మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం రామకృష్ణాపూర్. శ్రీనివాస్ 2012లో జ్యోతిని పెళ్లి చేసుకున్నాడు. ఈ దంపతులకు ఓ కుమారుడు ఉన్నాడు. భార్య గ్రూప్స్ పరీక్షలకు ప్రీపేర్ అయ్యేందుకు భర్త శ్రీనివాస్ చాలా హెల్ప్ చేశాడు. భర్త సహాయంతో జ్యోతి గ్రూప్స్‌లో విజయం సాధించి ఎక్సైజ్ సీఐగా నియమితులయ్యింది. ఉద్యోగం వచ్చిన తర్వాత భర్తను దూరం పెట్టడం స్టార్ట్ చేసింది. అంతే కాదు.. భర్తపై వరకట్నం వేధింపులు, విడాకుల కేసులు పెట్టింది. వేధింపులకు పాల్పడటంతో శ్రీనివాస్ తట్టుకోలేక పోయాడు. తీవ్ర మనస్తాపానికి గురై మంగళవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. 'భార్య వేధింపులు, కేసుల కారణంగా ఆత్మహత్య చేసుకుంటున్నాను' అని సూసైడ్ నోట్ రాశాడు. శ్రీనివాస్ సోదరుడు శివకృష్ణ ఇంటికి వచ్చి చూడగా అతను మృతిచెందినట్లు గుర్తించాడు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. సోదరుడి ఫిర్యాదు మేరకు శ్రీనివాస్ భార్య జ్యోతి సహా మరో 10 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఆర్మూర్ స్టేషన్‌లో అగ్నిప్రమాదం

### అగ్నికి ఆహుతైన వాహనాలు

**నిజామాబాద్, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో గతంలో పోలీసులు సీజ్ చేసిన దాదాపు 50 బైకులు, ఆటోలు, కార్లు దగ్ధమయ్యాయి. చెత్తను తగలబెట్టడంతో వాహనాలకు నిప్పు అంటుకున్నట్లు సమాచారం. అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగి మంటలను అదుపు చేస్తున్నారు.

**IN THE COURT OF THE HON'BLE Xth JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, HYDERABAD AT HYDERABAD**
**OS. NO. 651 OF 2026**

BETWEEN:
Smt. R. Vinoodha Rani. ....Plaintiff
AND
The Tehsildar & Anr. ... Defendants
To,
All Concerned ...Defendant No. 2

Whereas the Plaintiff named above has filed the aforementioned suit to be declared as the Legal Heir of Late. Ramaram Pandu Goud and the Hon'ble Court has issued Summons to All Concerned and posted the matter to 06-04-2026 for your appearance. Anybody has any objection or claims if any. You are hereby directed to appear in the aforementioned matter at 10:30AM on 06-04-2026, either in person or through Counsel, failing which the matter will be heard and decided on merits in your absence, as per law.
-BY ORDER OF THE COURT-

**G. RAM BABU,**
**ADVOCATE.**
**Flat No. 14, Ist Floor,**
**Madhukunj Apartments**
**S.P. Road, Secunderabad-03**
**Cell No.98664 70246**

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# ధాన్యం ఎగుమతి, దిగుమతులను సమీక్షించాలి!

పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలతో ఎగుమతులు, దిగుమతులు ఆగిపోయాయి. ఓ రకంగా ఇది మనం సంక్షోభాన్ని సరిదిద్దుకునే సమయంగా భావించాలి. ఇప్పటికే ఇబ్బడిముబ్బడిగా ధాన్యాలు దిగుమతి చేసుకుంటున్నా భారత్ ఈ దశలో వీటిపై పునరాలోచన చేయాలి. దేశీయంగా పప్పు ధాన్యాలు, నూనె ధాన్యాలు విపరీతంగా పండుతున్నా, రైతులకు కనీస మద్దతు ధరలు చెల్లించడం లేదు. అలాగే వేసిన పంటలను కొనుగోలు చేయడం లేదు. తెలంగాణలో శనగ, మక్కజొన్నలకు డిమాండ్ లేకుండా పోయింది. శనగ కొనుగోళ్లపై స్పష్టత కరవైంది. రైతులు సాగుచేసిన శనగ పంటకు మద్దతు ధర అందించడానికి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై స్పష్టత కరువైంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శనగ పంటను నిల్వ ఉంచుకున్న రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం ఎదురు చూస్తున్నారు. పంట పెట్టుబడి కోసం చేసిన అప్పులు తిరిగి చెల్లించడానికి ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. ఈ దశలో దేశీయంగా ఆయా రాష్ట్రాల్లో పండుతున్న పంటలను కొనుగోలు చేసేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా ఆహార ధాన్యాలను కొనుగోలు చేసి, ప్రజలకు సరసమైన ధరల్లో అందించాలి. అదేవిధంగా దిగుమతులపై పూర్తి ఆంక్షలు విధించాలి. నూనెలు, పప్పులను దిగుమతి చేసుకోవడం తక్షణం ఆపాలి. గత కేంద్ర బడ్జెట్లో వ్యవసాయ రంగానికి, గ్రామీణ ప్రాంతానికి సంబంధించి మూడు పద్దులను అంటే రూ.60 వేల కోట్ల వరకు కేంద్ర ప్రభుత్వం ఖర్చు పెట్టలేదని సమాచారం.. ఈ సంవత్సరం అందుకు భిన్నంగా జరుగుతుందని ఆశించలేం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సంవత్సరం బడ్జెట్లో ధరల స్థిరీకరణ కోసం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. కేంద్రం ఎఫ్‌సిఐ ద్వారా వివిధ రాష్ట్రాల నుంచి కొనాల్సిన కందులు, శనగలు, పెసలు, మొక్కజొన్నలు లాంటి 25 రకాల పంటలను కొనడానికి నిరాకరించింది. దేశంలోని 24 వేల స్థానిక మార్కెట్లు, 125 ప్రత్యేక మార్కెట్లు నిర్వహణను వదిలేయడం సరైనది కాదు. నిజానికి ధాన్యం సేకరణ, తిరిగి ప్రజలకు వాటిని ఆహార ధాన్యాల రూపంలో చేరవేయడంలో పక్కా ప్రణాళిక లేకుండా పోయింది.ప్రైవేటు వ్యక్తులు కంపెనీలు, మార్కెట్లు పెట్టుకునేందుకు అనుమతించే బిల్లును గత ఫిబ్రవరిలో పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదింప చేసుకుంది. గత రెండు సంవత్సరాలుగా వరి ధాన్యం, పత్తి, మిర్చి, పొగాకు, ఉల్లిపాయలు, కోకో లాంటి పంటలను కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన మద్దతు ధరలకు కొనేవారే లేకుండా పోయారు. తక్కువ ధరలకు రైతులు అమ్ముకోవలసి వస్తున్నది. నిజానికి వ్యవసాయ విధానం సక్రమంగా ఉంటే, అనవసరపు దుబారా ఖర్చులు తగ్గించి, దేశీయంగా పంటలను ప్రోత్సహించి, ఉన్న పంటలను కొనుగోలు చేయాలి. అలాగే ప్రజలకు తక్కువ ధరలకు నిత్యావసరాలు సరఫరా చేసే వ్యవస్థను రూపొందించాలి. దీంతో దేశంలో ఆకలి బాధలు తగ్గడంతో పాటు, కొనుగోలు శక్తి కూడా పెరుగుతుంది. కానీ గొప్పలు చెబుతున్న బిజెపి నేతలు ఒక్కరు కూడా సమగ్ర వ్యవసాయ విధానంపై ఆలోచన చేయడం లేదు. పంటలు పండుతున్నా, సామాన్యులకు ధరలు అందడం లేదు. అలాగే ఇబ్బడి ముబ్బడిగా దిగుమతులు పెంచేస్తున్నారు. ఉన్న వ్యవసాయాన్ని నాశనం చేసే చట్టాలు చేయడం, పార్లమెంట్, అసెంబ్లీల్లో వ్యవసాయ ధరలు లేక రైతులు బాధపడుతున్నారని మొసలి కన్నీరు కార్చడం అలవాటైపోయింది. ఇకపోతే న కిలీ విత్తనాలు కూడా రైతులను నట్టేట ముంచుతున్నాయి. విత్తనాలు అమ్మిన కంపెనీలపై చర్యలు తీసుకోవడం లేదు.కంపెనీ దగ్గర కొన్న విత్తనాలు సరిగ్గా మొలవకపోయినా, తగిన దిగబడి రాకపోయినా తర్వాత వ్యవసాయ సీజన్ లోపు రైతులకు నష్టపరిహారం చెల్లించాలని 2001 విత్తన బిల్లులో ఉంది. కానీ ఈ తాజా బిల్లు ప్రకారం కంపెనీ విత్తనాలు రెండుసార్లు మొలవకపోయినా, సరైన దిగుబడులు రాకపోయినా ఆ రైతులకు ఎలాంటి నష్టపరిహారం చెల్లించనవసరం లేదు. మూడవసారి ఆ కంపెనీ విత్తనాలు విఫలమైతే ఆ కంపెనీ ప్రభుత్వానికి ఫెనాల్టీ చెల్లించాలని బిల్లులో ఉంది కానీ రైతులకు నష్టపరిహారం చెల్లించాలని లేదు.పంటల బీమా చట్టం' కార్పొరేట్ కంపెనీలకు ధీమా కల్పిస్తున్నది కానీ రైతులకు కాదు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ఆపరేషన్ గైడ్‌లైన్స్ మాత్రం వివరంగా ఉన్నాయి. ఆచరణలో ఈ పద్దు కింద ప్రతి సంవత్సరం కేటాయించే రూ.15 వేల కోట్లలో ఐదు వేల కోట్లు కూడా రైతులకు చేరడం లేదు. రూ.10 వేల కోట్లను కార్పొరేట్ బీమా కంపెనీలు మింగేస్తున్నాయి. వాతావరణం, క్రాప్ కటింగ్ ఎక్స్‌పరిమెంటేషన్‌లో ప్రైవేట్ కంపెనీల డేటాను వాడుతున్నారు. ప్రభుత్వ వ్యవసాయ బీమా కంపెనీలు దమ్మీలుగా మిగిలిపోతున్నాయి. ప్రైవేట్ కంపెనీదే పెత్తనం, వారే దోచేస్తున్నారు.వ్యవసాయానికి సంబంధించి పురుగు మందులలో అత్యంత దోపిడి జరుగుతున్నది. 100 రూపాయల మందుని వెయ్యి రూపాయలకు, 300 రుపాయలది 3 వేలకు అమ్ముతూ వ్యాపారస్తులు అడ్డగోలుగా దోపిడీ చేస్తున్నారు. దీనికి కారణం 'నూతన పురుగు మందుల విధానం'లో ఎం.ఆర్.పి విధానం పాటించాలని లేకపోవడమే. పురుగులను చంపడానికి ఆ ద్రావకంలో ఎంత శాతం మందు ఉండాలో అది ఉండక పోయినా వ్యాపారస్థులను అడిగేవారు లేరు. ఇలాంటి సమస్యలన్నీ చర్చించాలి. ఇందుకు తగిన సమయం ఇదే. సమగ్ర వ్యవసాయ విధానం,ఎగుమతులు దిగుమతులపై చర్చించాలి. దేశీయ పంటలను పండించుకుని తినేలా వ్యవస్థీకృత పద్ధతిని తీసుకుని రావాలి. అప్పుడే దేశం ఆర్థికంగా బలపడుతుంది. మన రైతులు ఆనందంగా ఉంటారు.

## జిల్లాలో టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

**వరంగల్,మార్చి12 (ఆర్ఎన్ఎ):** వరంగల్ జిల్లాలో పదవ తరగతి పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 14 నుంచి ఏప్రిల్ 13 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి.ఈ నెల 14 లోగా విద్యార్థులను పరీక్షలకు సమాయత్తం చేసే పనిలో జిల్లా విద్యా శాఖ నిమగ్నమైంది. జిల్లాలో పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ ఇప్పటికే పలుదఫాలుగా సమన్వయ సమావేశాలు నిర్వహించారు. అందుకు అనుగుణంగా విద్యాశాఖాధికారులు ఏర్పాట్లను సైతం పూర్తి చేశారు. ఈ ఏడాది జిల్లాలో 288 పాఠశాలల నుంచి మొత్తం 9,492 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పది ఫలితాల్లో జిల్లాను ముందంజలో ఉంచేం దుకు ఇప్పటికే ప్రణాళికబద్ధమైన పటిష్టమైన చర్యలను విద్యా శాఖ చేపట్టింది. స్పెషల్ క్లాసులు, రివిజన్ క్లాసులు, నిపుణులతో విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహిస్తోంది. జిల్లాలోని 288 పాఠశాలల నుంచి 9,492 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఇందులో 4,932 మంది బాలురు పరీక్షలకు హాజరు కానుండగా 4560 మంది బాలికలు పరీక్షలు రాయనున్నారు. జిల్లాలో అన్ని వసతులతో కూడిన 47 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 47 మంది సీఎస్, 48 మంది డీవోలను, 47మంది సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. ప్రశ్నాపత్రాల బట్వాడ కోసం ఆరుగురు రూట్ ఆఫీసర్లు, మరో ఆరుగురు అదనపు రూట్ ఆఫీసర్లను నియమించారు.

# గ్యాస్ కొరతతో హోటళ్లు మూత

### హాస్టళ్ల పరిస్థితి మరింత దారుణం... ఆర్టీసీ క్రాస్‌రోడ్ బావర్చి మూసివేత .... ప్యారడైజ్ హోటల్ కూడా అదే దుస్థితి

### బ్లాక్ విక్రయాలపై కఠిన చర్యలు తప్పవన్న అధికారులు

**హైదరాబాద్,మార్చి12(ఆర్ఎన్ఎ):** వంటగ్యాస్ కొరత హోటల్ పరిశ్రమను అతలాకుతలం చేస్తోంది. ఇక్కడ హాస్టళ్లో ఉంటూ చదువుకుంటున్న వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే దుర్భర పరిస్థితి నెలకొంది. అలాగే హోటల పరిశ్రమపై ఆధారపడ్డ నిరుద్యోగులు కూడా ఆందోళన చెందుతున్నారు. మహానగరంలో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా నిలిచిపోయింది. వంటగ్యాస్ సిలిండర్ల సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కె. శ్రీనివాస్ తెలిపారు. సిలిండర్లను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయిల్ కంపెనీలకు ఆదేశాలు జారీ చేశామని, ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు. నెలకు ఒక సిలిండర్ బుకింగ్ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పశ్చిమాసియా యుద్ధం పీజీ యజమానుల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. ఓవైపు గ్యాస్ కొరతతో నగరంలోని పలు హోటళ్లను తాత్కాలికంగా మూసేస్తుంటే, మరోవైపు హాస్టళ్ల నిర్వహణపై యజమానులు మల్లగుల్లాలు పడుతున్నారు. కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ల సరఫరా బుధవారం నుంచి నగరంలో దాదాపుగా ఆగిపోవడంతో హాస్టళ్ల నిర్వహణ కష్టంగా మారింది.గ్యాస్ వినియోగం ఎక్కువ అయ్యే దోసె, పూరీ, చపాతీ వంటకాలను తాత్కాలికంగా అన్ని హాస్టళ్లలో నిలిపివేసినట్లు సమాచారం. గ్యాస్ కొరత తీరేవరకు అన్నం, సాంబారు, కూరతో సాధారణ భోజనాన్ని మాత్రమే అందించగలమని ఐటీకారిడార్‌లోని హాస్టల్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం ప్రకటించారు. చికెన్, కోడిగుడ్డుకూర, వేపుళ్లు వంటి అదనపు వంటలను నిలుపుదలచేస్తున్నట్లు తెలిపారు. టీ, కాఫీ లాంటివాటిని అందించలేమని వెల్లడిస్తున్నారు. గ్రేటర్ పరిధిలో మూడు, నాలుగు రోజులుగా సిలిండర్ల బుకింగ్ కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. సర్వర్ డౌన్‌తో బుకింగ్ కావడం



లేదంటున్నారు. వాట్సాప్ ద్వారా బుక్ చేసుకునే అవకాశం ఉన్నా కావడం లేదంటున్నారు.ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని బావర్చి హోటల్‌ను బుధవారం మూసేశారు. గ్యాస్ సిలిండర్ల కొరత కారణంగానే మూసేసిన్నట్లుగా తెలిసింది. ప్రముఖ ప్యారడైజ్ హోటల్స్ అన్ని బ్రాంచీలలో టీ అమ్మకాలను నిలిపివేశారు. ఐటీసీ సంస్థ కూడా వివిధ ప్రాంతాల్లో గల సంస్థ హోటల్స్‌లో గ్యాస్ కొరత కారణంగా లంచ్, డిన్నర్ ఉండదని ప్రకటించింది. ఒకవేళ దొరికినా కొన్ని ప్రాంతాల్లో రూ. 4 వేలకు, మరికొన్ని ప్రాంతాల్లో రూ. 3,500కు విక్రయిస్తున్నారు. 19 కిలోల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర సాధారణంగా రూ.2105ల వరకు ఉంది. బుధవారం నుంచి కమర్షియల్ సిలిండర్ల సరఫరా పూర్తిగా బంద్ అయింది. పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో కూడా కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరాను నిలిపివేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఇదే తరహా పరిస్థితులు నెలకొన్నాయి. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా లేకపోవడం, మార్కెట్‌లో అధిక ధర ఉండడంతో కొనుగోలు చేయలేక పలు హోటల్స్ మూత పడుతున్నాయి. సిలిండర్ కొరతతో హోటల్స్ మూసేస్తున్నట్లు యజమానులు ప్రకటించారు. అవసరమైతే అవసరమైతే కట్టెల పొయ్యి మీద వంట చేస్తామని చెప్పారు. ఇక పలు ప్రాంతాల్లో టిఫిన్ సెంటర్‌లో కమర్షియల్ సిలిండర్ సరఫరా లేకపోవడంతో హోటల్ మూసివేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. టిఫిన్ సెంటర్ బందు చేసుకోవాల్సి వస్తదేమోనని ఆందోళన చెందారు. అఫ్జల్‌గంజ్, బేగంబజార్‌లో కొన్ని టిఫిన్ సెంటర్లలో గ్యాస్ లేకపోవడంతో మూసేస్తున్నారు. వేల రూపాయలు పెట్టి సిలిండర్ కొనుగోలు చేసి వ్యాపారం ఎలా చేస్తామని చిన్న హోటళ్లు, టిఫిన్ సెంటర్ల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ కొరతతో పలు ప్రాంతాల్లో బిర్యానీ సెంటర్లు మూతపడ్డాయి. పలు ప్రాంతాల్లో వాణిజ్య అవసరాలకు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తున్నారు. కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు దొరక్కపోవడంతో టీ షాపులు, బండి వ్యాపారులు, టిఫిన్ సెంటర్ల నిర్వాహకులు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వాడుతున్నారు. కొందరూ గృహ వినియోగదారులు 14కిలోల గ్యాస్ సిలిండర్‌ను రూ.1800ల వరకు అమ్ముతున్నారు. గ్యాస్ సిలిండర్ల కొరతతో హోటళ్లు మూతపడుతున్నాయి. గృహావసరాల సిలిండర్ల సరఫరా తగ్గింది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అయితే రూ.5 భోజనానికి ఇబ్బంది ఉండదని జీహెచ్ఎంసీ వర్గాలు చెబుతున్నాయి.విద్యుత్‌తో నడిచే యంత్రాలతో భోజనం తయారు చేస్తున్న దృష్ట్యా గ్యాస్ కొరత ప్రభావం తయారీపై ఉండబోదని జీహెచ్ఎంసీ అధికారి ఒకరు తెలిపారు. సిలిండర్లకు ప్రత్యామ్నాయ మర్గాలను నిర్వాహకులు అన్వేషిస్తున్నారని అమీర్‌పేట హాస్టళ్ల అసోసియేషన్ అధ్యక్షుడు రాజారావు చెబుతున్నారు. బుధవారం అమీర్‌పేట ప్రాంతంలోని హాస్టల్ నిర్వాహకులు 120కుపైగా ఎలక్ట్రికల్ స్టౌలు కొనుగోలు చేసినట్లు సమాచారం. కొందరు కట్టెల పొయ్యి ఏర్పాటుచేసుకున్నారని దుర్గానగర్ హాస్టళ్ల అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ చెప్పారు. గ్యాస్ కొరత నేపథ్యంలో హాస్టళ్ల యజమానులంతా ఒక్కటయ్యారు. నిర్వహణ విషయంలో తాత్కాలిక నిబంధనలు రూపొందించి అమలుచేస్తున్నారు. విద్యా, ఉద్యోగ అవకాశాల కోసం నగరానికి వచ్చిన యువతకు ఆశ్రయమిచ్చే పేయింగ్ గెస్ట్ హాస్టళ్ల నిర్వహణ ఇప్పుడు మరింత భారంగా మారింది. మహారాష్ట్ర, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి కోర్సులు నేర్చుకోడానికి వచ్చే విద్యార్థుల సంఖ్య ఏడాదిగా బాగా తగ్గింది. దాంతో ప్రైవేటు హాస్టళ్ల వ్యాపారం మందకొండిగా నడుస్తోంది. గ్యాస్ కొరత మమ్మల్ని మరింత నష్టాల్లోకి నెడుతుంది. ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతున్నాం. హాస్టల్‌లో ఉంటున్నవారికి అన్నం, కూర, సాంబారైనా వడ్డించడానికి ప్రత్నిస్తున్నాం అంటున్నారు.

# ముందస్తు ఆరోగ్య రక్షణకు యోగా కీలకం

### కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత), కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రతాపరావు జాదవ్



**విజయవాడ, మార్చి12 (పిఐబి):** గత దశాబ్ద కాలంలో, యోగా కేవలం ఒక సాంప్రదాయ ఆరోగ్య పద్ధతిగా మాత్రమే కాక, శాస్త్రీయ ఆధారాలతో కూడిన ఆరోగ్య మార్గంగా గుర్తింపు పొందింది. శాస్త్రీయ పరిశోధనలు, డిజిటల్ ఆవిష్కరణలు, అంతర్జాతీయ సహకారం ద్వారా యోగాను కేవలం భారతీయ సాంస్కృతిక వారసత్వంగానే కాదు, ప్రజారోగ్యంలో ఒక శక్తివంతమైన సాధనంగా అర్థం చేసుకుంటున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ యొక్క సంప్రదాయ వైద్య (యోగా) సహకార కేంద్రంగా 2025--2029 కాలానికి మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా తిరిగి ఎంపికైంది. ఇది యోగా పరిశోధనలో భారత నాయకత్వాన్ని బలపరుస్తోంది. అంటు వ్యాధులు కాని వ్యాధుల నివారణలో యోగా పాత్రను శాస్త్రీయంగా నిరూపించడంలో ఈ సంస్థ కీలకంగా వ్యవహరిస్తోంది. ఆయుష్ మంత్రిత్వ శాఖ, ఎయిమ్స్ దిల్లీ వంటి ప్రముఖ సంస్థలతో కలిసి మధుమేహం, ఊబకాయం, మానసిక ఒత్తిడి వంటి సమస్యలపై సాంకేతిక మార్గదర్శకాలను ఈ కేంద్రం రూపొందిస్తోంది.మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా తన పరిశోధనా ల్యాబొరేటరీల ద్వారా యోగా వల్ల కలిగే శారీరక, రసాయన, మానసిక మార్పులను అధ్యయనం చేస్తోంది. వృద్ధాప్యంపై యోగా ప్రభావం, జీవనశైలి వ్యాధుల నియంత్రణపై పరిశోధనలు జరుగుతున్నాయి. ఇది సాంప్రదాయ జ్ఞానాన్ని ఆధునిక విజ్ఞానంతో అనుసంధానించే ప్రయత్నం. డిజిటల్ వేదికలు యోగాను సామాన్యులకు మరింత చేరువ చేశాయి. మొబైల్ యాప్, ప్రోటోకాల్ వంటివి ఇందుకు ఉదాహరణలు. డబ్ల్యూహెచ్ఓ సహకారంతో రూపొందించిన యాప్‌ను ఇప్పటికే 1.1 లక్షల మందికి పైగా డౌన్‌లోడ్ చేసుకున్నారు. అలాగే, పనివేళల్లో 5-10 నిమిషాల పాటు చేసే (యోగా బ్రేక్) కార్యక్రమం ద్వారా 33 లక్షల మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులు ప్రయోజనం పొందారు. పరిశోధనల ప్రకారం, క్రమం తప్పకుండా-దీనిని ప్రాక్టీస్ చేయడం వల్ల కొన్ని వారాల్లోనే ఒత్తిడి 40 శాతం వరకు తగ్గుతున్నట్లు తేలింది. ఇది మానసిక చురుకుదనాన్ని, భావోద్వేగ స్థిరత్వాన్ని పెంచడమే కాకుండా, శరీరంలోని కార్టిసాల్ వంటి హార్మోన్ల స్థాయిల్లో సానుకూల మార్పులను తెస్తుంది. మెడ, భుజాలు, నడుము నొప్పి తగ్గడం, శ్వాస సామర్థ్యం పెరగడం వంటి శారీరక ప్రయోజనాలు కూడా కనిపిస్తున్నాయి.యోగా కేవలం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా, ప్రజారోగ్యం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలకు కూడా ఒక మార్గంగా మారుతోంది. సంప్రదాయాన్ని సాంకేతికతతో జోడించడం ద్వారా 'గ్లోబల్ యోగా క్రాంతి'లో భారతదేశం ప్రపంచ నాయకుడిగా ఎదుగుతోంది.జూన్ 21న రానున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి మార్చి 13 నుంచి 100 రోజుల కౌంట్‌డౌన్ ప్రారంభమవుతుంది. ఈ వంద రోజులను మన దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవడానికి ఒక ప్రేరణగా తీసుకుందాం. యోగాను జీవితంలో ఒక భాగంగా మార్చుకోవడం ద్వారా మనం వ్యక్తిగత ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడమే కాకుండా, సామాజిక సామరస్యానికి, ప్రపంచ సంక్షేమానికి బాటలు వేయవచ్చు.

# నిజామాబాద్ జిల్లాలో దారుణ హత్య

- కాంగ్రెస్ నేతను హతమార్చిన సమీప బంధువు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు

**నిజామాబాద్, మార్చి12 (ఆర్ఎన్ఎ):** నిజామాబాద్ జిల్లాలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఇందల్వాయి మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపీ గురువారం దారుణ హత్యకు గురయ్యారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లాలోనే కాకుండా తెలంగాణ రాజకీయ వర్గాల్లో కూడా తీవ్ర చర్చకు దారితీసింది. కుటుంబ రాజకీయ విభేదాలు ఈ హత్యకు కారణంగా తెలుస్తోంది. ముఖ్యంగా గ్రామస్థాయి రాజకీయాల్లో పెరిగిన విభేదాలు చివరకు రక్తపాతం వరకు వెళ్లినట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలంలో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. కాంగ్రెస్‌లో కీలక నేతగా గుర్తింపు పొందిన ఇమ్మడి గోపీపై ఆయనకు బంధువైన సతీశ్ దాడి చేశాడు. ముందుగా కారుతో గుద్ది, అనంతరం కత్తితో దాడి చేసి గోపీని హత్య చేసినట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ దాడిలో తీవ్ర గాయాల కారణంగా గోపీ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన అనంతరం సతీశ్ నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు. సతీశ్, ఇమ్మడి గోపీకి వరుసకు మేనల్లుడు. ఒకే కుటుంబానికి చెందిన వారైనా, గ్రామ రాజకీయాల్లో ఏర్పడిన విభేదాలు వారిద్దరి మధ్య తీవ్ర శత్రుత్వంగా మారాయి. గ్రామంలో రాజకీయంగా ఇద్దరూ ప్రభావం చూపే స్థాయిలో ఉండటంతో, కాలక్రమేణా వీరి మధ్య విభేదాలు పెరిగాయి. ముఖ్యంగా గ్రామ సర్పంచ్ ఎన్నికల తర్వాత ఈ విభేదాలు మరింత తీవ్రమయ్యాయని స్థానికులు చెబుతున్నారు. గత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గౌరవరం గ్రామంలో సర్పంచ్ పదవికి ఇమ్మడి గోపీ భార్య పోటీ చేసి విజయం సాధించారు. అదే ఎన్నికల్లో సతీశ్ భార్య కూడా సర్పంచ్ పదవికి పోటీ చేశారు. అయితే ఆ ఎన్నికల్లో ఆయన భార్య ఓడిపోయారు. అప్పటి నుంచి రెండు కుటుంబాల మధ్య రాజకీయంగా తీవ్రమైన విభేదాలు మొదలయ్యాయి.

ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
(మునుపటి పేరు: శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్)

Truhome FINANCE

రిజిష్టర్డ్ ఆఫీస్ : శ్రీనివాస టవర్, 1వ అంతస్తు, డోరు నెం.5, పాత నెం.11, 2వ లేను, సెనటోఫ రోడ్డు, అల్వార్పేట, తేనం పేట చెన్నై-600018.
ప్రధాన కార్యాలయము: లెవెల్-3, వాకర్ట్ టవర్స్, ఈస్టింగ్ సి-2, జి బ్లాక్, బాంద్రా కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (ఈస్ట్), ముంబాయి-400 051, వెబ్‌సైట్: WWW.TRUHOMEFINANCE.IN

భౌతిక స్వాధీనం నోటీసు

ఈ , క్రింద సంతకం చేసిన వ్యక్తి ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్) యొక్క అధీకృత అధికారిగా సెక్యూరిటైజేషన్ మరియు పునర్నిర్మాణం ఆఫ్ ఫైనాన్షియల్ ఆస్తులు మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002 (చెప్పబడిన చట్టం) నిబంధనల ప్రకారం మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నియమాలు, 2002 (చెప్పబడిన నియమాలు) యొక్క నిబంధన 3 తో చదవబడిన చట్టంలోని సెక్షన్ 13(12) కింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించి రుణగ్రహీతలకు డిమాండ్ నోటీసులు జారీ చేశారు, వీటి వివరాలు క్రింద ఇవ్వబడిన పట్టికలో ఇవ్వబడినాయి డిమాండ్ నోటీసులలో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా కోరటమైనది
రుణగ్రహీతలు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, కింద సంతకం చేసిన అధీకృత అధికారి ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్) చట్టంలోని సెక్షన్ 13(4) కింద అతనికి ఇవ్వబడిన అధికారాలను ఉపయోగించి క్రింద వివరించిన ఆస్తిని 10-03-2026 వ తేదీన భౌతికంగా స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీతలకు మరియు ప్రజలకు నోటీసు ఇవ్వబడింది. ముఖ్యంగా రుణగ్రహీతను మరియు సాధారణం ప్రజలను ఈ ఆస్తితో వ్యవహరించవద్దని ఇందుమూలంగా హెచ్చరిస్తున్నాము మరియు ఆస్తితో ఏదైనా లావాదేవీ ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్) యొక్క ఛార్జీకి అనగా క్రింద పేర్కొన్న మొత్తానికి వడ్డీతో సహ. లోబడి ఉంటుంది,
సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి పొందేందుకు అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి, చట్టంలోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలపై రుణగ్రహీత దృష్టి కి తీసుకు రావటమైనది

రుణగ్రహీత పేరు మరియు చిరునామా

1.శ్రీమతి.బొల్లం రాధిక W/O శ్రీ.బొల్లం కేదారి
2.శ్రీ.బొల్లం కేదారి S/O శాంతమ్మ కొమురయ్య
R/0 22-2-110/2 దేశాయిపేట గబ్బూర్ హోటల్ సమీపంలోని వరంగల్ తెలంగాణా ఇండియా 506006 మరియు : H నం 1-72, పైడిపల్లి, హనుమకొండ బస్ స్టాప్ దగ్గర , వరంగల్, తెలంగాణ 506006

డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం

డిమాండ్ నోటీసు తేదీ: 22-02-2024
డిమాండ్ నోటీసు మొత్తం రూ. 1155967/- (రూపాయలు పదకొండు లక్షల యాభై ఐదు వేల తొమ్మిది వందల అరవై ఏడు మాత్రమే) 07-02-2024 నాటికి రుణం
ఖాతా నం. SILHWRNG0000758

తనఖా ఆస్తి వివరాలు

111.50 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న ఖాళీ స్థలం , 93.22 చదరపు మీటర్లకు సమానం, GWMC ఇంటి.నం. 22-2-110/2 తో, దేశాయ్‌పేట గ్రామం యొక్క సర్వే నం. 320లో, అంబెడ్కర్ అర్బన్ వరంగల్ నగరా వరంగల్ లో అర్బన్ జిల్లా లో ఉంది, గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిమితుల్లో, ఆదాయం మరియు రిజిస్ట్రేషన్ జిల్లా వరంగల్ అర్బన్ పరిమితుల్లో ఉంది మరియు ఇది ఉమ్మడి సబ్ రిజిస్ట్రార్ వరంగల్ (అర్బన్) అధికార పరిధి లో ఉంది మరియు సరిహద్దులు
తూర్పు: సారమ్మగారి ఖాళీ స్థలం, పశ్చిమాం : డి రాణి గారి ఖాళీ స్థలం
ఉత్తరం: అమ్మకప దారి మిగిలిన మిగిలిన ఖాళీ స్థలం, దక్షిణం: 10'00 సిసిరోడ్

స్థలం: వరంగల్, తెలంగాణ .
తేదీ: 10-03-2026
SD/- అధికృత అధికారి – ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (మునుపటి పేరు శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్)

# రైతులను బలహీనం చేసేలా చట్టాలు

### కౌలు రైతులను విస్మరిస్తున్న పాలకులు... వ్యవసాయరంగం మరింత సంక్షోభంలోకి నెట్టే చర్యలు



**అమరావతి,మార్చి12(ఆర్ఎన్ఎ):** పేద రైతు, కౌలు రైతు కేంద్రంగా ఉన్న వ్యవసాయాన్ని చట్టాల ద్వారా కార్పొరేట్లకు కట్టబెట్టడానికి మార్గం సిద్ధం చేస్తున్నారనేది స్పష్టంగా తెలుస్తుంది. వ్యవసాయ సంక్షోభం, యువరైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయేగాని తరగడం లేదు. అందుకుగల కారణాలను, పరిష్కారాలను కనిపెట్టడంలో ప్రభుత్వం వైపు నుండి వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. చంద్రబాబు నాయుడు రాష్ట్ర అసెంబ్లీలో 'డిజిటల్ అగ్రికల్చరల్ మిషన్' పత్రాన్ని ప్రవేశ పెట్టినప్పుడు కొన్ని ముఖ్యాంశాలను ప్రస్తావించారు. స్వర్ణాంధ్ర 2047 సాధించే సమయానికి వ్యవసాయరంగంపై ఆధారపడే జనాభా 60 శాతం నుండి 10 శాతానికి పడిపోతుందని అంచనా వేస్తున్నారు. నేడున్న వ్యవసాయ భూములు కూడా 30 శాతం చాలవని అంటున్నారు.. మిగతాది అవసరం లేదన్న ధోరణి కనిపిస్తోంది. అంటే ఆ భూములను ఎవరికైనా అమ్ముకోవచ్చన్న ధోరణి కనిపిస్తోంది. వ్యవసాయ రంగంలో మిగిలిపోయే మిగతా 50 శాతం జనాభాను పట్టణాలకు తరలించి వారిని చీప్ లేబర్‌గా వాడుకోవచ్చన్న దుర్మార్గ ఆలోచన కూడా ఇందులో ఇమిడి ఉంది. కేంద్ర ప్రభుత్వం సైతం ఈ సంవత్సరం 100 లక్షల ఎకరాలను అమ్మకానికి సిద్ధం చేసింది. నూతన నీటి విధానం' ప్రకారం కాలువలకు, పొలాలకు మీటర్లు పెట్టి నీటి వాడకాన్నిబట్టి రైతుల నుండి చార్జీలు వసూలు చేస్తారు. పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణానికి కంపెనీల నుంచి పెట్టుబడులు ఆహ్వానిస్తారు. ఈ విధానం పేద రైతులకు వ్యతిరేకమైనదిగా గుర్తించాలి. అప్పుడు సాగునీరు చాలా ఖరీదైనదిగా మారుతుంది. ఇకపోతే విత్తన బిల్లు 2025' చూస్తే రైతులకు ఆందోళన కలుగుతుంది. విద్యుత్ సవరణ చట్టం 2025' ప్రకారం మొత్తం విద్యుత్ వ్యవస్థను ప్రైవేటీకరించడం ప్రధానాంశం. ఐదు సంవత్సరాలలో క్రాస్ సబ్సిడీని రద్దు చేయాలనేది మరో కీలకాంశం. ఇది మెట్ట ప్రాంతాలలో, గిరిజన ఏరియాలో, వెనుకబడ్డ ప్రాంతాలలో చిన్న రైతుల పంపుసెట్లు, లిఫ్ట్‌ల వ్యవసాయాన్ని బాగా దెబ్బతీస్తుంది. ఎరువుల విధానం 2025' ప్రకారం ఎరువులపై ప్రభుత్వ నియంత్రణ తొలగించారు. సకాలంలో రైతులకు అందక పోయినా, ఉండాల్సిన నాణ్యత లేకపోయినా, ధర పద్ధతులలో తేడాలున్నా ప్రభుత్వ యంత్రాంగానికి బాధ్యత లేదు. ఇప్పుడు ఈ విధానంలో అదనంగా నానో లిక్విడ్ యూరియాను ప్రవేశ పెట్టింది. దాంట్లో నత్రజని 45 శాతం నుంచి 4 శాతానికి తగ్గుతుంది. యూరియాపై ప్రభుత్వ సబ్సిడీ మొత్తం తగ్గించి నగదు బదిలీ పథకం పెట్టాలని కేంద్రం రాష్ట్రాలను కోరుతోంది. నానో యూరియా తీసుకున్న రాష్ట్రంలో బస్తాకు రూ.800 సబ్సిడీ ఇస్తానని ప్రకటించింది. ప్రకృతి విపత్తుల చట్టం 25, సెక్షన్ 12లో బాధితులను ఆదుకోవడానికి వున్న సూచనలు తొలగించారు. సెక్షన్ 13లో పంటలు కోల్పోయిన రైతులకు చెందిన రుణాలు వాయిదా వేసి తిరిగి పంట రుణాలు రీషెడ్యూల్ చేసే చాప్టర్‌ను తొలగించారు.

# గ్యాస్ అక్రమ నిల్వలపై కఠిన చర్యలు తీసుకుంటాం- కలెక్టర్ అంకిత్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మార్చి 12, (నేటి మనదేశమ్),జిల్లాలో గ్యాస్ సిలిండర్ల అక్రమ నిల్వలు, గ్యాస్ సిలిండలను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. గురువారం ఐడీఓసి కార్యాలయంలో వ్యవసాయ శాఖ, ఇరిగేషన్ శాఖ, పౌరసరఫరాల శాఖల పనితీరుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ సంబంధిత అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయానికి సంబంధించిన సాగుభూమి వివరాలు, ప్రస్తుత సాగు పరిస్థితులు, ప్రధాన పంటల వివరాలు, రైతులకు అందుతున్న ప్రభుత్వ పథకాల అమలు పరిస్థితులపై వ్యవసాయ శాఖ అధికారుల ను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా రైతు భరోసా, రైతు భీమా పథకాల అమలు, లబ్ధిదారుల సంఖ్య, రైతులకు అందుతున్న ప్రయోజనాలపై సమగ్ర సమాచారం అందించాలని సూచించారు. జిల్లాలో పంటల వారీగా సాగు విస్తీర్ణం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై వివరాలు అధికారులకు అడిగి తెలుసుకున్నారు .ఇరిగేషన్ శాఖ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో ఉన్న నీటి వనరులు, చెరువులు, కాలువలు, ప్రాజెక్టులు, వాటి పరిధిలోని ఆయకట్టు విస్తీర్ణం, సాగునీటి లభ్యత తదితర అంశాలపై సమగ్ర సమాచారం




తెలుసుకొని,జిల్లాలో సాగునీటి వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ రైతులకు అవసరమైన నీటిని సకాలంలో అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.పౌరసరఫరాల శాఖకు సంబంధించి జిల్లాలో పనిచేస్తున్న రేషన్ దుకాణాల సంఖ్య, లబ్ధిదారులకు అందుతున్న సన్నబియ్యం పంపిణీ వివరాలు, నిల్వలు, సరఫరా పరిస్థితులపై కలెక్టర్ సమీక్షించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సమయానికి నాణ్యమైన రేషన్ సరుకులు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు .ఈ సందర్భంగా జిల్లాలో గ్యాస్ నిల్వల పరిస్థితిపై కూడా కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో గ్యాస్ నిల్వలు తగినంతగా ఉన్నప్పటికీ, వినియోగదారులు కొరత ఏర్పడుతుందనే భయంతో ముందుగానే అధిక మొత్తంలో బుకింగ్ చేయడం వల్ల కొన్నిచోట్ల తాత్కాలిక సమస్యలు తలెత్తుతున్నాయని అధికారులు తెలిపారు.దీనిపై స్పందించిన కలెక్టర్ ప్రజల్లో సరైన అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో గ్యాస్ సరఫరాలో ఎలాంటి కొరత లేదని ప్రజలకు తెలియజేయాలని చెప్పారు. అలాగే గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ చేయడం, బ్లాక్ మార్కెట్‌లో విక్రయించడం వంటి చర్యలను కట్టడి చేయడానికి ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. గ్యాస్‌ను అక్రమంగా నిల్వ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ సమావేశం లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, పౌరాసరఫరాల అధికారి ప్రేమ్ కుమార్, పౌరసరఫరాల మేనేజర్ త్రినాధ్ బాబు,ఇరేగేషన్ ఈ ఈ అర్జునరావు, ఇరేగేషన్ శాఖ ఏ ఈ లు, సంభంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ రాష్ట్రస్థాయి కరాటే ఫోటీలు

**కరీంనగర్ రూరల్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ విజయ్ కుమార్ చేతుల మీదుగా బ్రోచర్ ఆవిష్కరణ**



**కరీంనగర్, మార్చి 12: నేటి మన దేశమ్ ప్రతినిధి** ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ రాష్ట్రస్థాయి, ఇంటర్ స్టేట్ కరాటే చాంపియన్ షిప్ 2026 ఈ నెల మార్చి, 15వ తేది ఆదివారము స్థానిక ఆల్ఫోర్స్ ఇ- టెక్నో విద్యాసంస్థ కొత్తపల్లి, కరీంనగర్ లో నిర్వహించనున్నట్లు చీఫ్ ఆర్గనైజర్ కె .వసంత్ కుమార్ పేర్కొన్నారు.ఈ మేరకు గురువారం కరీంనగర్ రూరల్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ విజయ్ కుమార్ చేతుల మీదుగా బ్రోచర్ విడుదల కార్యక్రమాన్ని అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగినట్లు ఒకినావా కరాటే సంస్థల చీఫ్ ఇన్స్ట్రక్టర్ కె. వసంత్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కరాటే సీనియర్ మాస్టర్, సీనియర్ జర్నలిస్ట్ అబ్దుల్ మన్నన్ ( వేములవాడ), ఎం. లింగయ్య( జగిత్యాల్ ) కరాటే మాస్టర్లు వుల్లూరి శ్రీనివాస్, బుర్ర ప్రవీణ్ కుమార్, , రాజశేఖర్, రిషి కుమార్ ( కరీంనగర్) పాల్గొన్నట్లు టోర్నమెంట్ ఛీఫ్ ఆర్గనైజర్ కె. వసంత్ కుమార్ తెలిపారు.

## కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు వంట గ్యాస్ కోరత లేకుండా చూడాలి.

**వంట గ్యాస్ ను బ్లాక్ చేసి ఎక్కువ ధరలకు అమ్మితే చర్యలు తీసుకోవాలి.**

**హుస్నాబాద్ బిఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి ఐలేని మల్లికార్జున్ రెడ్డి**



**హుస్నాబాద్ మార్చి 12 నేటి మనదేశమ్ :** హుస్నాబాద్ పట్టణంలోని గ్యాస్ ఏజెన్సీ వద్ద హుస్నాబాద్ బిఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి ఐలేని మల్లికార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఇతర దేశాలయుద్ధలతో వంటగ్యాస్ ను ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలనిఈ సందర్భంగా మాట్లాడుతూ వంట గ్యాస్ ను ఆన్ లైన్ లో బుకింగ్ చేస్తే సర్వర్ బిజీ తో గంటల గడిచినా బుకింగ్ కావడం లేదని, ప్రజలు ఆవేదన చెందుతున్నారని, కేంద్రప్రభుత్వం ఎలాంటి గ్యాస్ కోరతలేదని ప్రకటనలు చేస్తుంది కానీ, పట్టణాల్లో ఆన్ లైన్ లో గ్యాస్ బుకింగ్ కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రజలకు గృహ, వాణిజ్య అవసరాలకు గ్యాస్ అందకపోవడంతో దీనిని ఆసరాగా తీసుకొని దళారీలు ఎల్ పిజిని బ్లాక్ చేసి ఎక్కువ ధరలకు అమ్మితే వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నామన్నారు.ఈ నిరసనలో మాజీ కౌన్సిలర్ బొజ్జ హరీష్, తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలకు నాణ్యమైన విద్యతోపాటు పరిష్కారం అందించాలి..



**ఆసిఫాబాద్, మార్చి 12 (నేటి మనదేశమ్):** : రెబ్బెన మండలం గోలేటి గ్రామపంచాయతీ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ అంగన్వాడి కేంద్రంలో గురువారం చిన్నారులకు దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోలేటి సర్పంచి అజ్మీర బాబురావు చిన్నారులకు యూనిఫామ్ లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యతోపాటు మంచి పోషకాహారం లభిస్తుందన్నారు.

## ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తాం..

**రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..**



**ధర్మపురి, మార్చి 12(నేటి మన దేశమ్ ప్రతినిధి):** గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు. గురువారం ధర్మపురి లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను ఆశ వర్కర్లు కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు సాగుతున్నారని ఇందులో భాగంగా వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

## ఖాతాదారులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం

**మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్**




**కోదాడ మార్చి 12 (నేటి మనదేశమ్):** తమ బ్యాంకు ఖాతాదారులకు అత్యుత్తమ సేవలు అందించినందుకు గాను అంతర్జాతీయ హై క్వాలిటీ హైమ్ రేటింగ్ సంస్థ ఫైవ్ స్టార్ రేటింగ్ ప్రకటించిందని సుధా బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్ తెలిపారు. గురువారం కోదాడ పట్టణంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో వారు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత 26 ఏళ్లుగా 300 కోట్ల టర్నోవర్ తో 9 శాఖలలో ఖాతాదారులకు నమ్మకమైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సైతం రుణాలు ఇచ్చి వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్నామన్నారు. కమర్షియల్ బ్యాంకులకు దీటుగా తక్కువ వడ్డీకే బంగారం, ఇండ్లు, వ్యక్తిగత, వ్యాపార రుణాలు అందిస్తున్నామని ఇట్టి అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డిపాజిట్లపై అధిక వడ్డీ చెల్లిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో చైర్మన్ మీలా మహాదేవ్,వైస్ చైర్మన్ కక్కిరేణి చంద్ర శేఖర్,డైరెక్టర్ లు తోట శ్యామ్, స్వామి వెంకటేశ్వర్లు,ఇరుకుల్ల చెన్న కేశవ రావు, వెంపటి వెంకట రమణ,బ్యాంక్ మేనేజర్ చెన్నూరు. రవి కుమార్, మరియు బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

## నా భూమి కబ్జా చేశారు... నాకు ప్రాణ భయం ఉంది కాపాడండి....

**దళం పేరుతో... భాయ్ పేర్లతో బెదిరింపులు...డాన్ ల అండతో మితిమీరిన ఆగడాలు...**

**న్యాయం చేయాలంటూ చాంద్ పాషా వేడుకోలు**



**కోరుట్ల,మార్చి 12(నేటి మన దేశమ్ ప్రతినిధి)**::ఇటీవల భూముల ధరలు భారీగా పెరగడంతో భూకబ్జాలు పెరుగుతున్నాయని సామాన్య ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణాలు, గ్రామాల పరిసరాల్లో ఉన్న ఖాళీ స్థలాలు, దేవాదాయ భూములు, ప్రభుత్వ భూములపై కబ్జాకోరుల దృష్టి పడుతోంది. నకిలీ పత్రాలు తయారు చేసి, స్థానిక ప్రభావాన్ని ఉపయోగించి భూములను ఆక్రమించుకునే ఘటనలు పెరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది మధ్యవర్తులు కూడా ఈ వ్యవహారాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. భూముల విలువ రోజురోజుకు పెరగడంతో అక్రమంగా లాభాలు పొందాలని కొందరు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితి వల్ల నిజమైన యజమానులు, సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు సమయానికి స్పందించకపోతే కబ్జాలు మరింత పెరిగే ప్రమాదం ఉందని ప్రజలు హెచ్చరిస్తున్నారు. భూకబ్జాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం, రెవెన్యూ శాఖ అధికారులు భూముల రక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరుతున్నారు.వివరాల్లోకి వెళితేజగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణానికి చెందిన చాంద్ పాషా అలియాస్ అబ్దుల్ షఫీక్ తనకు చెందిన 504 చదరపు గజాల భూమిని కొందరు వ్యక్తులు అక్రమంగా కబ్జా చేశారని ఆరోపిస్తూ మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణం లోని కృష్ణ మందిరం ముందు నేషనల్ హైవేకు ఆనుకుని ఉన్న తమ భూమిలో ఈ నెల 7వ తేదీన కొందరు వ్యక్తులు నిర్మాణ పనులు ప్రారంభించి గుంతలు తవ్వుతున్నారని ఆయన పేర్కొన్నారు. 293 సర్వే నంబర్‌లో ఉన్న తన స్థలానికి సంబంధించిన ఫేక్ డాక్యుమెంట్లు తిప్పిరి గంగాధర్ సృష్టించుకున్నారని ఆరోపించారు.ఈ భూమిని తిప్పిరి గంగాధర్, అజర్ భాయ్, సుజాహిత్ అలీ, ఎండీ రషీద్, ఖలీద్, ఇర్ఫాన్, ఎండీ మతిన్, షకీల్ (డాన్), ఘని తదితరులు అక్రమంగా ఆక్రమించుకున్నారని అడిగితే నా నా రకాల బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. వీరి వల్ల తనకు ప్రాణహాని ఉందని కూడా చాంద్ పాషా తెలిపారు. కొందరు వ్యక్తులు దళనాయకుల కుటుంబీకుళంమంటూ.. పేరుతో, మరికొందరు “భాయ్ గ్యాంగ్” వాళ్ళము అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు.ఈ ఘటనపై ఈ ఘటనకు బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్ లకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.ఈ ఘటనపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ అధికారులకు మీడియా ద్వారా చాంద్ పాషా విజ్ఞప్తి చేశారు.

## చదువుతోపాటు సంస్కారం అవసరమే

**జిల్లా విద్యాధికారి రాము**



**జగిత్యాల, మార్చి 12(నేటి మన దేశమ్ ప్రతినిధి)::**చదువుతోపాటు సంస్కారం అలవాటు చేసుకోవాలని జగిత్యాల జిల్లా విద్యాధికారి రాము అన్నారు. పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ధరూర్ క్యాంపులో గురువారం పదవ తరగతి విద్యార్థుల వీడుకోలు సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్బంగా రాము మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా నిర్భయంగా రాయాలని అన్నారు. అదేవిధంగా పరీక్షల తర్వాత మరుసటి రోజు పాఠశాలకు వచ్చి తదుపరి సబ్జెక్టు ప్రిపేర్ కావాలని, సందేహాలున్నచో ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు జిల్లా విద్యాధికారి హాల్ టికెట్స్, పరీక్షా ప్యాడ్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాళ్ళ అమర్నాథ్ రెడ్డి, పి ఆర్ టి యు టి ఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షులు బోయిని పెల్లి ఆనందరావు, ఉపాధ్యాయులు బాసిత్, శ్రీదేవి, శ్రీలత, గంగయ్య, షబానా, పవన్, ప్రభాకర్ ,షకీల్, అనుజ, ప్రవీణ్ తదితరులున్నారు

## ఎస్ పి చైతన్య రెడ్డి అరైవ్ అలైవ్ కార్యక్రమం పై ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించారు



**కామారెడ్డ్,మార్చ్ 12.(నేటి మనదేశమ్ ప్రతినిది)**గ్రామీణ ప్రాంతాల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడానికి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యంగా యువతలో రోడ్డు ప్రమాదాల నివారణా, ప్రమాదాలు తగ్గించడానికి, రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించడంలో గ్రామ సర్పంచ్‌లు కీలక పాత్ర పోషించాలని, ప్రతి యువత రోడ్డు ప్రయాణ సమయంలో హెల్మెట్ ధరించడం, వేగాన్ని నియంత్రించడం, మొబైల్ ఫోన్ వాడకపోవడం, మద్యం సేవించి వాహనం నడపకపోవడం వంటి నియమాలను తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.గ్రామ సర్పంచ్‌లు స్థానికంగా యువత కోసం అవగాహన శిబిరాలు నిర్వహించడానికి, స్కూల్‌లలో, అంగన్‌వాడీ కేంద్రాల్లో, యువకేంద్రాలలో రోడ్డు భద్రతా సెంటర్లలో ట్రైనింగ్‌ను పర్యవేక్షించాల్సిన బాధ్యతను తీసుకోవాలని,ఈ కార్యక్రమం ద్వారా యువత రోడ్డు ప్రమాదాల నుండి స్వయంగా రక్షణ తీసుకోవడం, సురక్షితంగా ప్రయాణించడం కోసం అవగాహన పెంపొందించడం లక్ష్యం గా ముందుకు సాగాలని తెలిపారు.

## పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణకు అత్యధిక ప్రాధాన్యత

**కోరుట్లలో శ్మశానవాటిక, డంపింగ్ యార్డ్, శానిటేషన్ పరిస్థితులపై జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పరిశీలన**



**కోరుట్ల, మార్చి 12(నేటి మన దేశమ్ ప్రతినిధి)::**ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా గురువారం జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణ కేంద్రంలో ఉన్న శ్మశానవాటిక, డంపింగ్ యార్డ్ మరియు పట్టణంలోని పారిశుధ్య పరిస్థితులను జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా పట్టణంలో పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపర్చాలని, చెత్తను సమయానికి సేకరించి శాస్త్రీయ విధానంలో నిర్వహించాలని, సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చెత్త నిర్వహణ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయాలని, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.డంపింగ్ యార్డ్‌ను పరిశీలించిన కలెక్టర్ చెత్త వేరు చేసే ప్రక్రియ, చెత్త నిర్వహణ విధానం, పరిసర ప్రాంతాల పరిశుభ్రతపై అధికారులతో చర్చించారు. చెత్తను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహిస్తూ పరిసర ప్రాంతాల్లో దుర్వాసన, కాలుష్యం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతను కాపాడుతూ, పర్యావరణానికి హాని కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అనంతరం కోరుట్ల పట్టణంలోని శ్మశానవాటికను సందర్శించి నీటి సౌకర్యం మరియు అవసరమైన విద్యుత్ దీపాలు మరియు పరిసరాల పరిశుభ్రత, అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ప్రజలు ఉపయోగించే ప్రదేశం కావడంతో అవసరమైన సదుపాయాలను మెరుగుపర్చాలని, శ్మశానవాటికలో పరిశుభ్రతను నిరంతరం కొనసాగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజా పాలన -- ప్రగతి కార్యక్రమం లక్ష్యాలను సాధించేందుకు పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవీందర్ , మున్సిపల్ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# బీసీ సాధికారిత సంఘం ఆధ్వర్యంలో ఘనంగా కొండ దేవయ్య పటేల్ జన్మదిన వేడుకలు!

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య( పటేల్) జన్మదిన వేడుకలు
అట్టడుగు బడుగు బలహీనర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి కృషి చేస్తా
మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య ( పటేల్ )



**వేములవాడ, మార్చి12: నేటి మన దేశమ్ ప్రతినిధి** బీసీ సాధికారిత సంఘం ఆధ్వర్యంలో మున్నూరు కాపు నిత్యాన్న సత్ర భవనంలో కొండ దేవయ్య పటేల్ రాష్ట్ర బీసీ సాధికారిత సంఘం గౌరవ అధ్యక్షులు, రాష్ట్ర మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు కొండ దేవయ్య జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరుపుకున్నారు జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కటింగ్ చేసి ,పలువురికి స్వీట్లు పంపిణీ చేశారు.జన్మదినం సందర్భంగా కొండ దేవయ్య కు పలువురు శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బీసీ సాధికారిత సంఘం, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య మాట్లాడుతూ అట్టడుగు,బడుగు బలహీనర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని,బీసీ హక్కుల సాధనకై, బీసీల సంక్షేమానికి,బీసీల ఆత్మ గౌరవంకై బీసీల సహాకారంతో పోరాడుతామన్నారు.ప్రభుత్వాలు ఎన్నికలొస్తేనే బీసీలను గుర్తించడం కాకుండా రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాల పరిధిలో ఉన్న బీసీ సమస్యలను వెంటది వెంట పరిష్కరించాలని ,బీసీలకు ఎన్నికల్లో చేసిన వాగ్దానాలను నెరవేర్చాలని,తన జన్మదినం సందర్భంగా ప్రజలకు సౌకర్యార్థం అంబులెన్స్ వాహనాన్ని ప్రారంభించారు.అనువారి కారణాల వలన మధ్యలో అంబులెన్స్ సేవలు నిలిచాయని,తిరిగి యధావిధిగా అంబులెన్స్ సేవలు కొనసాగుననీ దేవయ్య అన్నారు. ప్రతి సంవత్సరం రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు నిర్వహిస్తున్నామని, జిల్లాలో వేలాదిమంది కరాటే క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యం అని అన్నారు.పొలాస నరేందర్ ఉత్తర తెలంగాణ జిల్లాల ఇంచార్జీ మాట్లాడుతూ కొండ దేవయ్య మున్నూరు కాపు కులం పటిష్టత కొరకు,కులం ఐక్యత కోసం గత 20 ఏండ్ల నుండి సేవచేస్తున్న వ్యక్తని అంతే కాకుండా స్వాతంత్ర్య ఫలాలు,రాజ్యాంగ ఫలాలు జనాభా దామాషన బీసీలకు అందడం లేదని బీసీలకు న్యాయం జరగాలని బీసీలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలన్న తపనతో,తాపత్రయంతో,లక్ష్యంతో ముందుకు వెళ్తున్న వ్యక్తి కొండ దేవయ్య పటేల్ అని అన్నారు.జన్మదిన వేడుకల కార్యక్రమంలో కరాటే అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, సీనియర్ జర్నలిస్టు అబ్దుల్ మన్నాన్, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షులు బొప్ప దేవయ్య పటేల్ మున్నూరు కాపుసంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు గాదె స్రవంతి, బీసీ నేతలు కూరగాయల కొమురయ్య,కూరగాయల మల్లేశం,నామాల పోషెట్టి,కొండ కనుకయ్య,మారం కుమార్,గోపు బాలరాజు, మెంగేన మనోహర్, కొరేపు నరేష్,అయిలవేని రాజేందర్,ఇల్లందుల వెంకటేష్,చింతల కోటి రామ స్వామి గౌడ్,ముద్రకొల లింబద్రి,చేను హేలపతి,అన్నారం ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

# పత్యేక ప్రణాళికలను అమలు చేద్దాం.., ప్రగతిని సాధిద్దాం..

జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్
అట్టహాసంగా సాగిన ప్రజాప్రతినిధుల అవగాహన సదస్సు






**నిర్మల్, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** "ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని అమలుచేసి గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ప్రగతిని సాధిద్దామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం, నిర్మల్ పట్టణంలోని తిరుమల గార్డెన్స్ లో, ఇటీవలి ఎన్నికైన గ్రామ సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లకు అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, నిర్మల్, ముధోల్, ఖానాపూర్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పవార్ రామారావు పటేల్, వెడ్మ బొజ్జు పటేల్ లతో కలిసి పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించి, తెలంగాణ రాష్ట్ర గీతం ఆలాపన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలువురు చిన్నారులచే ప్రదర్శింపబడిన సంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. వీరికి కలెక్టర్, ఎమ్మెల్యే లు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ.., ప్రభుత్వం అమలు పరుస్తున్న పథకాలు, కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరాలనే ఉద్దేశంతో 99 రోజుల ప్రత్యేక ప్రణాళికను ప్రారంభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రజలంతా పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. ప్రత్యేక ప్రణాళికలో భాగంగా జిల్లాలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజల్లో ఉన్న అనారోగ్య సమస్యలను తీర్చేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజా ప్రతినిధులందరికీ పంచాయతీరాజ్ మున్సిపల్ చట్టాలపై అవగాహన ఉండాలని తెలిపారు. ప్రజా ప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు.

**ప్రజా ప్రతినిధులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలి:**

**– నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి** ప్రజా ప్రతినిధులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని నిర్మల్ శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ప్రజా ప్రతినిధులుగా ప్రజలకు సేవ చేసే అవకాశం లభించడం గొప్ప విషయం అని, నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు అంతా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, పరిష్కరించే విధంగా కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసి కృషి చేయాలని. అధికారులు పెండింగ్లో ఉన్న ఫైల్స్ అన్నింటిని 99 రోజుల ప్రణాళికలో భాగంగా పరిష్కరించాలని తెలిపారు.

**అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి**

**– ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్** ప్రజా సంక్షేమానికై, అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ అన్నారు. ఇటీవలి స్థానిక సంస్థల్లో ఎన్నికైన వారిలో ఎక్కువ శాతం యువత ఉన్నారని. వీరంతా ఉత్సాహంగా ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ పథకాల అమలులో కృషి చేయాలని ఆయన తెలిపారు.

**గ్రామాల అభివృద్ధిలో సర్పంచులదే ముఖ్యపాత్ర:**

**– ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్.** ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధిలో సర్పంచులదే కీలకపాత్ర అని తెలిపారు. ప్రజా ప్రతినిధులు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య అనుసంధానకర్తనులుగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు గ్రామసభలు నిర్వహిస్తూ, గ్రామంలోని సమస్యలను తెరుసుకొని పరిష్కరించాలని తెలిపారు. ప్రజా ప్రతినిధులకు ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం ద్వారా, వారికి పరిపాలన జ్ఞానం పెరుగుతుందని పేర్కొన్నారు. జిల్లాకు నిధులు తీసుకురావడంలో తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం పెంబి ఆస్పిరేషన్ బ్లాక్ ను అభివృద్ధి పథంలో నడిపిన ప్రజాప్రతినిధులను, సన్మానించి అభినందించారు. అధికారులు ప్రజల విలువైన భాగస్వామ్యంతోనే పెంబి ఆస్పిరేషన్ నుంచి నుంచి ఇన్స్పిరేషన్ వైపు పయనించిందని కొనియాడారు. రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలలో అద్భుత ప్రగతి కనబరిచి పథకాలు సాధించిన క్రీడాకారులకు జ్ఞాపికలు అందించి, సన్మానించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి అధికారులు ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం శాఖల వారీగా సర్పంచులు ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, నిర్మల్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ లు అప్పాల కావ్య, అప్పాల గణేష్ చక్రవర్తి, భైంసా మున్సిపల్ చైర్మన్ మున్సిపల్ దత్తాత్రి, జిల్లా గ్రంథాల సంస్థ చైర్మెన్ సయ్యద్ అర్జుమంద్ అలీ, డిఎల్ఎస్ఎ సెక్రటరీ రాధిక, సర్పంచ్ లు, మున్సిపల్ కౌన్సిలర్ లు, ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మైనారిటీ మహిళలు ఆర్థికంగా ఎదగాలి

రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి
ప్రతి నియోజకవర్గ పరిధిలో సుమారు 200 కుట్టు మిషన్లు పంపిణీ
క్యాంప్ కార్యాలయంలో కూసుమంచి మండల మస్జిద్ కమిటీలకి రంజాన్ గిఫ్ట్ పాకెట్స్, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద ముస్లిం మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్లు అందజేసిన మంత్రి పొంగులేటి



**ఖమ్మం,కూసుమంచి, మార్చి 12 (నేటి మనదేశమ్):** మైనారిటీ మహిళలు ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వం కుట్టు మిషన్లు ఉచితంగా పంపిణీ చేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం కూసుమంచి క్యాంప్ కార్యాలయంలో కూసుమంచి మండలానికి చెందిన మస్జిద్ కమిటీలకు రంజాన్ గిఫ్ట్ పాకెట్స్, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద ముస్లిం మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్లను అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని మైనారిటీ సోదరులు ఒక్కపొద్దులు రోజా ఉంటూ అల్లాను ప్రార్థిస్తూ, సర్వ మత ప్రజలందరూ చల్లగా ఉండాలని ప్రార్ధనలు చేస్తూ, పవిత్రమైన మనస్సు చాటుతున్నందుకు అభినందనలు తెలిపారు. అల్లా మైనార్టీ సోదరుల కోరిక తీర్చాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రతి పేదవానికి అండదండలుగా ఉంటూ అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, ప్రతి నియోజకవర్గ పరిధిలో సుమారు 200 కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్నామని అన్నారు. మైనారిటీ సోదరీమణులు కుట్టు మిషన్లతో వారి నైపుణ్యాన్ని ఉపయోగించి ఆర్థికంగా ఎదగాలని అన్నారు. మహిళలు కూడా సంపాదించడం ప్రారంభించిన తర్వాత కుటుంబాలు మరింత ఆర్థికంగా స్థిరపడతాయని అన్నారు. లిరాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ నెలలో మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేయడం సంతోషంగా ఉందని అన్నారు. అనంతరం పాలేరు నియోజకవర్గానికి చెందిన 163 మంది ముస్లిం మైనారిటీ మహిళా లబ్ధిదారులకు కుట్టు మిషన్లను, కూసుమంచి మండల మస్జిద్ కమిటీలకి 350 రంజాన్ గిఫ్ట్ పాకెట్స్ లను మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాలేరు నియోజక వర్గ ప్రత్యేక అధికారి రమేష్, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ముజాహిద్, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగం - ఆర్థిక స్వావలంబన......

కుటుంబ బంధాల్లో పెరుగుతున్న దూరం?.....
దాంపత్య విభేదాల దారుణంగా మారుతున్న వైనం......
నేరేడ్ మెట్ లో జరిగిన ఘటనపై సమాజంలో చర్చ......



**నేరేడ్ మెట్, మార్చి 12 (నేటి మనదేశమ్):** భార్యను ఉన్నతంగా చూడాలని భర్త చేసిన ఉపకారమే ఆయన పాలిట శాపంగా మారింది. భర్త సహకారంతో చదువుకొని పోలీస్ డిపార్ట్మెంట్లో ఉన్నత స్థానంలో ఉండి భర్తను మానసిక వేదనకు గురి చేసేలా అధికారి చేసిన చర్యలకు మానసిక వేదనకు గురి అయి ఆత్మహత్య చేసుకున్నాడు ఆ భర్త . ఇలాంటి సంఘటనలు సమాజంలో ఎక్కడో ఒకచోట జరుగుతూనే ఉన్నాయి. ఇలాంటి సంఘటన మల్కాజ్గిరి కమిషనరేట్ లోని నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న సంఘటన తెలిసిన విషయమే.నేరేడ్ మెట్లో జరిగిన నాగెల్లి శ్రీనివాస్ ఆత్మహత్య ఘటన మరోసారి దాంపత్య సంబంధాలపై సమాజంలో ఆలోచనకు దారి తీసింది. ఆధునిక జీవనశైలిలో వ్యక్తిగత స్వేచ్ఛ, ఆర్థిక స్వావలంబన పెరుగుతున్నప్పటికీ, కుటుంబ బంధాల్లో పెరుగుతున్న విభేదాలు కొన్నిసార్లు తీవ్ర పరిణామాలకు దారి తీస్తున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.పోలీసుల వివరాల ప్రకారం, లక్ష్మీ నగర్కు చెందిన నాగెల్లి శ్రీనివాస్ భార్యతో నెలకొన్న వివాదాలు, కోర్టు కేసుల కారణంగా మానసికంగా తీవ్ర ఆవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**మారుతున్న జీవన విధానం -- మారుతున్న సంబంధాలు** సామాజిక పరిశీలకుల అభిప్రాయం ప్రకారం గతంలో కుటుంబ వ్యవస్థలో పెద్దల మాటకు ప్రాధాన్యం ఉండేది. భార్యాభర్తల మధ్య తలెత్తిన విభేదాలు కుటుంబ సభ్యులు, పెద్దల మధ్యవర్తిత్వంతో పరిష్కారమయ్యేవి. అయితే ప్రస్తుతం నగరీకరణ, ఉద్యోగాల ఒత్తిడి, వ్యక్తిగత జీవనశైలి మార్పులు కుటుంబ బంధాలపై ప్రభావం చూపుతున్నాయని వారు చెబుతున్నారు.కొన్ని సందర్భాల్లో భార్యాభర్తల మధ్య తలెత్తే చిన్న విభేదాలే పెద్ద సమస్యలుగా మారి న్యాయపరమైన కేసుల దాకా వెళ్లడం కుటుంబాల్లో ఆందోళన కలిగిస్తోంది.

**కేసులు... కోర్టులు... పెరుగుతున్న దూరం**న్యాయ నిపుణుల ప్రకారం, కుటుంబ వివాదాల్లో చట్టపరమైన పోరాటాలు మొదలైన తర్వాత సంబంధాలు మరింత దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. ముఖ్యంగా వరకట్న వేధింపులు, విడాకుల పిటిషన్లు వంటి కేసులు నమోదయ్యాక కుటుంబ సభ్యుల మధ్య ఉద్రిక్తతలు పెరిగే అవకాశముందని వారు పేర్కొంటున్నారు.ఈ నేపథ్యంలో సమస్యలను ముందుగానే గుర్తించి కౌన్సెలింగ్, కుటుంబ పెద్దల చర్చలు, సామాజిక మద్దతు వంటి మార్గాలను ఉపయోగించడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

**పరస్పర గౌరవమే బంధానికి బలం** సామాజిక వేత్తల అభిప్రాయం ప్రకారం దాంపత్య బంధం పరస్పర గౌరవం, నమ్మకం, సహనం అనే విలువలపై నిలుస్తుంది. ఈ విలువలు దెబ్బతిన్నప్పుడు కుటుంబ బంధాలు బలహీనపడతాయి.నేటి సమాజంలో మహిళలు, పురుషులు ఇద్దరూ సమానంగా విద్య, ఉద్యోగాల్లో ముందుకు వస్తున్న నేపథ్యంలో పరస్పర అవగాహన మరింత అవసరమని వారు చెబుతున్నారు.నేరేడ్మెట్ ఘటన ఒక్క కుటుంబానికి జరిగిన విషాదం మాత్రమే కాకుండా, మారుతున్న సమాజంలో దాంపత్య సంబంధాలపై మళ్లీ ఆలోచించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తున్న సంఘటనగా పరిశీలకులు భావిస్తున్నారు.కుటుంబ బంధాలు బలపడాలంటే సంభాషణ, సహనం, పరస్పర గౌరవం అనే విలువలు సమానంగా నిలవాల్సిన అవసరం ఉందని వారు సూచిస్తున్నారు.

# భద్రాద్రి రామయ్య కళ్యాణానికి పోచంపల్లి చేనేత పట్టువస్త్రాల తయారీ కి శ్రీకారం.

ప్రారంభించిన ఆలయ ఈవో కే దామోదర్ రావు.



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మార్చి 12, (నేటి మనదేశమ్),** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 27న శ్రీరామనవమిని పురస్కరించుకొని మిథిలా స్టేడియంలోని శిల్పకళా శోభితమైన కళ్యాణ మండపంలో నిర్వహించే శ్రీ సీతారామచంద్రస్వామి వారి కళ్యాణానికి పోచంపల్లి చేనేత పట్టువస్త్రాల తయారీకి గురువారం శ్రీకారం చుట్టారు. సికింద్రాబాద్ కు చెందిన చేనేత కళాకారులు గత కొన్నేళ్లుగా రామయ్య కళ్యాణానికి చేనేత పట్టువస్త్రాలను తయారుచేసి ఇస్తున్నారు. ఈ క్రమంలో ఈసారి సైతం పట్టువస్త్రాలను శ్రీ సీతారామ చంద్ర లక్ష్మణ స్వాములకు ఆంజనేయ స్వామికి అందజేసేందుకు పట్టువస్త్రాల తయారీ పనులను చేపట్టగా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఈవో కే దామోదర్ రావు లంచనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చేనేత కళాకారులు పాల్గొన్నారు.

# 'ప్రజా పాలనపై కౌన్సిలర్లకు సర్పంచ్లకు అవగాహన సదస్సు




**అదిలాబాద్ మార్చ్ 12 (నేటి మన దేశమ్ ప్రతినిధి** జిల్లాలో "ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక" లో భాగంగా 99 రోజుల ప్రత్యేక కార్యాచరణను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు.గురువారం స్థానిక రెవెన్యూ గార్డెన్ లో ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సర్పంచ్లు,మున్సిపల్ కౌన్సిల్ సభ్యుల శిక్షణ కార్యక్రమంలో ఆదిలాబాదు,బోథ్ ఎమ్మెల్యేలు పాయల శంకర్,అనిల్ జాదవ్ తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి ప్రసంగించారు.ముందుగా జిల్లాలో 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా వైద్యారోగ్య శాఖ,వ్యవసాయ శాఖ (రైతు భరోసా,రుణమాఫీ),విద్యాశాఖ (అమ్మ ఆదర్శ పాఠశాల),ఎస్సీ , ఎస్టీ,బీసీ సంక్షేమ శాఖల ద్వారా చేపడుతున్న కార్యకలాపాలు, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'అరైవ్ అలైవ్'రోడ్డు భద్రతా కార్యక్రమం, అటవీ శాఖ ద్వారా పర్యావరణ పరిరక్షణపై సంబంధిత,ఇతర శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. జిల్లాలో "ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక" లో భాగంగా 99 రోజుల ప్రత్యేక కార్యాచరణను విజయవంతం చేయాలి.కొత్తగా ఎన్నికైన వార్డు కౌన్సిలర్లకు ఇది మొదటి శిక్షణ అని,సర్పంచులు,కౌన్సిలర్లు సమన్వయంతో పని చేసి జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు.ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ, సంక్షేమ,అభివృద్ధి పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని అన్నారు.ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ,ప్రజా ప్రతినిధులు అభివృద్ధి,సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని,ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష ,డిఆర్డీఓ రవీందర్,డిపిఓ రమేష్ ,అదనపు ఎస్పీలు సురేందర్ రావు,మౌనిక,మున్సిపల్ వైస్ చైర్మన్ రోహిత్,జిల్లా ఉద్యానవన అధికారి నర్సయ్య ,మున్సిపల్ కమిషనర్ రాజు,సర్పంచ్ లు,మున్సిపల్ వార్డుల కౌన్సిలర్లు,వివిధ శాఖల జిల్లా అధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## "99 రోజుల ప్రజా పాలన- ప్రణాళిక,కార్యక్రమం"లో ఎమ్మెల్యే పాయల్ శంకర్




**ఆదిలాబాద్ మార్చ్ 12 (నేటి మన దేశమ్ ప్రతినిధి.** కొత్తగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులు తమ పరిధిలోని సమస్యలు వెంటనే పరిష్కారమవాలని భావించడం సహజమని,అయితే అధికారులకు ఉన్న పరిమితులు,విధానాలను కూడా అర్థం చేసుకోవడం అవసరమని తెలిపారు.ప్రభుత్వ పథకాలను అమలు చేసే ప్రక్రియలో ఉన్న సవాళ్లను ముందుగా తెలుసుకుని,అధికారులతో సమన్వయం చేసుకుంటూ పని చేయాలని సూచించారు.ప్రతి శాఖ ఏ పని చేస్తుందో ప్రజాప్రతినిధులు పూర్తిగా అవగాహన చేసుకోవడం వల్ల అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలవుతాయని ఆయన పేర్కొన్నారు.ప్రజాప్రతినిధులు రాజకీయాల కంటే అభివృద్ధి పై ఎక్కువ దృష్టి పెట్టి,ప్రతి ఒక్కరి కోసం పని చేయాలని ఆయన కోరారు.సర్పంచులు,కౌన్సిలర్లు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి తాను ఎప్పుడూ పూర్తి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఆదిలాబాద్ను అభివృద్ధి దిశగా తీసుకెళ్లవచ్చని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు.

## విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలి..

ఆదర్శ క్రీడా పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ హరిత..



**ఆసిఫాబాద్, మార్చి 12 (నేటి మనదేశమ్):** : జిల్లా కేంద్రంలోని ఆదర్శ క్రీడా పాఠశాలను గురువారం జిల్లా కలెక్టర్ కె. హరిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని వంటగది, స్టోర్ రూమ్,పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించి పరిశుభ్రత పాటించాలని సిబ్బందికి సూచించారు.విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. వంటగదిలో తయారుచేసిన అల్పాహారాన్ని స్వయంగా పరిశీలించి రుచి చూసిన కలెక్టర్, ఆహార నాణ్యతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు.ఈ సందర్భంగా విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. క్రీడా విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు సమయానికి పౌష్టికాహారం అందించాలని తెలిపారు.పాఠశాలలో పరిశుభ్రత, ఆహార నాణ్యత, విద్యార్థుల వసతి సదుపాయాలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# యుద్ధం ఆపండి


- కొనసాగితే దేశ ఆర్థిక వ్యవస్థలు కుదేలు - ప్రజలపై అధిక భారాలు
- ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దాడులను ఖండిస్తూ కార్మిక సంఘాల నిరసన




**విశాఖపట్నం, మార్చి 12 (నేటి మనదేశమ్) :** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధోన్మాదాన్ని ఖండిస్తూ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె.అచ్యుతరావు మాట్లాడుతూ ఆయిల్ మీద పెత్తనం కోసం అమెరికా, ఇజ్రాయిల్ ఇరాన్‌పై ఈ యుద్ధం చేస్తున్నాయన్నారు. దీన్ని తక్షణం ఆపాలని, లేనిపక్షంలో దేశ ఆర్థిక వ్యవస్థ, కార్మికులు, రైతులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. దేశంలో గ్యాస్ కొరత నెలకొందన్నారు. కమర్షియల్ గ్యాస్ సరఫరా తగ్గిపోవడం వల్ల హోటళ్లు, గిగ్ వర్కర్లు, తోపుడుబండ్ల కార్మి కులు, హాస్టల్స్ ఇలా ప్రతి రంగం అతలాకు తలమవుతున్నాయన్నారు. మన దేశం నుండి ఎగుమతయ్యే రొయ్యలు, గుడ్లు, అరటి పండ్లు, ఉల్లిపాయలు వంటివి ఎగుమతి కాకుండా ఆగిపోయాయన్నారు. దేశ ప్రయోజనాలరీత్యా మోడీ తన విధానాలను మార్చుకొని యుద్ధం ఆపేందుకు కృషి చేయాలన్నారు. యుద్ధం వద్దని ప్రజలు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు చేయాలని కోరారు. ఐక్యరాజ్యసమితిలో యుద్ధం ఆపాలని భారత ప్రభుత్వం తీర్మానం ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. మోడీ కనీసం నోరు విప్పకపోవడం వల్ల దేశం తీవ్రంగా నష్టపోతోందని తెలిపారు. యుద్ధం వల్ల కలిగిన నష్టాన్ని తెలియజేశారు. ఇప్పటికే పాకిస్తాన్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.350 దాటిందన్నారు. భారత దేశంలో గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధరను రూ.60కు పెంచారని, భవిష్యత్తులో చమురు నిక్షేపాలు నిల్వలు లేవని ప్రకటనలు చేస్తున్నారని అన్నారు. దేశంలో చమురు ధరలు పెరిగితే ప్రజలు వాడే నిత్యావసర ధరలన్నీ పెరుగు తాయన్నారు. తక్షణమే యుద్ధం ఆపి ప్రపం చంలో శాంతి నెలకొల్పాలన్నారు. కార్య క్రమంలో సిఐటియు నాయకులు కెఎం.కుమార మంగళం, పి.మణి, పి.వెంకట రావు, కె.కుమారి, వై.రాజు, గణేష్, ఎం.సుబ్బా రావు, ప్రకాశరావు, ఎఐటియుసి నాయకులు బూసి వెంకటరావు, ఎస్‌కె.రెహ మాన్, పడాల రమణ, కె.సత్యనారాయణ, కె.సత్యాం జనేయ, కాసు బాబు తదితరులు పాల్గొన్నారు. అనకాపల్లిలో... యుద్ధోన్మాదాన్ని ఖండిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో అనకాపల్లి కూరగాయల మార్కెట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు వివి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అమెరికన్ సామ్రాజ్యవాదం ప్రపంచ దేశాలపై పెత్తనంలో భాగంగానే ఈ యుద్ధం సాగు తోందన్నారు. ఇరాన్‌పై తక్షణం దాడులను ఆపాలని కోరారు. ఈ యుద్ధంతో ప్రపంచ దేశాల్లో, ముఖ్యంగా భారతదేశంలో ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. యుద్ధం కారణంగా దేశంలో గ్యాస్ ధరలను కేంద్ర బిజెపి ప్రభుత్వం పెంచిందని, హోటల్స్‌కు గ్యాస్ సరఫరాను కుదించిందని, నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుదలకు కారణమైందని తెలిపారు. చమురు నిక్షేపాల కోసం అమెరికా పన్నుతున్న కుట్రలను ప్రపంచ దేశాలు వ్యతిరేకిస్తున్నాయన్నారు. ఇరాన్‌పై చేస్తున్న దాడుల్లో పసిపిల్లల ప్రాణాలు పోతు న్నాయని తెలిపారు. మోడీ ప్రభుత్వం అమెరికాకు జూనియర్ భాగస్వామిగా మారే చర్యలను విడనాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గంటా శ్రీరామ్, అనకాపల్లి మండల కన్వీనర్ కాళ్ల తేలయ్యబాబు, ఎ.రాజు, అప్పారావు, నాయుడు, సురేష్, చలపతి, పాపారావు పాల్గొన్నారు.

# గ్యాస్ సంక్షోభం

**వాణిజ్య సిలిండర్ల ఫిల్లింగ్ పూర్తిగా నిలిపివేత**
**నిల్వల మేరకు అరకొరగా సరఫరా**
**అందరికీ అందని సిలిండర్లు**
**ఇదే పరిస్థితి కొనసాగితే నేడో రేపో ఒక్కొక్కటిగా మూత**
**సమస్య పరిష్కరించాలంటూ జేసీని కలిసిన హోటళ్ల అసోసియేషన్ ప్రతినిధులు**



**విశాఖపట్నం, మార్చి 12 (నేటి మనదేశమ్) :** వాణిజ్య సిలిండర్ల సరఫరా నిలిపివేయాలని కేంద్రం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో విశాఖపట్నంలో ఏకంగా ఆ సిలిండర్ల ఫిల్లింగ్‌నే ఆపేశారు. నిల్వలు ఉన్నంత మేరకు గ్యాస్ ఏజెన్సీలకు, వారి నుంచి ముఖ్యమైన ఖాతాదారులకు మాత్రమే అవి అందుతున్నాయి. ఇంతకు ముందులా అడిగిన వ్యాపారులందరికీ వాణిజ్య సిలిండర్లు ఇవ్వడం లేదు. డీలర్లకు మంగళవారం నుంచే పూర్తిగా ఆపేశారు. కొందరికి బుధవారం అరకొరగా ఇచ్చారు. గురువారం నుంచి ఇక అవి కూడా ఉండవని చెబుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే నగరంలోని హోటళ్లు ఒక్కొక్కటిగా మూతపడే పరిస్థితి వస్తుంది. దీనిని తప్పించడం కేంద్రం మినహా ఇంకెవరి వల్ల కాదని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. విశాఖపట్నంలో పెద్ద హోటళ్లు, రెస్టారెంట్లు, చిన్న హోటళ్లు, మెస్‌లు, రోడ్డు పక్కన టిఫిన్ దుకాణాలన్నీ కలిపి సుమారు రెండు వేల వరకు ఉన్నాయి. వాటికి సగటున రోజుకు నాలుగు వేల వాణిజ్య గ్యాస్ సిలిండర్లు అవసరం. ఆ మేరకు సరఫరా జరిగితేనే అన్ని హోటళ్లు, రెస్టారెంట్లు నడుస్తాయి. ప్రస్తుతం కొందరి వద్ద అరకొరగా ఉన్న నిల్వలను వారికి ముఖ్యమైన హోటళ్లకు అంటే...రెగ్యులర్‌గా తీసుకుంటూ, వెంటనే బిల్లులు ఇచ్చే వారికి మాత్రమే అందిస్తున్నారు. అవి కూడా ఎనిమిది అవసరమైన చోట నాలుగు, ఐదు అడిగిన వారికి రెండు చొప్పున ఇస్తున్నారు. మిగిలిన వారికి అవి కూడా అందడం లేదు. ఒక స్థాయి కలిగిన హోటళ్లు, రెస్టారెంట్లు కొద్దిమొత్తంలో అంటే రెండు రోజులకు సరిపడా గ్యాస్ సిలిండర్లను అందుబాటులో ఉంచుకుంటాయి. ప్రస్తుతం సరఫరా ఆగిపోవడంతో అవి కూడా అయిపోవస్తున్నాయి. గురువారం నుంచి సిలిండర్లు ఇవ్వకపోతే హోటళ్లను నడపలేని పరిస్థితి ఉంది.

**అందుబాటులో 1.08 లక్షల డొమెస్టిక్ సిలెండర్లు**

జిల్లా అధికారుల సమాచారం ప్రకారం వాణిజ్య సిలిండర్ల ఫిల్లింగ్ ఆగిపోయింది. కేవలం డొమెస్టిక్ సిలిండర్లు మాత్రమే ఫిల్లింగ్ చేస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం 1.08 లక్షల డొమెస్టిక్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయి. ఏ రోజుకారోజు అదనంగా వస్తాయి. జిల్లాలో మొత్తం 62 గ్యాస్ ఏజెన్సీలు ఉండగా 9 లక్షల మంది గృహ వినియోగదారులు ఉన్నారు. వారిలో రోజుకు 20 నుంచి 25 వేల మంది సిలిండర్లు బుక్ చేసుకుంటారు. ప్రస్తుతానికి డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల సరఫరాకు ఇబ్బంది లేదు. అయితే ఒకసారి గ్యాస్ డెలివరీ తీసుకున్న తరువాత వెంటనే మళ్లీ బుకింగ్ కాదు. రెండో సిలిండర్ బుకింగ్ కనీసం 25 రోజుల సమయం తీసుకోవాలి. అదే డబుల్ సిలిండర్లు ఉన్నట్టయితే 30 రోజులలోపు బుక్ చేసుకునేందుకు అవకాశం ఉండదు. ఇప్పుడు వినియోగదారులకు ఆ సమాచారం కూడా మెసేజ్ రూపంలో పంపుతున్నారు. మీరు ఫలానా తేదీ తరువాతే గ్యాస్ బుక్ చేసుకోవాలని స్పష్టంగా చెబుతున్నారు.

**జేసీని కలిసిన హోటళ్ల అసోసియేషన్ ప్రతినిధులు**


వాణిజ్య సిలిండర్ల సరఫరా ఆగిపోవడంతో, తమ వ్యాపారాలు మూతపడతాయని, సుమారు రెండు లక్షల మంది ఉపాధి కోల్పోతారని, తక్షణమే గ్యాస్ సరఫరాకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ విశాఖపట్నం హోటల్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం సాయంత్రం జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరిని కలిశారు.

డిమాండ్ మేరకు కాకపోయినా సగమైనా ఇవ్వాలని, లేదంటే వ్యాపారాలు ఆగిపోవడంతో పాటు, ప్రజలు, పర్యాటకులు కూడా ఇబ్బందిపడే పరిస్థితి వస్తుందని అసోసియేషన్ అధ్యక్షులు బాలకృష్ణ తెలిపారు.

**ఆస్పత్రులు, హాస్టళ్లకు డొమెస్టిక్ సిలిండర్లు**

ఆస్పత్రులు, ప్రభుత్వ హాస్టళ్లకు ఇప్పటివరకు వాణిజ్య సిలిండర్లనే అందించేవారు. ఇప్పుడు అవి అందుబాటులో లేకపోవడం, ఆయా సంస్థలు ముఖ్యమైనవి కావడంతో వాటికి డొమెస్టిక్ సిలిండర్లు ఇవ్వాలని పైనుంచి ఆదేశాలు రావడంతో జిల్లా అధికారులు ఆ మేరకు చర్యలు చేపడుతున్నారు.

# చిత్తూరులో అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్



**చిత్తూరు, మార్చి 12 (నేటి మనదేశమ్) :** ఆంధ్ర ప్రదేశ్ లోని చిత్తూరులో ఇంటి దొంగ తనాలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర ముద్దాయి లను చిత్తూరు టూ టౌన్ పోలీస్ స్టేషన్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు నిందితుల వద్ద నుంచి సుమారు రూ.34 లక్షల విలు వైన 151 గ్రాముల బంగారు ఆభరణాలు, 2.6 కిలోల వెండి వస్తువులు మరియు రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, ఫిబ్రవరి 5న దుర్గా నగర్ కాలనీలో నివసించే వరదరాజులు ఇంటికి తాళం వేసి స్వగ్రామానికి వెళ్లిన సమయంలో నిందితులు లల్లూ ప్రసాద్ (ఎ1), జనార్ధన్ (ఎ2) ఇంటి తలుపు పగలగొట్టి బంగారం, వెండి దొంగిలించారు. బాధితుడు ఫిబ్రవరి 6న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. విశ్వసనీయ సమాచారం మేరకు మార్చి 11న చిత్తూరు–గుడిపాల రహదారిలో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

పోలీసుల విచారణలో ఎ1 లల్లూ ప్రసాద్‌పై కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కలిపి 31 కేసులు ఉన్నట్లు తెలిసింది. ఎ2 జనార్ధన్‌పై ద్విచక్ర వాహనాల దొంగతనం మరియు గంజాయి అక్రమ రవాణా సంబంధిత 7 కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితులను...

కోర్టులో హాజరుపరచేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు.

# గంజాయితో ముగ్గురి అరెస్టు



**ఎచ్చెర్ల, మార్చి 12 (నేటి మనదేశమ్) :** పొన్నాడ పంచాయతీ వెంకన్నగారి పేట సమీపంలో గంజా యితో ముగ్గురు యువకులను బుధవారం అరెస్టు చేయగా, మరో వ్యక్తి పరారైనట్టు జేఆర్ పురం సీఐ ఎం.అవతారం తెలి పారు. సీఐ తెలిపిన వివ రాల మేరకు.. శ్రీకాకుళం నగరం పాత శ్రీకాకుళాని కి చెందిన గంటల సూర్యతేజ, దమ్మల వీధికి చెందిన కేశవ బాలు, సోపేటి కార్తీక్, అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగూడ మండలం పిట్టగూడకు చెందిన బురి డి లైకోన్ గంజాయి తాగుతున్నారు. వీరివద్ద గంజాయి ఉందన్న ముందస్తు స మాచారంతో ఎస్ఐ, సిబ్బంది, డిప్యూటీ తహసీల్దార్‌తో కలిసి పట్టుకునేందుకు ప్రయత్నించగా.. కార్తీక్ తప్పించుకుని పారిపోగా మిగిలిన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వీరంతా తరచూ ఈ ప్రాంతానికి వచ్చి మద్యం, గంజాయిని తీసు కుంటున్నట్టు విచారణలో తేలింది. వీరి నుంచి ద్విచక్ర వాహనంతోపాటు 2.3 కి లోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అరకు నుంచి బురిడి లైకోన్ గంజా యిని తీసుకువచ్చి ఇక్కడ కిలో రూ.3వేలకు విక్రయిస్తున్నట్టు విచారణలో గుర్తిం చారు. గంజాయి సేవిం చినా, రవాణాకు పాల్పడినా, విక్రయించినా నేరమన్నారు. అటువంటి వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని, చట్టపరంగా రౌడీషీట్లు తెరుస్తా మని హెచ్చరించారు. ఎచ్చెర్ల ఎస్ఐ జి.లక్ష్మణరావు, సిబ్బంది ఉన్నారు.

# తిరుపతిలో వైసీపీ ఆవిర్భావ వేడుకలు



**తిరుపతి, మార్చి 12 (నేటి మనదేశమ్) :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం సందర్భంగా తిరుపతిలోని మారుతినగర్ క్యాంపు కార్యాలయంలో పార్టీ జెండాను మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి ఆవి ష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గత 15 ఏళ్లుగా, అధికారం ఉన్నా లేకున్నా, ప్రజల పక్షంలో పోరాటం కొనసాగిస్తూ, రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు. ప్రత్యర్థులు చెప్పిన అబద్ధాలతో ప్రజలను మోసం చేశారని తెలిపారు.

బ్యాంకుల్లో ఒక్క మహిళ కని పించదు, వ్యాపారస్తులు దుకాణాలు మూసుకుం టున్నారని ఆగ్రహించారు. కేంద్రం ఇచ్చిన అప్పులన్నీ ఏమై పోతున్నాయో తెలియదని, పోలవరం అభివృద్ధి లేదని, రాయలసీమ అభివృద్ధి లేదని పేర్కొన్నారు. పెట్టుబడులు అన్ని అమరావతిలోనే పెట్టబడుతున్నా యన్నారు. 1978 నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్నా ఇంత దారుణమైన ప్రభుత్వం ఎప్పుడూ చూడలేదన్నారు.

# ఎన్నికలెప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలి



**వినుకొండ, మార్చి 12 (నేటి మనదేశమ్) :** స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని, ఎమ్మెల్యేలు పనితీరును మరింత మెరుగుపరుచుకుని ప్రజల మన్ననలు పొందాలని పల్నాడు జిల్లా ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీకి సిఎం చంద్రబాబు సూచించారు. పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లాలోని ఏడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, కలెక్టర్ కృతికా శుక్ల, ఎస్పీ బి.కృష్ణారావుతో సిఎం బుధవారం సమీక్షించారు. శాంతి భద్రతలు పరిరక్షణ, జిల్లా సమగ్రాభివృద్ధి, నియోజకవర్గాల వారీగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సిఎం సమీక్షించారు. జిల్లాను రాష్ట్రంలో ముందు వరుసలో ఉంచేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు సంయు క్తంగా పనిచేయాలని, ప్రజ లకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు.

# పౌర సేవల్లో పల్నాడుకు 2వ స్థానం



**పల్నాడు జిల్లా, మార్చి 12 (నేటి మనదేశమ్) :** ప్రజలకు పౌర సేవలు అందించడంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ ప్రకారం పల్నాడు జిల్లాకు రెండవ స్థానం లభించిందని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా తెలిపారు. ప్రధానంగా అన్నా క్యాంటీన్ల నిర్వహణ, ఆర్టీసీ బస్సు ప్రయాణ వసతి, రైతులకు విత్తనాల పంపిణీ, వైద్య సేవలు, మహిళలపై నేరాల నివారణ తదితర 39 రకాల సేవలపై చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణలో జిల్లా మెరుగ్గా పనిచేసిందన్నారు. ప్రజల సంతృప్త స్థాయి డిసెంబరులో 68.1 శాతం ఉండగా 5.4 శాతం వృద్ధితో 73.50 శాతానికి పెరిగిందన్నారు.

# వరల్డ్ పారా అథ్లెటిక్స్ లో కాంస్యంతో మెరిసిన గౌతమ్



**విజయనగరం, మార్చి 12 (నేటి మనదేశమ్) :** న్యూ ఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం వేదికగా మార్చి 8 నుండి 13 వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వరల్డ్ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిక్స్ -2026 పోటీలలో భారతదేశం తరపున పాల్గొన్న విజయనగరం జిల్లాకు చెందిన పారా అథ్లెట్ కరణం గౌతమ్ (ᏮT-12 కేటగిరి ) 100 మీటర్ల పరుగులో కాంస్య పతకం సాధించారు. ఇది అంతర్జాతీయ వేదిక మీద జిల్లాకు దక్కిన గౌరవమని జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కె.దయానంద్ ఆనందం వ్యక్తం చేసారు. వరల్డ్ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిక్స్ పోటీలకు భారత్ నుండి ఆరుగురు (6) పారా క్రీడాకారులు ఎంపిక కాగా అందులో విజయనగరం జిల్లాకు చెందిన కరణం గౌతమ్ ఒకరని తెలిపారు. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచి కాంస్యం గెలుచుకున్న గౌతమ్ అంతర్జాతీయ వేదికపై జిల్లా కీర్తిని మరింతగా పెంచాడని అన్నారు. ఇదే స్ఫూర్తి తో భవిష్యత్ లో దేశానికి మరిన్ని విజయాలు అందించాలని ఆకాంక్షించారు.

# పోలీస్ స్టేషన్లకు పదో తరగతి ప్రశ్నపత్రాలు



**రామచంద్రపురం,మార్చి 12 (నేటి మనదేశమ్) :** కె.గంగవరం మండలానికి సంబంధించిన పదో తరగతి ప్రశ్నాపత్రాలను ఎంఇఒ ఆంజ నేయులు, చీఫ్ సూపరింటెం డెంట్ ఖాజా మొహిద్దీన్, కస్టోడియన్లు సుబ్రహ్మణ్యం, అరుగుల శ్రీనివాసరావు సమక్షంలో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ సోమేంద్ర ప్రశ్నాపత్రాలను స్టేషన్‌లో భద్ర పర్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో సెక్షన్ 144 అమల్లో ఉంటుందని, పరీక్షలు జరుగుతున్న సమయంలో పరీక్షా కేంద్రాల వద్దకు అనుమతి లేని వ్యక్తులు చేరకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటారని అన్నారు.

# ప్రత్తిపాడు మండలంలో పెద్దపులి ప్రత్యక్షం

**ప్రత్తిపాడు, మార్చి 12 (నేటి మనదేశమ్) :** ప్రత్తిపాడు కొంతకాలంగా అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం, పోలవరం జిల్లా రాజవొమ్మంగి మండలం, ఏలేశ్వరం మండలం ఏలేరు పరీవాహక ప్రాంతంలో సంచరిస్తున్న పులి బుధవారం నాటికి కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంలోకి ప్రవేశించిందని ఏలేశ్వరం ఫారెస్ట్ రేంజ్ అధికారులు తెలిపారు. ప్రత్తిపాడు మండలం దారపల్లి అటవీ ప్రాంతం పరిసరాల్లో అటవీ అధికారులు పెద్దపులిని గుర్తించారు. అది ప్రత్తిపాడు, శంఖవరం మండలాల్లో సంచరిస్తుందా, లేదా అనకాపల్లి జిల్లా వైపు వెళు తుందా అనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. పులి కదలికలపై శాటిలైట్ ట్యాగ్ ద్వారా అటవీ నిపుణుల బృందాలు నిఘా పెట్టాయి. ప్రత్తిపాడు మండలంలోకి పులి ప్రవేశించడంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. సమీప ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ తెలిపారు.

# ఇఫ్తార్ విందు మతసామరస్యానికి ప్రతీక

**టీబీజీకేఎస్ కేంద్ర ఉపాధ్యక్షులు వి ప్రభాకర్ రావు**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: మార్చి 12: పినపాక నియోజకవర్గం( నేటి మన దేశమ్ (ప్రతినిధి)**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇఫ్తార్ విందులోవెల్లివిరిసిన మతసామరస్యం టి బి జి కే ఎస్ కేంద్ర ఉపాధ్యక్షులు వి ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో పివి కాలనీలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీక అని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టి బి జి కె ఎస్)కేంద్ర కమిటీ ఉపాధ్యక్షులు వూకంటి ప్రభాకర్ రావు అన్నారు బుధవారం నాడు పివి కాలనీ జామే మజీద్ హే హుదా బొంబాయి కాలనీ మసీదులో వి ప్రభాకర్ రావు (తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) కేంద్ర కమిటీ ఉపాధ్యక్షులు ఆధ్వర్యంలో పీవీ కాలనీ ముస్లిం సోదరులకు ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు ముస్లిం సోదర సోదరీమణులు ఎంతో నిష్టగా కఠినమైన ఉపవాస దీక్షను నిర్వహిస్తారని చివరి రోజు నెలవంక చూసిన తర్వాత దీక్ష విరమిస్తారని ఈ సందర్భంలో ప్రతిరోజు సాయంత్రం నిర్వహించే ఉపవాస దీక్ష ఇఫ్తార్ విందు మత సామ్రాస్యానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు అదేవిధంగా తెలంగాణ జాతిపిత కెసిఆర్ నాయకత్వంలో ప్రభుత్వం రెండు పర్యాయాలు కూడా ముస్లిం సోదరుల కొరకు, సింగరేణి కార్మికుల కొరకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత కేసిఆర్ ప్రభుత్వాన్ని దేనిని ఆయన ప్రశంసించారు, గతంలో సింగరేణిలో రంజాన్ సెలవు ఉండేది కాదని టి బి జి కె ఎస్ చొరవతో కెసిఆర్ ప్రభుత్వం ఆధ్వర్యంలో రంజాన్ ఆప్షనల్ హాలిడే గా ప్రకటించి అమలు చేస్తున్నారని ఆ ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని దేనిని ఆయన గుర్తు చేశారు అదేవిధంగా మణుగూరులో కూడా సింగరేణి ముస్లిం ఉద్యోగులు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘాన్ని ఎంతగానో ఆదరించాలని ఆదరిస్తున్నారని వారి స్నేహభావాన్ని ఏనాడు తాను మర్చిపోనని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజల మద్దతుతో తెలంగాణలో రాబోయే ప్రభుత్వం బి.ఆర్.ఎస్ దేనని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు అనంతరం జరిగిన ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులతో కలిపి పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కురి నాగేశ్వరరావు బిఆర్ఎస్ మండల అధ్యక్షులు, పోశం నరసింహారావు, మాజీ జడ్పిటిసి, కుంటా లక్ష్మణ్ పట్టణ అధ్యక్షులు, ఐ శంకర్, ఎస్ మోహన్ రావు ఎస్ రామారావు, ఎం వి శ్రీనివాస్, బానోత్ కృష్ణ, కే ఉపేందర్, టంగుటూరి శ్రీనివాస్, డి వెంకటేశ్వర్లు, కీసర శ్రీనివాసరెడ్డి, అత్తులూరి రవీందర్, యు శ్రీనివాస్ అమీనుద్దీన్ ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు

# మిమ్ములనే నమ్ముకున్నాం మాకు న్యాయం చేయండయ్యా

***సింగరేణి కాంటాక్ట్ కార్మికులకు వేతన పెంపు మరియు ఇతర సమస్యలు పరిష్కరించాలి***

***ఐ ఎఫ్ టి యు ఆధ్వర్యంలో రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి ఛైర్మన్ బి జనక్ ప్రసాద్ కి వినతి పత్రం అందజేసిన కాంట్రాక్ట్ కార్మికులు***



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: మార్చి 12: పినపాక నియోజకవర్గం (నేటి మన దేశమ్ (ప్రతినిధి)**భద్రాద్రి కొత్తగూడెం జిల్లామణుగూరు ఏరియా సింగరేణి కార్మికుల అందరంమిమ్ములనే నమ్ముకున్నాం న్యాయం చేయండయ్యా అంటూ ఐ ఎఫ్ టి యు ఆధ్వర్యంలో మణుగూరు ఏరియా సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు మణుగూరు సందర్శనకు విచ్చేసిన కనీస వేతనాల సలహాలు ఛైర్మన్ ఐ ఎన్ టి యు సి రాష్ట్ర నాయకులు బి జనక్ ప్రసాద్ గారి వద్ద మొరపెట్టుకున్నారు పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు సహకారంతో ఆయనకు ఒక వినతిపత్రం కూడా అందజేశారు ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ మణుగూరు ఏరియా అధ్యక్షులు అంగోత్ మంగీలాల్ మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా సుమారు ముప్పై రెండు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులుగా వివిధ విభాగాలలో పనిచేస్తున్నారనీ అందరు ఈ అసెంబ్లీ ఎన్నికలలో స్థానిక సంస్థల ఎన్నికలలో కూడా కాంగ్రెస్ పార్టీ నీ బలపరిచారనీ కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించారనీ కోల్ బెల్ట్ ప్రాంతంలో ఎంతగా ప్రభావితం చేయగలిగారో జనక్ ప్రసాద్ కి తెలియందికాదనీ కాంటాక్ట్ కార్మికులు చిరు జీతాలతో తమ జీవితాలను వెళ్ళదీస్తున్నారన్నారు, మా జనక్ ప్రసాద్ కనీస వేతనాల సలహా మండలి ఛైర్మన్ అయ్యారు మాకు న్యాయం చేస్తారని వెయ్యి కళ్లతో ఎంతగానో ఎదురుచూస్తున్నారన్నారు దయచేసి 22 నెంబర్ జీవో కానీ లేదా హై పవర్ కమిటీ వేతనాలు కానీ అమలు చేయాలని ఆ దిశగా తగు చర్యలు చేపట్టాలని కోరారు అలాగే ఈ క్రింది సమస్యల పరిష్కారానికి కూడా మీరు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. సంక్షేమ పథకాలలో భాగంగా ఈఎస్ఐ వైద్యం తక్షణమే అమలు చేయాలి ,సి ఎం పి ఎఫ్ పర్మినెంట్ కార్మికులకు మాదిరిగా ఆన్లైన్ సేవ అమలు అమలు చేయాలి ,సింగరేణి క్యాంటీన్లలో టీ టిఫిన్ లకు బడ్జెట్ కేటాయించాలి ,పని భద్రత కల్పించాలి ,మణుగూరు ఏరియా సింగరేణి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు కూడా ఖాకీ యూనిఫామ్ అమలు చేయాలి ,నర్సరీ కాంటాక్ట్ కార్మికులకు జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలి పిఎఫ్ అమలు చేయాలి ,వేసవి నేపథ్యంలో వివిధ గనులు, డిపార్ట్మెంట్ లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలి, ఖాళీగా ఉన్న సింగరేణి క్వార్టర్లను కాంటాక్ట్ కార్మికులకు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు, ప్రైవేట్ వాహనం డ్రైవర్లకు కేటాయించాలి ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికులు కే గురుమూర్తి, యు శివరామకృష్ణ,టి రాములు, జి శ్రీనివాస్, రామారావు, గోవింద శ్రీను, ఈ పవన్ కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

**జూబ్లీహిల్స్ మార్చ్ 12 (నేటి మన దేశమ్ (ప్రతినిధి)**విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని ముందుకు సాగాలని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వల్లాల నవీన్ యాదవ్ అన్నారు. గురువారం యూసుఫ్ గూడ లో శ్రీ చైతన్య టెక్నో పాఠశాలలో నిర్వహించిన అల్ ఇండియా ఓలింపియాడ్ పరీక్షలో ప్రతిభ కనబర్చిన విద్యార్థిని, విద్యార్థులకు నవీన్ యాదవ్ ల్యాప్ టాప్, ట్యాబ్, స్మార్ట్ వాచ్ లు బహుమతులు గా అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఓలింపియాడ్ వంటి జాతీయ స్థాయి పరీక్షల్లో ప్రతిభ కనబరచడం గర్వకారణమని ప్రశంసించారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే లక్ష్యంతో చదువుకుంటూ ముందుకు సాగితే భవిష్యత్తులో ఉన్నత స్థానాలను సాధించగలరని పేర్కొన్నారు. కష్టపడి చదువుకుంటూ తల్లిదండ్రులు, గురువులు, సమాజానికి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




# మార్చి 28న భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా జరిగే జాతీయ లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోండి.

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్...**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మార్చి 14, (నేటి మనదేశమ్),** తెలనగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు, ఈ నెల మార్చి 28న శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని కోర్టులలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కార్యదర్శి ఎం రాజేందర్ గురువారం ఒక ప్రకటన లో వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కక్షిదారులు తమ పెండింగ్ కేసులను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ ఒక అద్భుతమైన అవకాశమని పేర్కొన్నారు. రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, మోటార్ వాహన ప్రమాద నష్టపరిహార కేసులు, వివాహ బంధానికి సంబంధించిన కేసులు, ఆస్తి పంపకాల వివాదాలు, అద్దె వివాదాలు మరియు ఇతర సివిల్ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ మరియు ఇ – చలాన్ కేసులు, సైబర్ క్రైమ్ కేసులు, చిన్న చిన్న దొంగతనం కేసులు, టెలిఫోన్ కేసులు, మనోవర్తి కేసులు, కొట్టుకున్న కేసులు మొదలైన కేసులను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగే పని లేకుండా తక్షణమే తుది తీర్పు లభిస్తుందని తెలిపారు. ఇక్కడ గెలుపోటములు ఉండవని, ఇరుపక్షాల అంగీకారం తోనే నిర్ణయం జరుగుతుందని అన్నారు. దీనిపై మళ్ళీ అప్పీలుకు వెళ్లే అవకాశం ఉండదని తెలిపారు. జిల్లాలోని కక్షిదారులు, ప్రతివాదులు తమ న్యాయవాదుల ద్వారా లేదా నేరుగా సంబంధిత కోర్టులలో సంప్రదించి తమ కేసులను లోక్ అదాలత్ జాబితాలో చేర్చుకోవాలని మరియు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కోర్టుల చుట్టూ తిరిగే శ్రమను, ఖర్చును తగ్గించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోరారు.

# పేదల పక్షాన ఉతికి ఆరేస్తాం.

**- వెలుగుమట్ల భూదాన్ భూముల్లో హైడ్రామా.**
**- ముగ్గురు మంత్రులకు సిగ్గుండాలి.**
**- మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు.**




**మణుగూరు మార్చి 12 (నేటి మనదేశమ్):** ఖమ్మం వెలుగుమట్ల భూదాన్ భూముల్లో హైడ్రామ చేసి పేదలు నిర్మించుకున్న ఇండ్లను ఉన్నపలంగా బుల్డోజర్లతో కూలగొట్టి ఇప్పుడేమో పేదలకు మేము పట్టాలిస్తామంటూ చెప్పడం ఇండ్లను కూల్చడం ఎందుకు మళ్లీ వాళ్లకు పట్టాలు ఇవ్వడం ఎందుకు. భూములు కబ్జాకు గురి అయినయి అంటూ కప్పిపుచ్చుకోవడం ఆ ముగ్గురు మంత్రులకే చెల్లుబాటు అవుతుందని ఇలాంటి పని చేయడానికి ఆ ముగ్గురు మంత్రులకు సిగ్గుండాలని పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. 720 మంది ఇండ్లను కోల్పోయి రోడ్డున పడగా వారిలో 311 మందికి మాత్రమే పట్టాలిచ్చి గొప్పలు చెప్పుకోవడం ఎంతవరకు సమంజసం. అందులోనూ ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఒక్కొక్కరి వద్ద నుండి లక్ష రూపాయలు అధికార పార్టీ నాయకులు వసూలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. భూదాన్ భూముల్లో 61 ఎకరాలు 7 గుంటల భూమి ఉండగా 30 మాత్రమే మిగిలి ఉంది. 30 ఎకరాలు మాత్రం అభివృద్ధి పనుల పేరుతో ప్రభుత్వం తీసుకుంది. రాబోయే రోజుల్లో బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసిఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో అసెంబ్లీ సమావేశాల్లో ప్రజల పక్షాన ప్రజా సమస్యలపై అధికార పార్టీని ఉతికి ఆరేస్తాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో అడప అప్పారావు, యాదగిరి గౌడ్, ఎడ్ల శ్రీనివాస్, జావిద్ పాష, రవి ప్రసాద్, సృజన్, సురేష్, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

**-కిచెన్ షెడ్ నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే పాయల్ శంకర్**

**అదిలాబాద్ మార్చ్ 12 (నేటి మన దేశమ్ ప్రతినిధి.**నియోజకవర్గంలోని జైనాద్/బోరజ్ మండలంలోని బాలాపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో కిచెన్ షెడ్ నిర్మాణానికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఈరోజు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్యక్రమం సక్రమంగా నిర్వహించేందుకు కిచెన్ షెడ్ నిర్మాణం ఎంతో అవసరమని అన్నారు. ఈ నిర్మాణం ఈజీఎస్(కేంద్ర ప్రభుత్వ నిధులు) ద్వారా చేపడుతున్నామని తెలిపారు. విద్యాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి పలు పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా విద్యా రంగంలో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు. ఇటీవల ఆదిలాబాద్ నియోజకవర్గంలో యంగ్ ఇండియా స్కూల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదన పంపినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వం ఆ ప్రతిపాదనను ఆమోదించి జైనాద్ మండలం బెల్గాం గ్రామ సమీపంలో సుమారు రూ.200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణం చేపట్టనుంది అని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి ద్వారా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు మెరుగైన విద్య అందించడం తమ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు,అధికారులు,గ్రామస్థులు. అచ్యుత్,జక్కుల వేణు,భగవాన్లు, రాజశేఖర్, శంకర్,విట్టల్,రాజు తదితరులు పాల్గొన్నారు.



# చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు..

**ఆసిఫాబాద్ ఎస్పీ చిత్తరంజన్ ఐపీఎస్**



**ఆసిఫాబాద్, మార్చి 12 (నేటి మనదేశమ్):** తిర్యాని మండలంలోని ఆశ్రమ హైస్కూల్‌లో గురువారం "పోలీసులు మీకోసం" కార్యక్రమంలో భాగంగా పదో తరగతి విద్యార్థులకు ఏఎస్పీ చిత్తరంజన్ విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు, పెన్నులు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. ఆశ్రమ స్కూల్ విద్యార్థులకు వాలీబాల్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ చిత్తరంజన్ మాట్లాడుతూ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు ఏకాగ్రతతో చదివి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. చదువు ద్వారానే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని పేర్కొంటూ విద్యార్థులను ప్రోత్సహించారు. పదవ తరగతి విద్యార్థులు స్పష్టమైన లక్ష్యంతో కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థానాలు సాధించవచ్చున్నారు. గ్రామీణ ,గిరిజన ప్రాంతాల విద్యార్థులు కూడా పట్టుదలతో ముందుకు సాగితే దేశానికి సేవ చేసే స్థాయికి ఎదగగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెబ్బెన సీఐ సంజయ్, తీర్యాని ఎస్ఐ వెంకటేష్, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్య సేవలపై వివరించాలి

**కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**రాజన్నసిరిసిల్ల , మార్చి 12: నేటి మన దేశమ్ ప్రతినిధి** ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే వారికి ప్రభుత్వ వైద్య సేవలపై వివరించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. తంగళ్లపల్లి మండలం నేరెళ్ల పీహెచ్ సీని కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్, రక్త పరీక్షలు చేసే ల్యాబ్, మందుల గది, ఇతర గదులు, ఆవరణ పరిశీలించారు. వ్యాక్సిన్లు, మందుల నిలువపై ఆరా తీశారు. రోజు ఆసుపత్రికి ఎందరు రోగులు వస్తున్నారని, ఎందరు గర్భిణులు వైద్య సేవలు పొందుతున్నారని ఆరా తీశారు. రోగులతో మాట్లాడారు. వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. వైద్యులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ వైద్య సేవలపై అందరికీ అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై వివరించాలని తెలిపారు. గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఎండాకాలం నేపథ్యంలో ప్రజలకు జాగ్రత్తలు తెలుపాలని సూచించారు. ఇక్కడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా పోస్ట్ కార్డుల ఉద్యమం

**కోరుట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు బైరి విజయ్ కుమార్**



**కోరుట్ల,మార్చి 12(నేటి మన దేశమ్ (ప్రతినిధి):**ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోస్ట్ కార్డుల ఉద్యమం చేపట్టినట్లు కోరుట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు బైరి విజయ్ కుమార్ తెలిపారు. ప్లాస్టిక్ రహిత సమాజం నిర్మాణమే లక్ష్యంగా గురువారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జగిత్యాల న్యాయవాది నాగిరెడ్డి మధుసూదన్ రెడ్డి సౌజన్యంతో "పోస్ట్ కార్డు ఉద్యమం" ప్రారంభిం చారు. ఈసందర్భంగా కోరుట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు బైరి విజయ్ కుమార్ మాట్లాడుతూ నాగిరెడ్డి మధుసూదన్ రెడ్డి ప్రారంభించిన ప్లాస్టిక్ రహిత సమాజం కోసం చేపట్టిన ఉద్యమం హర్షణీయమని, ఇది సమాజానికి ఎంతో దోహదపడుతుందన్నారు. భావి తరాలకు ఆరోగ్యకరమైన, శుభ్రమైన వాతావరణాన్ని అందించాలనే సంకల్పంతో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం అత్యవసరమని వెల్లడించారు. ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ వినియోగశీ తగ్గించి, ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరుట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు బైరి విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ చిలివేరి రాజశేఖర్, లేడీ రిప్రెసెంటేటివ్ అంబల్ల నాగ నిర్మల, బార్ అసోసియేషన్ సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ వెంటనే విడుదల చేయాలి

**- తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్.**



**జగిత్యాల మార్చి12(నేటి మన దేశమ్ ప్రతినిధి):**రిటైర్ అయిన ఉద్యోగుల పెన్షన్ ప్రయోజనాలు, దాచుకున్న సొమ్ము వంటి బెనిఫిట్లను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమావేశంలోముఖ్య అతిథి గా పాల్గొన్నారు. సమావేశానికి జిల్లా ప్రధాన కార్యదర్శి పి. సి. హన్మంత్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఉద్యోగ విరమణ పొందిన 26 మంది ఉద్యోగులకు సభ్యత్వం అందజేసి2026 డై?రీలను, మెమోంటోలు హరి అశోక్ కుమార్ చేతుల మీదుగా అందజేసి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడు తూ గడిచిన రెండేళ్లుగా రాష్ట్రములో 14,వేల మంది ఉద్యోగులు ఉద్యోగ విరమణ చెందినా వాళ్లకు రావాల్సిన గ్రాట్యూటీ, కమ్యూటెడ్ పెన్షన్, జి. పి. ఎఫ్, లీవ్ ఎన్ క్యాష్ మెంట్ అన్నీ కలిసి ఒక్కొక్కరికి సరాసరి రూ. 50 లక్షల వరకు ఉంటుందని, ప్రస్తుతం వీరందరికీ నెల వారీ పెన్షన్ మాత్రమే వస్తున్నదని, ప్రభుత్వం స్పందించి ప్రతి నెలా ఉద్యోగ విరమణ చేస్తున్న వారికి ఎప్పటికప్పుడు బెనిఫిట్స్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. హన్మంత్ రెడ్డి సహాయ అధ్యక్షులు బొల్లం విజయ్,కోశాధికారి గౌరి శెట్టి విశ్వనాతం, నాయకులు పూసాల అశోక్ రావు,ఎం.డి. యాకూబ్ వెలముల ప్రకాష్ రావు,సంజీవ రావు, సత్యనారాయణ,కట్ట గంగాదర్, పబ్బా శివానందం,కుందేళ్ల మురళి,ఉప్పుగళ్ల మురళి, ఏనుగంటి రాములు, ప్రసాద్, రజాక్, సయ్యద్ యూసుఫ్,ఎం. డి. ఇక్బల్, కరుణ, విజయలక్ష్మి, వీరారెడ్డి,జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# అమెరికాను భయపెడుతున్న ఇరాన్ 'దోమల దండు'..!



ప్రపంచ చమురు జీవనాడి హార్మూజ్‌పై ఉక్కు పిడికిలి బిగించేందుకు ఇరాన్ ఓ ప్రత్యేక దళాన్నే సిద్ధం చేసింది. అయితే ఇది పూర్తిస్థాయిలో రంగంలోకి దిగలేదు. అమెరికా మూడు భారీ యుద్ధ విమాన వాహక నౌకలను గల్ఫ్ ప్రాంతానికి పంపినా.. అవి హార్మూజ్ వైపు వచ్చేందుకు తటపటాయిస్తున్నాయి. మరోవైపు ఐఆర్‌జీసీ మాత్రం అమెరికా నౌకలు ఎప్పుడు వచ్చినా అభ్యంతరం లేదని.. వాటికి తగిన సమాధానం చెబుతామని ప్రకటించింది. అగ్రదేశాల రక్షణ వ్యవస్థలను అలసిపోయేలా చేసే ఆయుధాలతో ఇరాన్ దళాలు హార్మూజ్ వద్ద సిద్ధంగా ఉన్నాయి.

ఏమిటీ మస్కిటో ఫ్లీట్..? : ఇరాన్ చిన్నపాటి ఫాస్ట్ బోట్స్ ఇప్పటి వరకు యుద్ధంలో ఎటువంటి ప్రభావం చూపలేదు. కానీ సముద్ర దిగ్బంధ వ్యూహంలో "మస్కిటో ఫ్లీట్"గా పిలిచే ఈ చిన్న పడవలదే కీలకపాత్ర. దాదాపు 10 టన్నుల బరువుతో ఉండే ఈ రకం ఫాస్ట్ బోట్స్ 1,500 వరకు ఇరాన్ ఐఆర్‌జీసీ నేవీ వద్ద ఉన్నాయి. టెహ్రాన్‌కు చెందిన భారీ నౌకలను ధ్వంసం చేశామని సంబరపడుతున్న అమెరికాకు ఇవి షాకిస్తున్నాయి. రెండో ప్రపంచ యుద్ధంలో పీటీ బోట్ల వ్యూహాలను నేటి ఆధునిక యాంటీ షిప్ మిసైల్ బోట్లతో సమ్మిళితం చేసి ఇరాన్ వాడుతోంది. ఈ తరహా బోట్లు 300 వరకు ఉన్నట్లు అంచనా. నాసర్, కౌసర్ వంటి షార్ట్ రేంజి సూపర్ సోనిక్ గైడెడ్ క్షిపణులను వీటిపై అమర్చి వాడుతున్నారు. వీటితోపాటు తీర ప్రాంతాల నుంచి ప్రయోగించేలా ఘదెర్, జాఫర్, అబు మహదీ వంటి క్షిపణులున్నాయి. ఇక ఈ చిన్న బోట్లు స్మార్ట్‌మైన్స్‌ను అమర్చడం వంటివి కూడా చేయగలవు. ఈ పడవలు కేవలం 50 లేదా 110 నాట్స్ వేగంతో ప్రయాణించగలవు. సముద్రంపై చురుగ్గా కదలగలవు. గుంపుగా ఈ చిన్నబోట్లు దాడి చేస్తే.. భారీ యుద్ధ నౌకల టార్గెటింగ్ వ్యవస్థలు కూడా సమస్యలను ఎదుర్కొంటాయి. కొన్నాళ్ల క్రితం హార్మూజ్‌లో జరిగిన యుద్ధ విన్యాసాల్లో 40 బోట్లు పాల్గొన్నాయి. వాస్తవానికి ఈ జలసంధి ఇరుగ్గా ఉండటంతో పెద్ద నౌకలు వేగంగా అవసరమైన దిక్కుకు మళ్లే అవకాశాలు లేవు. దీంతో అవి చిన్న బోట్ల దాడులకు ఎరగా మారే అవకాశాలు ఎక్కువ.

అన్‌మ్యాన్డ్ డ్రోన్ల బోట్లతో పెనుముప్పు..! : టెహ్రాన్ తయారు చేసిన చిన్నపాటి డ్రోన్ బోట్‌లు చమురు ట్యాంకర్లకు ప్రాణాంతకంగా మారాయి. ఇప్పటికే ట్యాంకర్లపై దాడుల్లో ఇవి పాల్గొన్నాయి. గతంలో ఉక్రెయిన్ కూడా ఇలాంటి బోట్లనే రష్యాపై వాడింది. ఇటీవల జనవరిలో ఐఆర్‌జీసీ విడుదల చేసిన వీడియోలో ఓ భూగర్భ స్థావరంలో పెద్ద సంఖ్యలో ఈ డ్రోన్‌బోట్లు ఉన్నాయి. ఇరాన్ దళాలకు అనుబంధంగా పనిచేసే హూతీలు ఇప్పటికే డ్రోన్ బోట్లను వినియోగించారు. చిన్న ఫైబర్‌గ్లాస్ లేదా చెక్క పడవలను మానవ రహిత బోట్లుగా తీర్చిదిద్దారు. ఇప్పటికే కువైట్ వద్ద సోనాంగ్ నమిబే, ఇరాక్ సమీపంలో సేఫ్‌సీ విష్ణు, జెఫిరోస్ ట్యాంకర్లపై వీటిని ప్రయోగించినట్లు అనుమానిస్తున్నారు.

అజదార్‌ను అదుపు చేయడం కష్టం.. : ఇక ఇరాన్ దళాల వద్ద అజదార్ అనే మానవ రహిత అండర్ వాటర్ వెహికల్ కూడా ఉంది. ఇది నాలుగు రోజులపాటు 600 కిలోమీటర్ల రేంజిలో గస్తీ కాయగలదు. అవసరమైతే నౌకలపై దాడి కూడా చేస్తుంది. దీనిని సైలెంట్ కిల్లర్‌గా వ్యవహరిస్తారు. అమెరికా నౌకలే లక్ష్యంగా అభివృద్ధి చేశారు. వీటిని గగనతలం నుంచి గుర్తించి ధ్వంసం చేయడం చాలా కష్టం. ఇరాన్ పన్నుతున్న ఈ వ్యూహాలు అమెరికా–ఇజ్రాయెల్ ఖర్చును గణనీయంగా పెంచుతాయి. హార్మూజ్‌పై అవి పట్టు సాధించడం అంత సులువేం కాదన్న స్థితిని తీసుకొస్తాయి.

## 200మందికి పైగా చిన్నారుల మృతి



జెనీవా : పశ్చిమాసియాలో పెరుగుతున్న వివాదం తీవ్ర మానవతా సంక్షోభానికి దారితీస్తుందని ఐక్యరాజ్యసమితికి చెందిన పిల్లల సంస్థ 'యునిసెఫ్' హెచ్చరించింది. ఫిబ్రవరి చివరలో యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి 1,100 కంటే ఎక్కువ మంది చిన్నారులు మరణించారు లేదా గాయపడినట్లు బుధవారం వెల్లడించిన ఒక ప్రకటనలో తెలిపింది. ఫిబ్రవరి 28 నుండి అమెరికా–ఇజ్రాయిల్‌లు ఇరాన్‌పై విరుచుకుపడుతున్న సంగతి తెలిసిందే. తీవ్రమవుతున్న హింస ఈ ప్రాంతంలో అనేక దేశాల్లోని మైనర్లపై వినాశకరమైన ప్రభావాన్ని చూపుతోందని యునిసెఫ్ ఆ ప్రకటనలో పేర్కొంది. మానవతా సంస్థలు మరియు స్థానిక అధికారుల చేపట్టిన అధ్యయనం ప్రకారం.. ఇరాన్‌లో సుమారు 200 మంది చిన్నారులు, లెబనాన్‌లో 91మంది, ఇజ్రాయిల్‌లో నలుగురు, కువైట్‌లో ఒకరు మరణించారు.వందలాది మంది గాయపడినట్లు తెలుస్తోంది. శతృత్వం పెరుగు తుండటం, యుద్ధం ఇతర ప్రాంతాలకు వ్యాపించడంతో మరణాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని యునిసెఫ్ హెచ్చరించింది. మరణాలు మరియు గాయాల సంఖ్యతో పాటు, యువతపై యుద్ధం పరిణామాలను యునిసెఫ్ స్పష్టం చేసింది. వైమానిక దాడులు మరియు భద్రతా సమస్యల కారణంగా పాఠ శాలలు మూసి వేయడంతో లక్షలాది మంది పిల్లలు తరగతి గదులను వీడాల్సి వచ్చింది. నిరంతర బాంబు దాడులతో లక్షలాది మంది నిరాశ్ర యులయ్యారని తెలిపింది. ఆస్పత్రులు, నీటి సరఫరా సహా కీలకమైన సేవలపై తీవ్ర ప్రభావం పడిందని, ఇది సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తుందని పేర్కొంది. అనేక కుటుంబాలు వైద్య సంరక్షణ, సురక్షితమైన ఆశ్రయం, ప్రాథమిక అవసరాలను సైతం పొందలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాయుధ పోరాటాలను చిన్నారులు ఎప్పటికీ ఎదుర్కోకూడదని యునిసెఫ్ ఆవేదన వ్యక్తం చేసింది. అంతర్జాతీయ మానవతా చట్టాలను గౌరవించాలని అన్ని దేశాలకు విజ్ఞప్తి చేసింది. పౌరులను రక్షించడానికి మరియు ప్రభావితమైన వారికి మానవతా సాయం అందేలా చేయడానికి ప్రభుత్వాలు, అంత ర్జాతీయ సమాజం తక్షణ చర్చలు చేపట్టాలని పిలుపునిచ్చింది. "ఈ ప్రాంతంలోని సుమారు 200 మిలియన్ల మంది చిన్నారులు అంత ర్జాతీయ సమాజం త్వరగా చర్యలు తీసు కోవాలని ఎదురు చూస్తున్నారు" అని యునిసెఫ్ ప్రకటించింది.

## అమెరికా వాణిజ్య భాగస్వామ్య దేశాలపై 'సెక్షన్ 301'



వాషింగ్టన్ : భారత్, చైనా, బంగ్లాదేశ్ సహా 16 కీలక వాణిజ్య భాగస్వామ్య దేశాలపై ట్రంప్ యంత్రాంగం వాణిజ్య చట్టం 1974 లోని 'సెక్షన్ 301'ను ప్రయోగించేందుకు సిద్ధమైంది. టారిఫ్‌లు చట్టవిరుద్ధమని గతనెల సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. దీంతో ఆయా దేశాలపై టారిఫ్‌ల ఒత్తిడిని పునరద్ధరించేందుకు చట్టవిరుద్ధమైన వాణిజ్య విధానాల దర్యాప్తులను ప్రారంభించింది. సెక్షన్ 301 వాణిజ్యభాగస్వామ్యులపై సుంకాలు లేదా ఇతర ప్రతీకార చర్యలను చేపట్టే అధికారం యుఎస్ వాణిజ్య ప్రతినిధికి ఇస్తుంది. ఇతర దేశాలు అనుసరిస్తున్న చట్టవిరుద్ధమైన వాణిజ్య విధానాలను సవాలు చేయడమే ఈ సెక్షన్ 301 లక్ష్యం. తమ వాణిజ్య భాగస్వాములు అనుసరిస్తున్న ట్రేడ్ పాలసీలు అమెరికా వ్యాపారాలు, ప్రయోజనాలకు నష్టం కలిగిస్తున్నాయా లేదా అనేదానిపై ఈ సెక్షన్ కింద అమెరికా దర్యాప్తు చేసేందుకు వీలు కలిగిస్తుంది. అనంతరం విచారణ, సాక్ష్యాధారాల సేకరణ అనంతరం తమకు నష్టం కలిగిస్తున్నాయంటూ ప్రపంచ వాణిజ్య సంస్థ అనుమతి లేకుండానే ఆయా దేశాలపై ఏకపక్షంగా చర్యలు తీసుకునేందుకు అవకాశం కలుగుతుంది. రానున్న ఏప్రిల్, మే నెలల్లో యూరోపియన్ యూనియన్, భారతదేశం, జపాన్, దక్షిణ కొరియా మరియు మెక్సికోలపై కొత్త సుంకాలను విధించే అవకాశం ఉందని అమెరికా వాణిజ్య ప్రతినిధి జామిసన్ గ్రీర్ పేర్కొన్నారు. అదనపు సామర్థ్య దర్యాప్తుకు లోబడి ఉన్న ఇతర వాణిజ్య భాగస్వామ్యులలో తైవాన్, వియత్నాం, థాయిలాండ్, మలేషియా, కంబోడియా, సింగపూర్, ఇండోనేషియా, బంగ్లాదేశ్, స్విట్జర్లాండ్ మరియు నార్వేలు ఉన్నాయి. అయితే ఈ వాణిజ్య దర్యాప్తు కింద అమెరికా రెండవ అతిపెద్ద వాణిజ్య భాగ స్వామ్య దేశం కెనడా పేరును సూచించలేదు. ఈ దర్యాప్తులు తయారీ రంగాల్లో నిర్మాణాత్మక అదనపు సామర్థ్యం మరియు ఉత్పత్తి ఆధారాలు ఉన్న ఆర్థిక వ్యవస్థలపై దృష్టిసారిస్తాయని బుధవారం గ్రీర్ కాన్ఫరెన్స్ కాల్‌లో మీడియాకు వెల్లడించారు. బలవంతపు శ్రమతో ఉత్పత్తి చేయబడిన వస్తువుల దిగుమతులను నిషేధించడానికి సెక్షన్ 301 కింద మరో దర్యాప్తును ప్రారంభించనున్నట్లు గ్రీర్ తెలిపారు. ఈ దర్యాప్తు 60కంటే ఎక్కువ దేశాలకు వర్తిస్తుందని అన్నారు. అమెరికా మాజీ అధ్యక్షుడు బైడన్ సంతకం చేసిన ఉయ్ఘుర్ ఫోర్స్ లేబర్ ప్రొటెక్షన్ యాక్ట్ కింద చైనా నుండి సోలార్ ప్యానెల్ దిగుమతులు మరియు ఇతర వస్తువులపై అమెరికా కఠిన ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. ఈ సెక్షన్ కింద ఈ చర్యలను ఇతర దేశాలకు విస్తరించే అవకాశం ఉంది.

## కుదేలవుతున్న శ్రీలంక తేయాకు పరిశ్రమ



కొలంబో: పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధంతో శ్రీలంక తేయాకు పరిశ్రమ కుదేలవుతోందని అధికారులు గురువారం తెలిపారు. వారానికి 10మిలియన్ల డాలర్ల నష్టాన్ని అంచనా వేస్తున్నట్లు వ్యాపారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తేయాకు సరఫరా కోసం ఆర్డర్లు ఉన్నాయని, అయితే యుద్ధం, ఇతర సమస్యలతో సరఫరా చేయలేకపోతున్నామని అన్నారు. శ్రీలంక టీ ఎగుమతుల్లో పశ్చిమాసియా దేశాలు సుమారు 52శాతం వాటా కలిగి ఉన్నాయి. 2025 గణాంకాల ప్రకారం.. సుమారు 125 మిలియన్ కిలోల టీపొడి పశ్చిమాసియా దేశాలకు ఎగుమతైంది. దీని విలువ 750మిలియన్ డాలర్లు ఉంటుందని అంచనా. ఇరాన్, ఇరాక్, లిబియా, టర్కీ, సౌదీ అరేబియా, సిరియా మరియు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ)లు టీని ప్రధానంగా దిగుమతి చేసుకుంటాయని ఆ ప్రకటన తెలిపింది. లిబియా, టర్కీలకు ఆఫ్రికా ద్వారా తేయాకు పొడిని సరఫరా చేయవచ్చని, అయితే రవాణాఖర్చులు భారంగా మారనున్నాయని తెలిపారు.

## గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు ఆపేయాలి

### ఐరాసలో తీర్మానం




పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు ఇంకా రగులుతూనే ఉన్నాయి. ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ భీకర స్థాయిలో దాడులు చేస్తున్నాయి. ఇరాన్ కూడా గల్ఫ్ దేశాలపై విరుచుకుపడుతోంది. ఇప్పటికైనా టెహ్రాన్ ఈ దాడులను ఆపేయాలని ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. భారత్ కో స్పాన్సర్‌గా తీసుకొచ్చిన ఈ తీర్మానానికి ఆమోదం లభించింది.

బహ్రెయిన్ తీసుకొచ్చిన ఈ తీర్మానంలో 130 దేశాలు కో స్పాన్సర్లుగా ఉన్నాయి. అందులో భారత్ కూడా ఒకటి. ఇరాన్ దాడులు అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘిస్తున్నాయని తీర్మానంలో పేర్కొన్నారు. ఈ యుద్ధం ప్రపంచ శాంతిభద్రతలకు తీవ్ర ముప్పును కలిగిస్తోందని ఆరోపించారు. 'బహ్రెయిన్, కువైట్, ఖతార్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, జోర్డాన్‌లపై ఇరాన్ చేస్తున్న దాడులను వెంటనే నిలిపివేయాలి' అంటూ ప్రవేశపెట్టిన తీర్మానానికి వ్యతిరేకంగా ఎవరూ ఓటు వేయలేదు. భద్రతామండలిలో మొత్తం 15 సభ్యదేశాలు ఉండగా..

13 ఓట్లతో దీనికి ఆమోదం లభిం చింది. ఈ ఓటింగ్ ప్రక్రియకు ఇరాన్ మిత్రదేశాలైన చైనా, రష్యాలు దూరంగా ఉన్నాయి. హర్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ చర్యలను కూడా ఐరాస భద్రతా మండలి ఖండించింది. అమెరికా–ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం నేత ఆయతుల్లా అలీ ఖమేనీ, ఆయన కుటుంబంలోని వారితో సహా పలువురు కీలక అధికారులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.తాజాగా ప్రవేశపెట్టిన తీర్మానంలో ఐరాస భద్రతా మండలి ఈ విషయాన్ని ప్రస్తావించకపోవడాన్ని రష్యా, చైనాలు విమర్శించాయి.

## చమురు నిల్వల విడుదలకు అమెరికా సన్నాహాలు



పశ్చిమాసియాలో కొనసాగుతోన్న ఉద్రిక్తతలతో చమురు సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. ఈ విషయం అనేక దేశాలను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ క్రమంలో అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. తమ వద్ద ఉన్న చమురు నిల్వలను విడుదల చేసేందుకు సిద్ధమైంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఓ ఇంటర్వ్యూలో స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించారు.

ఇరాన్‌తో యుద్ధం కారణంగా పెరిగిన చమురు ధరలను తగ్గించేందుకు తమ ప్రభుత్వం వ్యూహాత్మక చమురు నిల్వలను ఉపయోగించుకుంటుందని తెలిపారు. అయితే, ఎన్ని బ్యారెళ్లు విడుదల చేస్తారనే విషయాన్ని ఆయన వెల్లడించలేదు. ఇక, యుద్ధం నేపథ్యంలో చమురు ధరల నియంత్రణకు చర్యలు ప్రారంభించినట్లు యూఎస్ ఇంధన కార్యదర్శి క్రిస్ రైట్ పేర్కొన్నారు. ఇందులోభాగంగా తమ వ్యూహాత్మక నిల్వల నుంచి 172 మిలియన్ బ్యారెళ్ల చమురును విడుదల చేయనున్నట్లు తెలిపారు. వచ్చే వారం నుంచి ఇది ప్రారంభమవుతుందని.. మొత్తం విడుదలకు దాదాపు 120 రోజుల సమయం పడుతుందని స్పష్టం చేశారు.


400 మిలియన్ బ్యారెళ్ల చమురు..

ఉద్రిక్తతలు కొనసాగుతోన్న నేపథ్యంలో అంతర్జాతీయ ఇంధన సంస్థ (×జూా) కూడా ఇలాంటి నిర్ణయమే తీసుకుంది. పెద్ద మొత్తంలో చమురు నిల్వలను విడుదల చేసేందుకు అంగీకరించింది.

అత్యవసర నిల్వల నుంచి 400 మిలియన్ బ్యారెళ్ల చమురును విడుదల చేయనున్నట్లు తెలిపింది. 32 సభ్యదేశాలు ఇందుకు ఏకగ్రీవంగా మద్దతు తెలిపాయి. 2022లో ఉక్రెయిన్‌పై రష్యా దాడి చేసిన సమయంలో కూడా ఐఈఏ 182.7 మిలియన్ బ్యారెళ్ల చమురును విడుదల చేసింది.

## కారుణ్య మరణానికి సుప్రీంకోర్టు అనుమతి

### 13ఏళ్లుగా కోమాలోనే హరీశ్ రాణా



దిల్లీ: ప్రమాదవశాత్తు గాయపడి 13ఏళ్ల క్రితం కోమాలోకి వెళ్లిన యువకుడికి కారుణ్య మరణాన్ని ప్రసాదించేందుకు సుప్రీం కోర్టు బుధవారం అనుమతించింది. యువకుడి తల్లిదండ్రుల వినతిని అన్ని విధాలుగా పరిశీలించిన మీదట ఈ నిర్ణయం తీసుకుంది. సర్వోన్నత న్యాయస్థానం ఈ తరహా తీర్పు వెలువరించడం ఇదే మొట్టమొదటిసారి. గౌరవంగా మరణించే హక్కును గుర్తిస్తూ 2018లో వెలువడిన కామన్ కాజ్ కేసు తీర్పును తొలిసారిగా అమలు చేస్తున్నట్లు జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ కె.వి.విశ్వనాథన్ ధర్మాసనం ఈ సందర్భంగా పేర్కొంది. దిల్లీ సమీప గాజియాబాద్‌కు చెందిన హరీశ్ రాణా పంజాబ్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ చదువుతున్న సమయంలో 2013 ఆగస్టు 20న వసతి గృహ భవనం నాలుగో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయమై కోమాలోకి వెళ్లిపోయాడు. ఎన్ని ఆసుపత్రుల్లో చికిత్స అందించినా మార్పు కన్పించలేదు. శరీర కదలికల్లేక జీవచ్ఛవంలా మంచానికే పరిమితయ్యాడు. ట్యూబ్ ద్వారా ఆహారాన్ని అందిస్తున్నారు. ప్రస్తుతం అతని వయసు 32 ఏళ్లు.

బాధాతప్త హృదయంతో... : హరీశ్ చికిత్స కోసం ఆర్థికంగా, మానసికంగా కుంగిపోయిన అతని తల్లిదండ్రులు...కుమారుడి కారుణ్య మరణానికి అనుమతించాలంటూ 2024లో దిల్లీ హైకోర్టును, ఆ తర్వాత సుప్రీంకోర్టును వేడుకున్నారు. హరీశ్ కోలుకునే అవకాశమే లేదని దిల్లీ ఎయిమ్స్ వైద్య బృందం ఇటీవల నివేదిక ఇవ్వడంతో మళ్లీ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఒకటికి రెండు ఆసుపత్రుల వైద్య మండళ్ల నివేదికలను సుప్రీంకోర్టు పరిశీలించింది. ఈ ఏడాది జనవరి 13న హరీశ్ తల్లిదండ్రులను న్యాయ మూర్తులు వ్యక్తిగతంగా కలిసి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

## అత్యంత క్లిష్టతరమైన ఆఫ్-పంప్ బైపాస్ శస్త్ర చికిత్సతో హృద్రోగి ప్రాణాలు కాపాడిన యశోదా హాస్పిటల్




**కోదాడ మార్చి 12 (నేటి మనదేశమ్):** షుగర్, రక్తపోటు వంటి దీర్ఘకాలిక సమస్యలతో పాటు తీవ్రమైన గుండె జబ్బుతో బాధపడుతున్న అధిక ప్రమాద స్థితిలోని 61 ఏళ్ల మహిళకు మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు విజయవంతంగా క్లిష్టమైన గుండె శస్త్రచికిత్స నిర్వహించి ఆమె ప్రాణాలను కాపాడారు. ఈరోజు కోదాడలోనే పబ్లిక్ క్లబ్లో జరిగిన విలేకరుల సమావేశంలో వివరించారు. గుండెకు సరైన రక్త సరఫరా లేకపోవడం వల్ల ఛాతి నొప్పి, తీవ్ర అలసట వంటి సమస్యలతో బాధపడుతున్న ఆమె ఆసుపత్రిని సంప్రదించగా, పరీక్షల్లో గుండెకు రక్తాన్ని తీసుకెళ్లే ప్రధాన నాళంలో మళ్లీ అడ్డంకి ఏర్పడినట్లు వైద్యులు గుర్తించారు. ఇప్పటికే షుగర్, రక్తపోటు సమస్యలు ఉండటం వల్ల ఈ కేసు అత్యంత ప్రమాదకరమైనదిగా మారిందని వైద్యులు తెలిపారు.రోగి ఆరోగ్య పరిస్థితిని పూర్తిగా పరిశీలించిన అనంతరం, గుండెను ఆపకుండా నిర్వహించే అత్యాధునిక ఆఫ్-పంప్ బైపాస్ శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించారు. అనుభవజ్ఞులైన కార్డియోథోరాసిక్ వైద్య బృందం గుండెకు కొత్త రక్త మార్గాలు ఏర్పాటు చేస్తూ రెండు బైపాస్‌లను విజయవంతంగా పూర్తి చేశారు.శస్త్రచికిత్స అనంతరం రోగిని కార్డియాక్ ఐసీయూలో నిపుణుల పర్యవేక్షణలో ఉంచి చికిత్స అందించగా, అదే రోజున వెంటిలేటర్ తొలగించి ఆమెను త్వరగా కోలుకునేలా చేశారు.తదుపరి రోజుల్లో క్రమంగా నడక ప్రారంభించగా, ఎలాంటి శస్త్రచికిత్సానంతర సమస్యలు లేకుండా ఆరోగ్యం మెరుగుపడింది. గుండె పనితీరు సాధారణంగా ఉందని, గుండె బలంగా పనిచేస్తోందని పరీక్షల్లో నిర్ధారణ కావడంతో రోగిని స్థిరమైన ఆరోగ్య పరిస్థితిలో డిశ్చార్జ్ చేశారు. అధిక ప్రమాదం గల గుండె వ్యాధి కేసుల్లో కూడా గుండెను ఆపకుండా శస్త్రచికిత్స నిర్వహించే సదుపాయాలు, అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, అనుభవజ్ఞులైన గుండె శస్త్రవైద్యులు, మరియు 24 గంటల కార్డియాక్ క్రిటికల్ కేర్ సేవలు యశోదా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రత్యేకతగా నిలుస్తున్నాయని ఆసుపత్రి యాజమాన్యం తెలిపింది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న గుండె రోగులకు కూడా సకాలంలో సరైన చికిత్స అందించి విజయవంతంగా నిర్వహించే పూర్తి సామర్థ్యం యశోదా హాస్పిటల్స్‌కు ఉందని మలక్ పేట్ యశోదా హాస్పిటల్. డాక్టర్ వెంగల్ రెడ్డి సిటీ కార్డియా లార్జెస్ట్ తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో, మేనేజ్మెంట్ వాసు కిరణ్ రెడ్డి, లక్ష్మణ్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## చదువుకున్న పాఠశాలకు త్రాగునీటి సదుపాయం కల్పించిన ఏసీపీ నాగేశ్వరరావు



**మధిర ప్రతినిధి/ ముదిగొండ, మార్చి 12, నేటి మన దేశమ్.** ముదిగొండ: ముదిగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల త్రాగునీటి అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని పాఠశాల పూర్వవిద్యార్థి, వెంకటాపురం గ్రామానికి చెందిన హైదరాబాద్‌లో ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న యలమద్ది నాగేశ్వరరావు రూ.25 వేల వ్యయంతో కొత్త బోరు మోటర్‌ను ఏర్పాటు చేయించారు. ఈ మోటర్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శాంతి ప్రారంభించారు. చదువుకున్న పాఠశాలకు సహాయం చేసిన నాగేశ్వరరావును గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ చెరుకురి పార్వతీ, వార్డు సభ్యుడు ఎస్కే దస్తగిరి, మాజీ సర్పంచ్ కోటి అంతరాములు, గ్రామస్తులు కొమ్ము నర్సింహారావు, చెరుకూరి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మార్కెట్లో పారిశుద్ధ్య నిర్వహణ: కమిషనర్ అశ్రిత్ కుమార్



**సిద్ద్‌పేట మార్చి 12 నేటి మనదేశమ్ ప్రతినిధి :** సిద్దిపేట పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా నేడు పారిశుద్ధ్య నిర్వహణ పనులను కమిషనర్ అశ్రిత్ కుమార్ మున్సిపల్ సిబ్బంది, మార్కెట్ సిబ్బందితో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా మార్కెట్ లో ఉన్నటువంటి చెత్తను శుభ్రం చేయించడం జరిగింది. మార్కెట్లో ప్లాస్టిక్ గ్లాసులు ,కవర్లు, చెత్త ఉండడం గమనించి మార్కెట్కు వచ్చే విక్రయిదారులు, కూలీలు ఇతరులు ఎవరు కూడా చెత్త బహిరంగ ప్రాంతంలో వేయకుండా అవగాహన కల్పించాలని సూచించారు. ఎ మార్ట్ వెనుకవైపున చెత్తను కాల్చడం గమనించి మరోసారి ఇది పునరావృతమైనట్లయితే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. మార్కెట్ ఆవరణ పరిశీలిస్తున్న సమయంలో ఇద్దరు పురుషులు బహిరంగ మలవిసర్జన చేయడం గమనించి వారిని పిలిచి పది అడుగుల దూరంలో పబ్లిక్ హైలైట్ ఉందని ఉన్న పబ్లిక్ టాయిలెట్ సద్వినియోగం చేసుకోవాల్సింది పోయి బహిరంగ ప్రాంతంలో మలవిసర్జన చేస్తార అని హెచ్చరించి 200 రూపాయలు జరిమానా విధించడం జరిగింది. అనంతరం పక్కనే ఉన్న పబ్లిక్ టాయిలెట్ నిర్వహణను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మార్కెట్కు ఎంతో మంది వచ్చి పోతుంటారని అందరూ పబ్లిక్ టాయిలెట్ సద్వినియోగం చేసుకుంటారు కాబట్టి తప్పనిసరిగా ప్రతిరోజు శుభ్రం చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. సాయంత్రం మార్కెట్లో ఉన్నటువంటి బృందావనం గ్రాండ్ హోటల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. హోటల్లో ఉన్నటువంటి ఫ్రిజ్ లో స్టోర్ చేసిన మటన్, చికెన్ ఇతర ఆహార పదార్థాలను చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడవద్దని హెచ్చరించారు. తాజా ఆహార పదార్థాలు లేకపోవడం, కాల పరిమితి దాటిన సరుకులు ఉండడం వలన 15000 రూపాయలు జరిమానా విధించడం జరిగింది.

## ఇమ్మడి గోపి హత్య నిందితుల కు కఠిన శిక్ష వెయ్యాలి

**కామారెడ్డ్,మార్చ్ 12.(నేటి మనదేశమ్ ప్రతినిధి)** నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి కి చెందిన రాష్ట్ర ముదిరాజ్ నాయకుడు ఇమ్మడి గోపి హత్యకు కారకులైన నిందితులకు కఠిన శిక్ష పడే విధంగా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పున్న రాజేశ్వర్, కామారెడ్డి జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు గజ్జల బిక్షపతి, ముదిరాజ్ సంఘం యువజన విభాగం ఉపాధ్యక్షులు నంద రమేష్ లు డిమాండ్ చేశారు. గురువారం వారు కామారెడ్డి లో మాట్లాడుతూ, ఇమ్మడి గోపి హత్య నిందితులను వెంటనే అరెస్టు చేయాలని వారు కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ముదిరాజులు ఇమ్మడి గోపి హత్యను ఖండించాలని పిలుపునిచ్చారు.నిందితులను పట్టుకొని కఠిన శిక్ష పడే విధంగా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని వారు కోరారు. గోపి హత్యను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

## నిజమైన భూదాన్ బాధితులకు తీవ్ర అన్యాయం

**పైరవీ కారులకు పట్టాలు ఇచ్చారు**

**రీ సర్వే చేసి నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలి**

**అక్రమాలకు పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి**

**విలేకరుల సమావేశంలో వెలుగుమట్ల భూదాన్ బాధితులు**




**ఖమ్మం, మార్చి 12, నేటిమనదేశమ్, ప్రతినిధి:** ఖమ్మం వెలుగుమట్లలో నిజమైన భూదాన్ బాధితులకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వకుండా, కొంతమంది అనర్హులకు, అక్రమార్కులకు, పైరవీకారులకు పట్టాలు పంపిణీ చేశారని, అసలైన బాధితులకు తీవ్ర అన్యాయం జరిగిందని భూదాన్ భూముల బాధితులు పేర్కొన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో భూదాన్ బాధితులు సత్యనారాయణ రెడ్డి, నరగాని కోటేశ్వరరావు, రవి, సీతారాములు, కళ్యాణి, కవిత, జయమ్మ లు మాట్లాడుతూ... 8 సంవత్సరాలుగా తాము వెలుగుమట్ల భూదాన్ భూములలో గుడిసెలు వేసుకుని, ఇండ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నామని, కొందరు వ్యక్తులు తమ వద్ద డబ్బులు వసూలు చేసి ఇండ్ల స్థలాలు ఇస్తామని చెప్పి తమను మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులు హడావుడిగా, సక్రమంగా సర్వే చేయకుండా అసలైన లబ్ధిదారులను గుర్తించకుండా, కాలనీకి చెందని వారికి పట్టాలి ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు..? ఎటువంటి సౌకర్యాలు లేకపోయినా రాత్రింబవళ్లు చీకట్లో ఉండి పాములు, తేళ్ల మధ్య నివాసం గడిపి, నీళ్లు లేక, కరెంటు లేక అనేక ఇబ్బందులు పడ్డ తమలాంటి కుటుంబాలను గుర్తించకుండా అనర్హులను ఎలా ఎంపిక చేస్తారని నిలదీశారు. సర్వం కూలిపోయి రోడ్డు పాలైన తమలాంటి వారికి అన్యాయం చేయటం సరైనది కాదన్నారు. మరొక్కసారి రీ సర్వే నిర్వహించి నిజమైన లబ్ధిదారులను గుర్తించి తమను ఆదుకోవాలని వేడుకున్నారు. ఈ విలేకరుల సమావేశంలో సిరికొండ కళ్యాణి, గాదె భాగ్యలక్ష్మి, పసుమర్తి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికతో గ్రామాలు, పట్టణాల సమగ్ర అభివృద్ధి

**ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీషబ్బీర్**




**కామారెడ్డ్,మార్చ్ 12.(నేటి మనదేశమ్ ప్రతినిధి)** రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడంతో పాటు గ్రామాలు, పట్టణాల సమగ్ర అభివృద్ధి కోసం "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కింద 99 రోజుల కార్యచరణ ప్రణాళికను అమలు చేస్తోందని ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్ తెలిపారు.కామారెడ్డి పట్టణంలోని కళాభారతిలో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అవగాహన సదస్సులో షబ్బీర్ అలీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, వివిధ విభాగాల జిల్లా అధికారులు, నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు ఈ సందర్భంగా ప్రభుత్వ 99 రోజుల కార్యచరణ ప్రణాళికపై ప్రజాప్రతినిధులకు, అధికారులకు విస్తృత అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు ఈ 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను తీసుకువచ్చిందని చెప్పారు. ప్రభుత్వ పథకాలు నిజంగా ప్రజలకు చేరాలంటే గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామాలు, పట్టణాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, వీధి దీపాలు, డ్రైనేజీ వ్యవస్థలు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఆయన తెలిపారు.అలాగే ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలను త్వరగా పరిష్కరించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమం ద్వారా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ప్రభుత్వ లక్ష్యాలు, కార్యాచరణ విధానం గురించి స్పష్టమైన అవగాహన కల్పిస్తున్నామని ఆయన అన్నారు.గ్రామాలు, పట్టణాల అభివృద్ధిలో సర్పంచులు, కౌన్సిలర్లు, వార్డు సభ్యులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టిన ఈ 99 రోజుల కార్యచరణ ప్రణాళికను విజయవంతం చేయడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలని షబ్బీర్ అలీ పిలుపునిచ్చారు.ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించి అభివృద్ధి ఫలాలను ప్రతి కుటుంబానికి చేరవేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ చైర్ పర్సన్‌లు,కౌన్సిలర్లు, సర్పంచులు, వార్డు మెంబర్లు మరియు ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముఖ్య అనుచరుడి పాడే మోసిన షబ్బీర్ అలీ మానవత్వాన్ని చాటిన నేత

**కామారెడ్డ్,మార్చ్ 12. (నేటి మనదేశమ్ ప్రతినిధి)** రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందిన మాజీ జెడ్పిటిసి ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి అంతిమయాత్రలో ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్ పాల్గొని




తన మానవత్వాన్ని చాటుకున్నారు.మోహన్ రెడ్డి చివరి మజిలీలో షబ్బీర్ అలీ వారి నివాసానికి చేరుకుని భౌతికకాయంపై పూలగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు.అనంతరం శోకసంద్రం లో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు.అనంతరం జరిగిన అంతిమయాత్రలో షబ్బీర్ అలీ స్వయంగా పాడే మోసి తన ముఖ్య అనుచరుడి పట్ల ఉన్న ఆత్మీయతను, అనుబంధాన్ని చాటుకున్నారు. అందరితో కలిసి నడుస్తూ చివరి యాత్రలో పాల్గొనడం అక్కడున్న వారిని భావోద్వేగానికి గురి చేసింది.ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ మోహన్ రెడ్డి పార్టీకి నిబద్ధతతో పనిచేసిన మంచి నాయకుడు. ఆయన మరణం నాకు వ్యక్తిగతంగా తీరని లోటు. వారి కుటుంబానికి ఎల్లప్పుడూ నేను అండగా ఉంటాను అని తెలిపారు.

## కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, వీ=హా ధనియాల వెంకటేశ్వర్లు




**భద్రాద్రి కొత్తగూడెం, మార్చ్ 12.(నేటిమన దేశమ్ ప్రతినిధి)** భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు , భద్రాచలం తహసిల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు .పట్టణంలోని 42 కుటుంబాలకు 42,04,872రూ,,లు (అక్షరాల నాలబై రెండు లక్షల నాలుగు వేల ఎనిమిది వందల 72 రూపాయలు) కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు గారి చేతుల మీదగా సంబంధితలకు అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల అధికారులు, మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతు లకు చివరి అయకట్టు వరకు నీరు అందాలి: మాజీ మంత్రి హరీష్ రావు





**సిద్ద్‌పేట మార్చి 12 నేటి మనదేశమ్ ప్రతినిధి :** సిద్దిపేట నియోజకవర్గంలో కాళేశ్వరం లో భాగంగా నిర్మించిన రంగనాయక సాగర్ నుండి నంగునూర్ మండలం లు వెళ్లే కుడి కాలువ లో గత కొద్ది రోజుల నుండి తుంగ మరియు పూడిక పెరుక పోయి 310 క్యూసెక్కులు వెళ్లాల్సిన నీరు 115 క్యూసెలక్కుల నీరు మాత్రమే పోతుందని రైతు లు కు నీరు రాక ఇబ్బందులు పడుతున్నారని హరీష్ రావు ద్రుష్టి కి రాగ హైదరాబాద్ నుండి ఇరిగేషన్ ఎస్ ఈ సుధా కిరణ్ తో హరీష్ రావు ఫోన్ లో మాట్లాడారు ఈ సందర్బంగా నంగునూర్ మండలం కు వెళ్లే ప్రధాన కుడి కాలువ లో తుంగా పెరుక పోయింది ముందే తొలగించాలని మీ ద్రుష్టి కి తెచ్చామని అయిన తొలిగించక కాలువ లో నీరు స్లో గా వెళ్లి సకాలంలో చెరువుల్లో నీరు అందక రైతు ల పంట పొలాలకు నీళ్లు రాక ఆందోళన చెందుతున్నారన్నారు, ముఖ్యం గా మిట్టపల్లి వద్ద కాలువ లోతుగా ఉండటం వలన సాధారణ ఇటాచ్, జేసీబి లతో కాదు అందువలన లాంగ్ భూం మిషన్ ను వెంటనే ఏర్పాటు చేసి కాలువల్లో తుంగను పూడిక ను తొలగించాలని చెప్పారు.. రైతు లకు చివరి ఆయకట్టు వరకు నీళ్లు అందేల చూడాలని ఆదేశించారు.

## బదిలీపై వెళ్తున్న డాక్టర్లకు సన్మానం చేసిన బీఆర్ఎస్ నాయకులు




**మందమర్రి మార్చి 12 (నేటి మనదేశమ్):** మందమరి పట్టణంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో పనిచేస్తున్నటువంటి ఇద్దరు వైద్యులకు పీజీ వైద్య విద్యలో సీట్లు రావడం జరిగింది బదిలీపై వెళ్తున్న సందర్భంగా డాక్టర్ రమేష్ డాక్టర్ మానస.ఈరోజు బిఆర్ఎస్ పట్టణ నాయకులు వైద్యులకు సన్మానం చేయడం జరిగింది ఎండి అబ్బాస్ బర్ల సదానందం వేముల నర్సయ్య సాగర్ బాబు మజారు సలవుద్దీన్ నోముల శ్రీధర్ గౌడ్ వైద్యులకు ఘనంగా సన్మానం చేయడం జరిగింది.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



**జూబ్లీహిల్స్ మార్చ్ 12 (నేటి మన దేశమ్ ప్రతినిధి)** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం వెంగళరావునగర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ కార్పొరేటర్ దేదీప్య విజయ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జూబ్లీహిల్స్ మాజీ శాసనసభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొనీ మహిళలతో కలిసి కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి చేతుల మీదుగా అంగన్వాడీ టీచర్లకు, ఆశ వర్కర్లకు బహుమతులు మహిళలకు చీరలను పంపిణీ చేశారు. అనంతరం అయన మాట్లాడుతూ.. కుటుంబం నుంచి సమాజం వరకు ప్రతి రంగంలో మహిళల పాత్ర అమూల్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజల మన్ననలు పొందేలా ప్రజా ప్రతినిధులు పని చేయాలి

● రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి ● శిక్షణ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు సద్వినియోగం చేసుకోవాలి ● గ్రామ పంచాయతీ నిధులను ప్రణాళిక బద్ధంగా వినియోగించాలి ● ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రజా ప్రతినిధులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి, జిల్లా కలెక్టర్

**ఖమ్మం,మార్చి 12 (నేటి మనదేశమ్):** ఫలానా నాయకుని హయంలో మా ప్రాంతం బాగా అభివృద్ధి చెందిందని ప్రజల మన్ననలు పొందేలా ప్రజా ప్రతినిధులు పని చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, గురువారం ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రంలో నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచులు, మునిసిపల్ చైర్ పర్సన్, వార్డు కౌన్సిలర్ లు, ఇతర ప్రజా ప్రతినిధులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయిలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి, రాష్ట్ర కేబినెట్ ఆలోచనల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్నామని, ప్రజల కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు గురించి అవగాహన కల్పించడంతో పాటు అర్హులైన లబ్ధిదారు లకు అవి చేరేలా చూడాలని తెలిపారు. డబ్బు సంపాదించడం కోసం ప్రజా ప్రతినిధులు ఎవరు రాజకీయంలోకి రాలేదని అన్నారు. సర్పంచ్ నుంచి కలెక్టర్ వరకు ప్రజలకు సేవ చేసే అవకాశం భగవంతుడు మనకు అందించారని, మనం అధికారంలో ఉన్న సమయంలో గ్రామంలో మంచి అభివృద్ధి జరిగింది, మంచి పనులు జరిగాయనే మంచి పేరు సంపాదించాలని తాపత్రయ పడతామని మంత్రి అన్నారు. ఓట్లు వేసిన ప్రజలకు మంచి చేయాల్సిన బాధ్యత మనపై నేడు ఉందని అన్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం కొంత సమయం కేటాయిస్తే క్షేత్రస్థాయిలో మంచి మార్పు కనిపిస్తుందని అన్నారు. పాలక వర్గాలు లేక గ్రామాలకు నిధులు రాలేదని, గత నెలన్నర కాలంలో పెద్ద ఎత్తున నిధులు విడుదల అయ్యాయని, మార్చి 31 లోపు మరిన్ని నిధులు విడుదల అవుతాయని మంత్రి తెలిపారు. ప్రతి గ్రామానికి జనాభా ఆధారంగా 5 లక్షల నుంచి 60 లక్షల రూపాయల వరకు నిధులు విడుదల అయ్యాయని, ఈ నిధులు ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలని అన్నారు. చట్ట పరిధిలో నిధులను సద్వినియోగం చేయాలని, ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం కాకుండా కాపలాదారుగా ఉండాలని తెలిపారు. పేద ప్రజలకు నిరంతరం మంచి చేసే విధంగా, రాజకీయాలకతీతంగా ప్రభుత్వం పని చేస్తున్నదని అన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలు ఉంటాయని, ప్రస్తుతం గెలిచిన ప్రతి ఒక్క ప్రజా ప్రతినిధి ఆ ప్రాంతాల అభివృద్ధి కోసం పని చేయాలని కోరారు. ప్రతి ప్రాంత అభివృద్ధికి



పార్టీలకతీతంగా తన సహకారం ఉంటుందని ఆయన తెలిపారు. రాబోయే వేసవిలో త్రాగునీటి సమస్య ఏ గ్రామంలో లేకుండా ఉండే విధంగా అధికారులు, నూతన ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని మంత్రి సూచించారు. గ్రామ పంచాయతీకి విడుదలైన నిధులు సద్వినియోగం అయ్యే విధంగా ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు తెలిపారు. గ్రామాలలో సమస్యలు కేవలం డబ్బుతో మాత్రమే పరిష్కారం కావని అన్నారు. సిసి రోడ్ల, డ్రైయిన్ నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టడం చాలా కీలకమని అన్నారు. గ్రామాలలో నిర్మించే నూతన రోడ్లు, డ్రైయిన్ సమయంలో అధికారులు ప్రజా ప్రతినిధుల పర్యవేక్షణ అధికంగా ఉండాలని, ఎక్కడ కూడా మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని అన్నారు. ప్రజలతో నిరంతరం ప్రజా ప్రతినిధులు అందుబాటులో ఉంటూ సమయస్ఫూర్తితో ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాలని అన్నారు. నేటి శిక్షణ కార్యక్రమాన్ని ప్రజా ప్రతినిధులు సరిగ్గా వినియోగించు కోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాలు మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం విజయవంతం చేసేందుకు స్థానిక ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయడం కీలకమని తెలిపారు. 99 రోజుల కార్యక్రమం పై స్థానిక ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించేందుకు శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నేడు ఈ శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులకు గుర్తింపు కార్డులు, 99 రోజుల కార్యక్రమంపై మెటీరియల్ అందించామని అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 99 రోజుల పాటు 10




థీమ్స్ లో చేపట్టే ప్రోగ్రాంలలో ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం, ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమాలైన వివిధ సంక్షేమ, అభివృద్ధి పనుల అమలు గురించి అవగాహన, పంచాయతీ, మున్సిపల్ చట్టాల గురించి కూడా శిక్షణ అందిస్తామని కలెక్టర్ తెలిపారు. నేటి శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుంటే క్షేత్రస్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుందని అన్నారు. ఇంటారాక్టివ్ సెషన్ లాగా నేటి శిక్షణ కార్యక్రమం ఉంటుందని, ప్రతి ఒక్కరూ తమకు ఉన్న సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ కోరారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సర్పంచ్, పట్టణ ప్రాంత ప్రజా ప్రతినిధులకు విధి నిర్వహణ, ప్రభుత్వ ముఖ్యమైన కార్యక్రమాలు ప్రజలకు అందించేందుకు ఉన్న నిబంధనలు విధివిధానాల గురించి తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతో 99 రోజుల కార్యాచరణ చేపట్టడం జరిగిందని అన్నారు. ప్రతి ఒక్క ప్రజా ప్రతినిధి తమ గ్రామం, మున్సిపల్ వార్డు/డివిజన్ పరిధిలో నిబంధనల ప్రకారం బాగా పనిచేసి జాతీయస్థాయిలో ఆదర్శ వంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, డిఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, పంచాయతీ రాజ్ డిప్యూటీ కమీషనర్, జిల్లా ప్రత్యేక అధికారిణి విద్యాలత, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, డిపిఓ రాంబాబు, డిఆర్డిఓ కె. శ్రీరామ్, సిపిఓ ఏ. శ్రీనివాస్, డివైఎస్ఓ సునీల్ రెడ్డి, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ రామారావు, ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఎన్. విజయలక్ష్మీ, అడిషనల్ డిఎంహెచ్ఓ డాక్టర్ చందు నాయక్, ఎంపీడీఓలు, సంబంధిత అధికారులు, సర్పంచులు, మునిసిపల్ చైర్ పర్సన్లు, వార్డు కౌన్సిలర్ లు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలి..

**జిల్లా కలెక్టర్ కె .హరిత**

**ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికపై నూతన ప్రజాప్రతినిధులకు శిక్షణ..**



**ఆసిఫాబాద్, మార్చి 12 (నేటి మనదేశమ్):** : ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం జిల్లా కలెక్టరేట్‌లో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మీ, అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్ రావుతో కలసి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. హరిత మాట్లాడుతూ గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికను అమలు చేస్తున్నదన్నారు. గ్రామాలలో పారిశుధ్యం, తాగునీరు, విద్య, ఆరోగ్యం, పచ్చదనం, మౌలిక వసతులు వంటి అంశాలపై స్పష్టమైన లక్ష్యాలతో 99 రోజుల ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు గ్రామ ప్రజల సమస్యలను గుర్తించి ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. గ్రామాభివృద్ధికి సంబంధించి చేపట్టాల్సిన పనులు, ప్రజాప్రతినిధుల బాధ్యతలు, ప్రభుత్వ పథకాల అమలు విధానాలపై అధికారులు సర్పంచులు, కౌన్సిలర్లకు అవగాహన కల్పించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా పని చేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామ అభివృద్ధికి సంబంధించిన 10 ప్రధాన అంశాలపై రూపొందించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను ఈ సందర్భంగా అధికార యంత్రాంగం వివరించింది. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్మన్లు మెంగ్రే ఆకాశ్, షాహిద్ సుల్తానా, డీపీవో భిక్షపతి, డీఆర్‌డీఓ దత్తారావు, సీపీఓ లక్ష్మీనారాయణ, సర్పంచులు, కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన తహసీల్దార్. -కె ఆర్ కె.. ప్రసాద్.



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: మార్చి 12 :బూర్గం పహాడ్ (నేటి మన దేశమ్ ప్రతినిధి)**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన బూర్గంపహాడ్ మండల తహసీల్దార్ ప్రసాద్.. నేరుగా రక్త పరీక్షల కేంద్రానికి వెళ్లి రికార్డులు పరిశీలించి, రోగుల యొక్క పరీక్షల వివరాలను ల్యాబ్ ఇంచార్ రాజును అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి లో వైద్య సేవల గురించి సూపర్డెంట్ డాక్టర్ ఎం. ముక్కెంటేశ్వరావు ను అడిగి తెలుసుకొన్నారు. రోగుల వార్డును పరిశీలించి రోగులతో మాట్లాడి వైద్యం అందే విధానం పై వారిని అడిగి తెలుసుకన్నారు. అనంతరం ఆసుపత్రిలో ..హెచ్. పి.వి.. వ్యాక్సిన్ కేంద్రంని పరిశీలించారు. డాక్టర్ అమరేందర్ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది కి పలు సూచనలు చేశారు.

## బ్యాట్ పట్టి క్రికెట్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యేకోవ లక్ష్మి






**ఆసిఫాబాద్, మార్చి 12 (నేటి మనదేశమ్):** : రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామంలో విలేజ్ లెవల్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఎమ్మెల్యే కోవ లక్ష్మి బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పి ఏ సి ఎస్ మాజీ వైస్ చైర్మన్ రంగు మహేష్ గౌడ్ తండ్రి స్వర్గీయ రంగు వెంకటి గౌడ్ జ్ఞాపకార్థం పోటీలను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐక్యతతో పాటు క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తాయని అన్నారు. గెలుపు–ఓటములను సమానంగా స్వీకరిస్తూ ముందుకు సాగాలని యువతకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి టోర్నమెంట్లు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పోటు శ్రీధర్ రెడ్డి, సర్పంచ్ దుర్గం భరద్వాజ్, ఉపసర్పంచ్ వరలక్ష్మి దుర్గారావు, మాజీ సింగిల్ విండో చైర్మన్ కర్నాతం సంజీవ్, పెసరు మధునయ్య, పందిర్ల మధునయ్య,దుర్గం తిరుపతి, బోర్కుటె తిరుపతి, బుర్స పోచమల్లు, బొమ్మినేని శ్రీధర్, సంఘం శ్రీను, ప్రభాకర్, జుమ్మిడి ఆనంద్,దోబే విలాస్,ఇప్ప భీమయ్య, రంగు శీను,వినోద్ జైస్వాల్, కుందారపు శంకరమ్మ, మన్యేం పద్మ, ఉబెదుల్లా, సాయి,దోమల వెంకన్న, వాడాయి అరుణ్ తదితర ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, క్రీడాకారులు, యువత పాల్గొన్నారు

## ట్యాంకర్ల నుండి నూనె చోరీ- కోదాడలో అడ్డంగా దొరికిపోయిన ఆయిల్ ముఠా



**కోదాడ మార్చి 12 (నేటి మనదేశమ్):** కోదాడ పట్టణంలో అక్రమంగా సాగుతున్న ఆయిల్ దందా బట్టబయలైంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి హైదరాబాద్‌కు తరలుతున్న రైస్ బ్రాన్ ఆయిల్ ట్యాంకర్ల నుండి గుట్టుచప్పుడు కాకుండా నూనెను దొంగిలిస్తున్న వైనాన్ని స్థానికులు గుర్తించారు. ఆంధ్రప్రదేశ్ ఏలూరు నుండి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్లను కోదాడ శివారులో నిలిపివేస్తున్నారు. ట్యాంకర్ డ్రైవర్లు తమ స్వలాభం కోసం, లోపల ఉన్న నూనెను దొంగతనంగా తీసి స్థానిక అక్రమ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఇలా తీసిన నూనెను కాళీ డబ్బాలలో నింపి, ఆటోల ద్వారా స్థానిక వ్యాపార్సతుడికి అమ్ముతున్నారు. అక్కడ నుండి హోటళ్లు మరియు షాపులకు తరలిస్తున్నారు. ఈరోజు పట్టణంలో ఆయిల్ డబ్బాలను ఆటోలో అనుమానాస్పదంగా తరలిస్తుండగా స్థానికులు గమనించారు. వెంటనే ఆటోను అడ్డుకుని తనిఖీ చేయగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ట్యాంకర్ల నుండి తీసిన నూనెను తక్కువ ధరకు కొని, స్థానిక వ్యాపారస్తుడు కొని మార్కెట్‌లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు, ఆయిల్ డబ్బాలను తరలిస్తున్న ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ట్యాంకర్ డ్రైవర్ పాత్రపై మరియు దీని వెనుక ఉన్న ఇతర వ్యక్తులపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు.

## మందమర్రి మండలం గద్దెరాగడి అమ్మగార్డెన్ లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం.



**మందమర్రి మార్చి 12 (నేటి మనదేశమ్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక పై స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు శిక్షణ తరగతులు. పాల్గొన్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,మంచిర్యాల డీసీపీ భాస్కర్,అడిషనల్ కలెక్టర్ చంద్రయ్య,వివిధ శాఖల అధికారులు. పాల్గొన్న గ్రామ పంచాయతీల సర్పంచ్ లు,మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ,డిప్యూటీ మేయర్ ,కార్పొరేటర్లు, మున్సిపాలిటీల చైర్ పర్సన్ లు ,వైస్ చైర్ పర్సన్ లు కౌన్సిలర్లు. గ్రామీణ ప్రాంతాలు,మున్సిపాలిటీల్లో నెలకొన్న సమస్యలు,అభివృద్ధి పనుల పురోగతి పై ప్రజా ప్రతినిధులను వివరాలు అడిగి తెలుసుకున్న కలెక్టర్. దీపక్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు

## ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా వాలిన చెట్టు... వెంటనే తొలగించాలని ప్రయాణికుల డిమాండ్..

**పట్టించుకోని సంబంధిత శాఖ ( ఆర్ అండ్ బి) అధికారులు**




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: మార్చి 12 :బూర్గం పహాడ్ ( నేటి మన దేశమ్ ప్రతినిధి)**భద్రాద్రి కొత్తగూడెం జిల్లాబూర్గంపాడు మండలంలోని ఇరవెండి మోతే గ్రామాల మధ్య లో గల అడవిలో స్థానిక ప్రధాన రహదారిపై ఒక పెద్ద చెట్టు ప్రమాదకరంగా వాలి ఉండటంతో ప్రయాణికులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారి పక్కన ఉన్న ఈ చెట్టు ఇటీవల గాలులు, వర్షాల కారణంగా రహదారి వైపు వాలిపోయి ఎప్పుడైనా కూలే పరిస్థితిలో ఉంది. ఈ మార్గంలో ప్రతిరోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో ప్రమాదం సంభవించే అవకాశముందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఈ చెట్టు కిందుగా వెళ్లేందుకు భయపడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం చెట్టు పరిస్థితి చూసిన ప్రయాణికులు మరియు స్థానికులు సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ప్రమాదకరంగా వాలిన చెట్టును తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎలాంటి ప్రమాదం జరగకముందే .ఆర్ అండ్. బి.. అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు

## ఆత్మీయత.. మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



**జూబ్లీహిల్స్ మార్చ్ 07 (నేటి మన దేశమ్ ప్రతినిధి)**పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వాళ్ళలా నవీన్ యాదవ్ అన్నారు. బుధవారం వెంకటగిరి ఐలాం కాలనీలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ హాజరై ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇఫ్తార్ విందులలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రంజాన్ మాస విశిష్టతను కొనియాడారు. అన్ని మతాలు చెప్పేది ఒక్కటేనని, మనషులంతా సోదర భావంతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సంజయ్ గౌడ్, రహమాత్ నగర్ మాజీ కార్పొరేటర్ సిఎన్ రెడ్డి, స్థానిక మైనార్టీ నాయకులు, కాలనీ వాసులు మరియు ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

## కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే డా" తెల్లం వెంకట్రావు...




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మార్చి 12, (నేటి మనదేశమ్),**భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం లో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, తహసిల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు. భద్రాచలం పట్టణంలోని 42 కుటుంబాలకు 42,04,872రూ,,లు (అక్షరాల నాలబై రెండు లక్షల నాలుగు వేల ఎనిమిది వందల 72 రూపాయలు) కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు చేతుల మీదగా సంబంధితలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from # 5-5-426, M.J. Road, Hyderabad and
Printed at SKYLINE PRESS, # D.No. 5-5-426, M.J. Road, Hyderabad - 500 001 . Ph: 24734846, 9701891645, E-mail: netimanadesam96@gmail.com